ప్రజలే ప్రభువులు

# జనబలం

జులై 2024 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-

## అధికారానికి లక్ష్యం కీలకం





## పథకాల పేరు మారిస్తే చాలదు తీరు మారాలి




## మోదీ సంకీర్ణ సారథ్యం




## కొత్త నేర న్యాయ చట్టాలు



## EVMల ట్యాంపరింగ్ ఆరోపణలు






# ఆరోగ్య రంగంలో నైతిక వ్యాపార పద్ధతులు, నిబద్ధత

కేవలం అనారోగ్యానికయ్యే ఖర్చుల వల్ల దేశంలో అప్పటిదాకా పేదలుకాని 6.3 కోట్ల మంది ఏటా పేదరికంలోకి జారిపోతున్నారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

'సంఘటిత కృషి ద్వారా ఆరోగ్య రంగంలో నైతిక వ్యాపార పద్ధతులు, నిబద్ధత' అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూఎన్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ ఇండియా, ఎఫ్‌టీసీసీఐ, కపిటి గ్రూప్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఇందులో ఆరోగ్య రంగానికి సంబంధించిన పలువురు పాల్గొన్నారు.



సరైన సమయంలో, ఎంతో అవసరమైన సమావేశమిది అని జేపీ అన్నారు. కేవలం ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవటం వల్ల దేశంలో పేదరికం పెరుగుతోందని తెలిపారు. నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులో లేనప్పుడు ప్రజలు ఆర్థికాభివృద్ధి గురించి పట్టించుకోరన్నారు. ప్రజల్లో ఉన్న అపనమ్మకం ఇటీవలి ఎన్నికల తీర్పులో కూడా ప్రతిఫలించిందన్నారు. భారతదేశం జాతీయాదాయంలో కేవలం 1.2% మాత్రమే ఆరోగ్య రంగానికి వెచ్చిస్తోందన్నారు. దశాబ్దాలపాటు పాలన సాగించినా ప్రభుత్వాలు ఆ మొత్తాన్ని 2%కి పెంచలేదన్నారు. క్రమంగానైనా ఆ మేర పెంచటం అవసరమన్నారు. ఆరోగ్య రంగంపై అమెరికా 18%, బ్రిటన్ 12% దాకా ఖర్చు చేస్తున్నాయన్నారు. విద్యలో మన దేశం ఎక్కువ డబ్బే ఖర్చు చేస్తున్నా ఫలితాలు రావటం లేదని, ఆరోగ్యంలో తక్కువ ఖర్చు చేస్తూ ఆ వ్యయాన్ని కూడా సరైన రీతిలో చేయకపోవటం వల్ల ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు.

దేశంలో వృత్తిపరమైన నియంత్రణా వ్యవస్థ విఫలమైందని జేపీ అన్నారు. యూనియన్లు తమ సొంత ప్రయోజనాలు కాపాడుకోవటానికి మాత్రమే ప్రాధాన్యతనిస్తుండటం వల్ల నియంత్రణ సమస్యగా కొనసాగుతోందన్నారు. భారత్‌కి సరైన వృత్తి నియంత్రణ ఏర్పాటు అవసరమన్నారు.

ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ సింఘా, కపిటి గ్రూప్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ తారకేశ్వరి పొలాకి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

జూలై 2024

సంపుటి 25 సంచిక 07


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




## లోపలి పేజీలలో..


➥ అధికారానికి లక్ష్యం.. రాజకీయాలకు సూత్రబద్ధత అవసరం 5

➥ మోదీ 3.0 సంకీర్ణ సారథ్యం 7

➥ ఎలాంటి వారు ప్రజా జీవితానికి ఆకర్షితులవుతున్నారు 12

➥ ఎన్నికలు-ఇంగితజ్ఞానం 15

➥ ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి ఎలా? సంక్షేమం ఎలా? 21



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# "ఇండియన్ పేపర్ లీకేజీ" క్రీడ!

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయసభల్లో జరిగిన చర్చ సందర్భంగా ప్రశ్నాపత్రాల లీకేజీ సమస్యను పలువురు సభ్యులు ప్రస్తావించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ మాఫియా ఒకటి దేశంలో పని చేస్తున్నదని వారు సభ దృష్టికి తీసుకు వచ్చారు.

దేశంలో రెండు రకాల ఐపిఎల్ క్రీడలు జరుగుతున్నాయని బ్యాట్‌కు బంతికి మధ్య జరిగే క్రికెట్ క్రీడ ఒకటి కాగా , యువత భవితవ్యానికి – పేపర్ లీకేజీ కి మధ్య జరుగుతున్న "ఇండియన్ పేపర్ లీకేజీ" క్రీడ రెండోది అని ఎంపీ రాఘవ్ చడ్డా సరిగ్గానే అభివర్ణించారు. ఇరవై నాలుగు లక్షలమంది అభ్యర్థులు హాజరైన నీట్ – యు.జి. 2024 ప్రశ్నాపత్రాలు లీకయినట్లు ఇటీవల వెల్లడి కావడంతో భారతీయ సమాజం నివ్వెర పోయింది.

"అబ్బే అలాంటిదేమీ లేదని" తొలుత అధికారులు బుకాయించడానికి ప్రయత్నించారు. కానీ యుజిసి నెట్ లో అక్రమాలు జరిగినట్లు హోమ్ మంత్రిత్వ శాఖ కూడా చెప్పడంతో వారు ఖంగుతిన్నారు. పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్లు తలెత్తాయి. కేసు సుప్రీం కోర్టుకు వెళ్లింది. సాక్షాత్తూ పరీక్షకు హాజరైన అభ్యర్థులే లీకేజీ విషయాన్ని దర్యాప్తు అధికారుల ముందు అంగీకరించడంతో పేపర్ లీకేజీల వెనుక మాఫియా పనిచేస్తున్నదన్న వాదనకు రుజువు దొరికింది! దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న సమాచారంతో నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ నిజాయితీ ప్రశ్నార్ధకం అయ్యింది.

గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా పదిహేను రాష్ట్రాల్లో జరిగిన వివిధ పోటీ పరీక్షల్లో డెబ్బైసార్లు ప్రశ్నాపత్రాలు లీకయినట్లు వివిధ సంస్థలు చేసిన అధ్యయనంలో వెల్లడైంది. మొత్తం లీకేజీల్లో ఒక కోటి డెబ్బై లక్షలమంది అభ్యర్థుల భవితవ్యం అస్తవ్యస్తం అయ్యింది. పరీక్షల షెడ్యూళ్లు మారిపోయాయి. పరీక్షల కోసం అప్పటివరకూ వ్యయ ప్రయాసల కోర్చిన విద్యార్థులు, అభ్యర్థులు, వారి తల్లితండ్రులు హతాశులయ్యారు. తిరిగి పరీక్షలకు సంసిద్ధం కావడం వారికెంత భారంగా ఉంటుందో మన సమాజానికి తెలియనిది కాదు. పైగా ఒత్తిడి, ఆందోళనతో పలువురు విద్యార్థులు, నిరుద్యోగులు బలవన్మరణాలకు పూనుకోవడం ఆయా కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఉన్నత ఉద్యోగాల ఎంపిక, ఉన్నత చదువులలో సీట్ల కోసం జరిగే పరీక్షల్లో విజయం సాధించడమే గొప్ప ఆదర్శంగా మన సమాజం కీర్తిస్తున్నది. దాంతో పిల్లలకు అదొక తీవ్రమైన ఒత్తిడిగా మారిపోయింది.

ప్రశ్నాపత్రాల లీకేజీ కేవలం ఉద్యోగాల పోటీ పరీక్షలకు మాత్రమే పరిమితం కాలేదు. వివిధ రాష్ట్రాలలో బోర్డు పరీక్షలకు కూడా ఈ జబ్బు సోకింది. గత ఏడేళ్లలో బీహార్ లో పదో తరగతి ప్రశ్నాపత్రాలు ఆరుసార్లు లీకు అయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో పదిసార్లు లీకు అయ్యాయి. తమిళనాడులో 2022 లో పదోతరగతి, ఇంటర్ ప్రశ్నాపత్రాలు లీకు అయ్యాయి. రాజస్థాన్ ఈ విషయంలో అన్ని రాష్ట్రాలను మించిపోయింది. 2015 – 2023 మధ్య వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు 14 సార్లు లీకు అయ్యాయి. గుజరాత్‌లో కూడా గత ఏడేళ్లలో 14 సార్లు ప్రశ్నాపత్రాల లీకు అయ్యాయి. యూపీలో తొమ్మిది సార్లు ప్రశ్నాపత్రాల లీకయ్యాయి. మధ్యప్రదేశ్ వ్యాపమ్ కుంభకోణం పోటీపరీక్షలలోని ప్రహసనానికి రుజువుగా నిలిచింది. మనదేశంలో కోట్ల మంది విద్యార్థులు, నిరుద్యోగులు వేర్వేరు పరీక్షలకు ప్రతిఏటా సన్నద్ధమవుతుంటారు. పేరొందిన సాంకేతిక, వైద్య కళాశాలలల్లో యూనివర్సిటీలలో సీటు, ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించు కోవాలనే ఒత్తిడి వారిపై విపరీతంగా ఉంటుందనేది కఠోర వాస్తవం.

లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ గత ఏడాది నిర్వహించిన ఓ సర్వే ప్రకారం రాజస్థాన్ కోటాలో 85శాతానికి పైగా విద్యార్థులు, అభ్యర్థులు ప్రతిరోజూ ఏడెనిమిది గంటల పాటు కోచింగ్ కేంద్రాలలో ఉంటారని వెల్లడయ్యింది. కొందరు ఎనిమిది గంటలు మించి కోచింగ్ సెంటర్లోనే ఉంటారని, వారికి విశ్రాంతి ఉండటం లేదని స్పష్టం అయ్యింది. తమకు వారానికి ఒక రోజైనా విశ్రాంతి కావాలని 80 శాతం మంది కోరుకుంటున్నారని ఆ సర్వేలో తేలింది. కోటాలో ప్రవేశించగానే ఒంటరితనాన్ని ఫీలవుతున్నామని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. వారిలో అలసట, కోపం, విచారం, నిరాశ వంటి లక్షణాలన్నీ కనిపిస్తున్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.

మనదేశంలో ప్రతి 42 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) చెబుతున్నది. ప్రశ్నాపత్రాల లీకేజీని కఠినమైన నేరంగా పరిగణిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం చట్టం చేసినా లీకేజీలు ఆగలేదు. ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రశ్నాపత్రాలు ముద్రించే ప్రెస్సులు కుమ్మక్కై , లీకేజీ నేరాలకు పాల్పడుతున్నారని పలు కేసుల్లో వెల్లడయ్యింది. దీనికి తగిన పరిష్కారంపై లోతయిన చర్చ జరగాలి.

చదువే సర్వస్వం అంటూ సమాజం చేసే రుద్దుడు పిల్లల వ్యక్తిత్వాన్ని కుదిస్తోంది. సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి తగిన ఏర్పాట్లు మన పాఠశాలల్లో లేవు. కుటుంబాల్లోనూ లేవు. కుటుంబానికి పాఠశాలకు అనుసంధానం కూడా లేదు. పిల్లలు నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై మన వ్యవస్థలకు తగిన అవగాహన లేదు. పాఠశాలల్లో, కళాశాలల్లో కౌన్సెలర్ల, మానసిక వైద్యుల పర్యవేక్షణ అవసరం అనే సంగతి మన బుర్రలకు ఇంకా తట్టడం లేదు. లోపాలకు నెపాన్ని ఇతరులపై నెట్టడం ఒకటే మనం నేర్చుకున్నది.

ఇప్పటికైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, పౌరసమాజం కలిసి పనిచేసే కొన్ని క్రియాశీల పద్ధతులను రూపొందించాల్సిన అవసరం ఎంతో ఉంది. చట్టసభలో వచ్చిన ప్రస్తావనలు వక్తృత్వ ప్రదర్శనకు పరిమితం కాకుండా నిర్దిష్ట పరిష్కారాల వైపు అడుగులు వేస్తాయని ఆశిద్దాం!

డి. సోమ సుందర్

# అధికారానికి లక్ష్యం, రాజకీయాలకు సూత్రబద్ధత అవసరం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



గణతంత్ర దేశంగా డెబ్బై అయిదవ సంవత్సరంలోకి అడుగుపెట్టాం. మనం సాధించినదెంతో గుర్తించటానికి, సాధించాల్సిన లక్ష్యం ఎంత అసంపూర్ణంగా ఉందో భేషజాలు లేకుండా ఒప్పుకునే వినమ్రతను ప్రదర్శించటానికి ఓ గొప్ప సందర్భం.

రిపబ్లిక్ కావటానికి భారత్‌కున్న అవకాశాలు చాలా తక్కువనే పరిస్థితుల మధ్యే మనం మొదలయ్యాం. ఎందుకంటే, అసాధారణ భిన్నత్వం ఉన్న సమాజం మనది. అందులోనూ అత్యధికులు పేదలు, నిరక్షరాస్యులు. పైగా ఎన్నో శతాబ్దాలుగా మనకు స్వయంపాలన అనుభవం లేదు. అయినా స్వతంత్ర వచ్చినప్పటి నుంచి అందరికీ వయోజన ఓటింగ్‌ను ఎంచుకున్నాం. అదే బ్రిటన్‌ను చూడండి. ప్రజాస్వామ్యంతో బ్రిటన్ ప్రయోగం 1215లో మ్యాగ్నకార్టాతో మొదలైనా, 713 ఏళ్ల తర్వాత 1928లో మాత్రమే అందరికీ ఓటు హక్కు లభించింది. ప్రజాస్వామ్యంతో అమెరికా ప్రయోగం 1619లో వర్జీనియాలో ప్రారంభమైనా, ఆఫ్రికన్-అమెరికన్లకు ఓటు హక్కు 1860ల్లో అంతర్యుద్ధం తర్వాతే వచ్చింది. మహిళలు ఓటు వేయటానికి అనుమతి 301 ఏళ్ల తర్వాత 1920లో మాత్రమే లభించింది. అయినా, అమలులో ఆఫ్రికన్-అమెరికన్లను వేరుచేసి, రకరకాల చట్టాలు, పద్ధతులతో వాళ్ల ఓటింగ్‌ను అణగదొక్కారు. 1964లో పౌర హక్కుల చట్టం వచ్చే దాకా అలాగే కొనసాగింది.

ప్రజాస్వామ్యాల సంక్లిష్టత, దుర్బలత్వం, పరిణామక్రమం నెమ్మదిగా సాగటం దృష్ట్యా చాలామంది పండితులు, రాజనీతిజ్ఞులు మనం త్వరలోనే ముక్కచెక్కలవటమో లేదా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాల్ని వదిలేయటమో జరుగుతుందని జోస్యం చెప్పారు. కూలిపోతారు, విచ్ఛిన్నమవుతారు అనే అనుమానాలు, అంచనాలన్నిటినీ తోసిపుచ్చి మనం ఐక్య రిపబ్లిక్‌గా నిలిచాం. అది కూడా మన వైవిధ్యాన్ని, స్వేచ్ఛను వేడుకలా ఆస్వాదిస్తూ. కాబట్టి సగర్వంగా చెప్పుకుందాం. మన రిపబ్లిక్‌లో అనేక లోపాలున్నమాట నిజం. కానీ సాధించాల్సిన లక్ష్యాల్ని గుర్తించటమంటే, మనం సాధించిన అద్భుత విజయాల్ని తక్కువ చేయటం కాకూడదు. మనం స్వేచ్ఛల్ని కాపాడుకున్నాం, సంబరంలా వినియోగించుకున్నాం. మన రాజకీయ ప్రచారాలు ఆర్భాటం, బల ప్రదర్శనల మధ్య ఉద్వేగభరితంగా సాగుతుంటాయి. ఎంతో ఉత్సుకత, ఆశలతో ఓటు వేస్తుంటాం. ఎన్నికలు న్యాయంగా, స్వేచ్ఛగా జరుగుతుంటాయి. ఓట్లను కచ్చితత్వంతో, నిష్పాక్షికంగా లెక్కిస్తారు. ఎన్నికల ఫలితాల్ని ప్రశాంతంగా ఆమోదిస్తాం. అధికారమార్పిడి ఎప్పుడూ శాంతియుతంగా జరుగుతుంది. (అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ చేష్టల్ని చూడండి. ప్రజాస్వామ్యాన్ని పట్టాలు తప్పినంత ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టాడు. 2020 ఎన్నికల్లో ఓడిపోయాక గెలిచానని బుకాయించటంతోపాటు జనవరి 6, 2021న వ్యవస్థలకు వ్యతిరేకంగా అనుచరుల్ని హింసాత్మక దాడులకు రెచ్చగొట్టాడు). తెర వెనుక నుంచి కోటరీలు, సైనికాధికారులో కాకుండా మన దేశంలో ఎన్నికైన ప్రభుత్వాలు నిజమైన అధికారాన్ని చెలాయిస్తాయి. మన చట్టబద్ధపాలన అధ్వాన్నం అనటంలో సందేహం లేదు కానీ, ఎన్నికల్లో ఓడిపోయారని మనం రాజకీయ ప్రత్యర్థులను ఉరితీయం, జైళ్లలో నిర్బంధించం. (రష్యా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇంకా చాలా దేశాల్లో అధికారాన్ని కోల్పోయేవారు, అధికారాన్ని సవాలు చేసేవారు చాలా సందర్భాల్లో మరణించటమో, ఉరి శిక్షకు గురికావటమో, జైలు పాలవటమో జరుగుతుంటుంది!)

అంతకంటే కీలకమైన విషయం మన దేశ నిర్మాణంలో ప్రధానపాత్ర పోషించిన బలమైన, స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థల్ని నిర్మించుకోవటం. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు, యుపీఎస్సీ, ఆర్థిక సంఘం, కాగ్ మొదలైనవి. రిపబ్లిక్ ఏర్పడటానికి ముందే మనం 550 సంస్థానాలను భారత యూనియన్‌లో ఎటువంటి హింస, రక్తపాతం లేకుండా విలీనం చేసుకున్నాం. ఒక్క నిజాం హైదరాబాద్‌లో మాత్రం సైన్యం ప్రవేశించాల్సి వచ్చింది. ఇదే అంశాన్ని జర్మనీతో పోల్చి




చూడండి. అక్కడ 39 రాష్ట్రాల్లో ఒకే భాష మాట్లాడతారు, ఒకే మత విశ్వాసం కలిగినవాళ్లు. ఒక్క బవేరియా మాత్రం క్యాథలిక్ రాష్ట్రం; మిగతావాళ్లంతా ప్రొటెస్టెంట్లు. వాటన్నిటినీ విలీనం చేయటానికి బిస్మార్క్ 1862 నుంచి 1871 వరకు అనుసరించిన 'బ్లడ్ అండ్ ఐరన్' విధానంలో రక్తపాతం చోటుచేసుకుంది. లేదా ఇటలీతో బేరీజు వేసుకోండి. తొమ్మిది ప్రొవిన్సులూ ఒకే భాష, ఒకే మత విశ్వాసం కలిగినవి. కానీ ఏకం చేయటానికి 1848 నుంచి 1871 మధ్య 23 ఏళ్ల పాటు అలుపెరగని తీవ్రప్రయత్నం అవసరమైంది.

భారత రాజ్యాంగం పరిధిలో 22 గుర్తింపు పొందిన భాషలున్నాయి. రెండు భాషలున్న దేశాలే కలిసి మనుగడ సాగించటం చాలా సందర్భాల్లో కష్టమవుతోంది. బెల్జియంలో రెండు ప్రధాన భాషలు మాట్లాడే వర్గాలున్నాయి. డచ్ భాష మాట్లాడే ఫ్లెమిష్ ప్రజలు, ఫ్రెంచ్ మాట్లాడేవాళ్లు. కొద్దిమంది జర్మన్ ప్రజలున్నారు. అయినా కూడా అంత చిన్న దేశం, అభివృద్ధి చెందిన దేశంలో స్థిరమైన ప్రభుత్వ ఏర్పాటు కష్టమవుతోంది. ఎన్నికల మధ్యకాలం ఎక్కువ అనిశ్చితిలోనే గడుస్తోంది. పాకిస్తాన్ ఏర్పాటైన 25 ఏళ్లలోనే రెండు భాషల్ని, సంస్కృతుల్ని ఇముడ్చుకోలేక రెండు దేశాలుగా చీలిపోయింది.

సామాజిక అభివృద్ధి సూచీల్లో చాలా దేశాల కంటే పైస్థాయిలో ఉండే శ్రీలంక కేవలం రెండు భాషల మధ్య వైవిధ్యాన్ని సర్దుబాటు చేయలేకపోవటం వల్ల అపార హింస, రక్తపాతం జరిగాయి. అస్థిర పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాంటిది, అనేక భాషల మధ్య వైవిధ్యాన్ని కాపాడుకుంటూ భారత రిపబ్లిక్ ఐక్యతను పరిరక్షించుకోవటం అద్భుతానికి తక్కు వేమీ కాదు.

అత్యంత కేంద్రీకృత, పాక్షిక-సమాఖ్య రిపబ్లిక్‌గా మనం అడుగులు ప్రారంభించాం. కానీ గత ముప్పై ఏళ్లుగా ఒక బలమైన, నిజమైన, దృఢమైన ఫెడరలిజంగా ఎదిగాం. రాష్ట్రాల భవిష్యత్తును ఇప్పుడు పైనుంచి ఎవరూ శాసించటంలా, చాలా వరకు వాటి నియంత్రణలోనే ఉంది. వ్యక్తుల వ్యవహారశైలి పట్ల అప్పుడప్పుడు విభేదాలుండొచ్చుగానీ, మన ఫెడరల్ వ్యవస్థలో ప్రశంసనీయ పరిణతి, విజ్ఞత కనిపిస్తున్నాయి. ఆర్థిక సంఘం నివేదికను అనుసరించి జాతీయ స్థాయి నుంచి రాష్ట్రాలకు నిరంతరం నిధులు బదిలీ అవుతుండటం, యూనియన్-రాష్ట్రాల భాగస్వామ్యంతో జి.ఎస్.టిని విజయ వంతంగా తీసుకొచ్చి అమలు చేయటం, కీలకమైన మౌలిక వసతుల్ని అభివృద్ధి చేసి, పెట్టుబడులను ప్రోత్సహించటానికి రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛనిస్తూ లైసెన్స్-నియంత్రణ వ్యవస్థను చాలా వరకు కూల్చివేయటం, బొమ్మయ్ కేసు తీర్పు తర్వాత 356 ఆర్టికల్ వినియోగం దాదాపు రద్దవటం - ఇవన్నీ మన ఫెడరలిజాన్ని అంతకుముందెన్నడూలేని రీతిలో బలోపేతం చేశాయి. అయితే, మూడో అంచెను బలహీనపరచి, పటాటోపం తప్ప అధికారాలు లేని స్థానిక ప్రభుత్వాలను సృష్టించటం వల్ల మన రాజకీయంలో కేంద్రీకరణ విపరీతమై ఫెడరలిజం అసంపూర్ణ లక్ష్యంగా మిగిలిపోయింది.

ప్రజాస్వామ్యం చాలా సున్నితమైంది. అమెరికా ప్రజాస్వామ్యంలోని కష్టనష్టాల్ని, ఇతర అనేక పరిణతి ప్రజాస్వామ్యాల్లోని ఒడిదుడుకుల్ని చూస్తున్నాం. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థను నడపటం ఎంత కష్టమో వాటి నుంచి మనకు అర్థ మవుతుంది. కానీ ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం లేదు; మన వైఫల్యాలకు విరుగుడు మరింత, మెరుగైన ప్రజాస్వామ్యం మాత్రమే.

మన రిపబ్లిక్ వందేళ్ల మైలురాయిని చేరే ప్రస్థానంలో, వచ్చే పాతికేళ్లలో మనం సాధించాల్సింది చాలా ఉంది. చట్టబద్ధ పాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి, స్థానిక ప్రభుత్వాల సాధికారత-జవాబుదారీతనం, రాజకీయ సంస్కరణ - ఈ లక్ష్యాలన్నిటినీ పూర్తి చేయాలి. ఎన్నో ఆలోచనల్ని, తాత్వికతల్ని, విశ్వాసాల్ని స్వాగతించి మిళితం చేసుకున్న 5000 సంవత్సరాల అసాధారణ, అవిచ్ఛిన్న నాగరికతకు మనం వారసులం. రాజకీయంగా మనలో ఎంత పెనుగులాట, వాదులాట స్వభావం, విభజన ధోరణులైనా ఉండొచ్చు, కానీ మౌలికంగా మనం ఆచరణాత్మకంగా వ్యవహరిస్తుంటాం, అతి ధోరణులకు మళ్లకుండా మధ్యేమార్గాన్ని అనుసరిస్తుంటాం.

స్వేచ్ఛను విస్తరించి, జీవితాల్ని మెరుగుపరిచి, ప్రతి మనిషి శక్తిసామర్థ్యాలను సంపూర్ణంగా వికసింపచేసి, నివారించదగ్గ బాధలను తొలగించి సగర్వంగా చెప్పుకోగలిగిన ఒక సమున్నత దేశంగా ఆవిర్భవించే వెలకట్టలేని అవకాశం మనకు ఉంది. మనం చేయవలసిందల్లా - సూత్రబద్ధతలేని రాజకీయాలు, లక్ష్యంలేని అధికారం అని గాంధీజీ హెచ్చరించిన మహా పాపానికి పాల్పడకుండటం. అధికారానికి లక్ష్యాన్ని, రాజకీయాలకు సూత్రబద్ధతని తెద్దాం.


*


# మోదీ 3.0 : సంకీర్ణ సారథ్యం

తన రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈసారి సంకీర్ణ రాజకీయం చేయాల్సి వస్తోంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన దగ్గర్నుంచి మోదీ ధోరణిలో కొంత మార్పయితే మొదలైంది. ప్రచారంలో, ఎగ్జిట్‌పోల్స్ సమయంలో స్పందించిన తీరుకి భిన్నంగా కాస్త వెనక్కితగ్గారు. దశాబ్దాల తన రాజకీయ శైలికి విరుద్ధంగా ఇతర పార్టీలవారితో కలుపుగోలుతనంతో ఆయన మూడో విడత మొదలవటం మంచి పరిణామం. వ్యాపార, ఆర్థికాభివృద్ధి డీఎన్ఏ, అపార రాజకీయానుభవం వల్ల కలిగిన వాస్తవిక దృక్పథం వల్ల మోదీ వేగంగా మేలుకొని కొత్త పరిస్థితుల కనుగుణంగా సర్దుబాటు చేసుకున్నారు. అదంతా కృత్రిమమేనని, మోదీ తన నిరంకుశ రాజకీయాన్ని తిరిగి తీసుకురావటానికి, తన పెండింగ్ ఎజెండాను అమలు చేయటానికి వేచి చూస్తున్నారని అనుమాన పడుతున్నవాళ్లూ ఉన్నారు. అయితే మరీ అంత ప్రతికూల పక్షపాత ధోరణులతో మొదలవనక్కర్లేదని సంకీర్ణం కూర్పును బట్టి అనుకోవచ్చు. మన దేశంలోని సాంప్రదాయం ప్రకారం, ఎన్నికలకు ముందు ఏర్పడిన పార్టీల సంకీర్ణం పటిష్ఠంగానే కొనసాగుతుంది. కాబట్టి తన హ్యాట్రిక్‌ని మోదీ సగర్వ విజయంగా భావిస్తూ ఈ దేశానికి అవసరమైన దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు గొప్ప సానుకూలావకాశంగా తన కార్యాచరణను వేగవంతం చేయవచ్చు. 2014, 2019 తరహాలో తనకు భారీ మెజారిటీ లేదు కాబట్టి ఆశించిన సంస్కరణల్ని తీసుకురాలేమని సంశయించాల్సిన పని కూడా లేదు. ఈవేళ మోదీకి ఇంత ప్రజాదరణ, జేపీలాంటి తటస్థులు కూడా మద్దతివ్వటానికి ప్రధానమైన ఆర్థికాభివృద్ధికి మూలాలు ఎక్కడున్నాయి? సంకీర్ణ ప్రభుత్వాల్లో ఉన్నాయి.

**వారితో పోలిస్తే మోదీకి అవరోధాలు తక్కువ**

సంకీర్ణ ప్రభుత్వాల ద్వారానే పీవీ నరసింహారావు, వాజపేయి ఈ ఘనవిజయాల్ని సాధించారు. ఆర్థిక సంస్కరణలు, మౌలిక, సాంకేతిక వసతుల నిర్మాణం వంటి వాటిని వేగంగా అమలు చేయటం ద్వారా భారత్ ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న పెద్ద ఆర్థిక శక్తిగా రూపుదిద్దుకోవటానికి వారు దోహదం చేశారు. చరిత్ర తనను దయాభరితంగా అంచనా వేస్తుందో, లేదోనని పదవి నుంచి దిగిపోయేముందు బహిరంగంగా బాధ వ్యక్తంచేసిన మన్మోహన్‌సింగ్‌ను కూడా ఈ జాబితాలో చేర్చవచ్చు. 1991లో పీవీ నరసింహారావు పార్టీకి ప్రస్తుతం బీజేపీకి వచ్చిన సీట్ల కంటే ఎక్కువేమీ రాలేదు. కానీ అప్పటివరకూ దేశంలోను, ప్రతిపక్షాలు సహా సొంత పార్టీ కాంగ్రెస్‌లోనూ బలంగా ఉన్న చర్చను సమూలంగా మార్చి ఆర్థిక సంస్కరణలకు నాంది పలికారు. అదేవిధంగా 1999లో వాజపేయి నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వంలో బీజేపీ బలం 182 మాత్రమే. 2004లో మన్మోహన్ ప్రధానిగా ఏర్పడిన యూపీయేలో కాంగ్రెస్‌కు ఉన్న సీట్లు 145. యూపీయే-2లో కూడా మెజారిటీ లేకుండా కేవలం 206 సీట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం నడిచింది. ఇరవై మూడు పార్టీల సంకీర్ణంతో వాజపేయి హయాంలో భవిష్యత్తు తరాలపై అన్యాయమైన భారం మోపి ఆర్థిక వ్యవస్థను నాశనం చేసే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) స్థానంలో ప్రభుత్వం, ఉద్యోగులు తమ వాటా ఎప్పటికప్పుడు చెల్లించే కొత్త జాతీయ పెన్షన్ విధానం





(ఎన్‌పీఎస్) తీసుకురావటం, ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం చేయటం, వీటికి ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్ని కూడా ఒప్పించటం వంటి పెద్ద మార్పుల్ని వాజపేయి ఎంత చాతుర్యంతో సాధించారో మోదీకి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. వారందరి కంటే సంకీర్ణం నడిపేందుకు ఎక్కువ సానుకూలతలు ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్నాయి. చెప్పాలంటే, దినదిన గండమన్నట్లు పీవీ ప్రభుత్వం నడవగా, వాజపేయి, మన్మోహన్ ప్రభుత్వాలకు భాగస్వామ్యపక్షాల డిమాండ్లను తీర్చటం రోజూ సవాలుగా ఉండేది. వారితో పోలిస్తే మోదీ 3.0కి ఎటువంటి అవరోధమూ లేనట్లే భావించాలి.

ఎన్నికలకు ముందు ఏర్పడిన సంకీర్ణం కావటంతోపాటు, మరీ ఎక్కువ భాగస్వామ్య పక్షాలు లేవు. ఈసారి ఎన్డీయే ప్రధాన భాగస్వామ్య పక్షాలు ఆర్థికాభివృద్ధి, సుపరిపాలన మార్పులకు అనుకూలమైనవి. కాబట్టి అవి సహజ భాగస్వామ్యపక్షాలు. నిజానికి తెలుగుదేశం, జేడీయూ కాంగ్రెస్‌కి కూడా సహజ భాగస్వామ్యపక్షాలే. అయితే ఇటీవలికాలంలో కాంగ్రెస్ పార్టీ ఆర్థికాభివృద్ధి ఎజెండాను గాలికొదిలేసి, అప్పులు చేసైనా తాత్కాలిక పథకాలను పంచటమే పరిపాలన అనే రాజకీయం చేస్తోంది. జగన్ స్థాయిలో కాకపోయినా ఆ తరహాలో అభివృద్ధిని పణంగా పెట్టి సంక్షేమం పేరుతో పందేరాల వల్ల కాంగ్రెస్‌తో కొంత తేడా వచ్చింది. ఈరకంగా మోదీ బలమైన ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నారనటానికి సందేహించనక్కర్లేదు. తన ఎజెండా విషయంలో ఢోకా ఉండదు కాబట్టి, మోదీ ఎలాగోలా సొంత మెజారిటీ, గతంలో మిత్రపక్షాలతోనూ అలవాటైన ఏకపక్ష వ్యవహారశైలి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. అలా ఆలోచించటం వల్ల లాభం కంటే నష్టం ఎక్కువని మోదీలోని వ్యాపారవేత్త తేలిగ్గానే గుర్తించగలరనుకోవాలి. అందులో ఈసారి ఎన్నికల తీర్పు చూశాక.

**స్టయిల్ వల్ల మంచి పనుల్లోనూ చెడ్డపేరు**

అయితే ప్రస్తుత పోటాపోటీ రాజకీయంలో, అందునా ప్రతిపక్ష ఇండియా కూటమి కూడా బలంగా ఉన్న తరుణంలో భాగస్వామ్యపక్షాలకు కొన్ని రాజకీయావసరాలు తలెత్తవచ్చు, కొన్ని చికాకుల్ని సృష్టించవచ్చు, కొన్ని పెద్ద మార్పులకూ అవరోధాలు ఏర్పడవచ్చు. ఈ విషయంలో మాత్రం ఎన్డీయే 1 నుంచి, పీవీ నుంచి కొంత రాజనీతిజ్ఞ నైపుణ్యాలను మోదీ అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా ఇతరులను ఒప్పించే చాతుర్యాన్ని, విశాల దృక్పథాన్ని ప్రదర్శించాలి. ఈ లక్షణాలు బలహీనతకు చిహ్నంగా భావించే రోజులు పోయాయి. ఆధిపత్యం చాటేవారు, భౌతిక యుద్ధాలు చేసేవాళ్ల కన్నా ఆర్థికాభివృద్ధిని, జీవన నాణ్యతను పెంచేవారికి పెద్దపీట వేస్తున్న రోజులివి. కాబట్టి లక్ష్యాల కోసం భాగస్వామ్య పక్షాలను ఒప్పించే శక్తి మోదీ ప్రభుత్వానికి కీర్తితోపాటు ఓట్లు కూడా తెస్తుంది.

ఈ రకమైన పట్టువిడుపులు లేకపోవటం వల్లే రైతులకు మేలు చేసే వ్యవసాయ చట్టాల విషయంలో మోదీ విఫలమయ్యారు. దీనివల్ల కోట్లాది రైతులతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ కూడా నష్టపోయింది. మోదీకి దక్కాల్సిన కీర్తి దక్కకపోగా, దానివల్ల రైతులు కొన్ని ప్రతిపక్ష పార్టీలు, పౌర సంఘాల ఉచ్చులో చిక్కుకుని ఆయన పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేశారు.

**వాజపేయి ఓటమికి రాజకీయం తీరు కారణం కాదు**

ఏకపక్ష ధోరణి వల్లే సహకార ఫెడరలిజం ప్రజల్లోకి వెళ్లకుండా చాలామేర నినాదంగా మిగిలిపోయింది. యూనియన్ నుండి రాష్ట్రాలకు నిధుల బదిలీ పక్షపాతరహితంగా, ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు జరుగుతున్నా వివాదాస్పదమై డబుల్ ఇంజిన్ సర్కారు పేరుతో మోదీ ప్రతిపక్ష ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో పార్టీ రాజకీయం చేస్తున్నారనే అంశం ఎక్కువ ప్రచారమైంది. ఎంపిక చేసుకున్న నేతలపై ఈడీ దాడులూ ఇందుకు దోహదపడ్డాయి.

ప్రధాని ఇలాంటప్పుడు చాలా సందర్భాల్లో మౌనం వహించటం, విపక్షాల విమర్శలు, నిరసనలా? మోదీ విశ్వసనీయతా? ప్రజలు తేల్చుకోవాలన్నట్లు వ్యవహరించటం పలుచోట్ల ఆయనకు రాజకీయంగా కూడా నష్టం చేసింది. అదేగనక హేతుబద్ధ వాదనలతో ఒప్పించే లక్షణాన్ని ప్రదర్శించి ఉంటే, స్వామికార్యం, స్వకార్యం రెండూ నెరవేరి ఉండేవి. భారత్‌లాంటి అత్యంత వైవిధ్యభరితమైన ప్రజాస్వామ్య దేశంలో ఒప్పించే సామర్థ్యం ఎంతో బలమైన ప్రభుత్వాలున్నప్పుడు కూడా పాలకులకు అవసరం. ఈ ఆవశ్యక లక్షణాన్నే సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యంలోనూ మోదీ పాటించగలిగితే చాలు, సునాయాసంగా పెద్ద మార్పుల్ని సాధించగలరు. వాజపేయి హయాంలో బీజేపీకి దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రాతినిధ్యం లేనప్పటికీ ఆయన్ని నిజమైన జాతీయ నాయకుడిగా అనేకమంది పేర్కొంటారు. అత్యుత్తమ ప్రధాని అంటే వాజపేయి పేరు చెప్పేవాళ్ల సంగతి సరే సరి. అయినా 2004 ఎన్నికల్లో వాజపేయి ఓడిపోయారంటే అందుకు ఆయన రాజకీయం చేసిన తీరు కాదు కారణం, అభివృద్ధికి దిద్దిన ఒరవడిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పుకోలేకపోవటం, ఆ ఫలితాలు ప్రజలందరికీ చేరకపోవటం. అభివృద్ధి ఫలాలు అందరికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చేరకపోవటం సమస్య ఇప్పటికీ ఉన్నప్పటికీ, చేసిన పనుల్ని సమర్థంగా ప్రచారం చేసుకోవటంలో మోదీకున్న నైపుణ్యం వల్ల ఇరవైఏళ్ల క్రితం ఎన్డీయే-1కి వచ్చిన తరహా ఓటమి బారి నుంచి బయటపడ్డారు. వాజపేయి తరహా ఒప్పించే శక్తి ఉంటే, 2024 ఎన్నికల్లో మోదీకి ఇంకా పెద్దఎత్తున సీట్లు లభించేవనటంలో సందేహం లేదు. కాబట్టి సొంత మెజారిటీతో సంబంధం లేకుండా రాజకీయంగా కూడా తనకు లాభం చేసే ఈ ఒప్పించే చాతుర్యాన్ని వాజపేయి, పీవీ తరహాలో మోదీ పెంపొందించుకోవాలి.

**ప్రతిదీ సంస్కరణ అనటం తగదు**

కానీ ఈ ఒక్క లక్షణం చాలదు. బలమైన ఉమ్మడి ఎజెండా కూడా ఉండాలి. మోదీ ప్రధానమంత్రిగా తన రెండు దఫాల పాలనలో కొన్ని వందల సంస్కరణలు తెచ్చినట్లు ఒక వ్యాసంలో ప్రకటించుకున్నారు. పాత చట్టాలను రద్దు చేయటం వంటివి కూడా ఆయన సంస్కరణల జాబితాలో చెప్పుకున్నారు. ఆ ధోరణిని వీడి సాంకేతిక మార్పులకి, సంస్కరణలకి మధ్య తేడాను స్పష్టంగా గుర్తించాలి. దేశ ప్రయోజనాలకు పెద్దఎత్తున ఉపయోగపడేలా ఆటనియమాల్ని మార్చే పరిష్కారాల్ని గుర్తించి వాటి అమలుకు ఉపయోగపడే సంస్కరణల్ని తీసుకురావాలి. ఎజెండా అంశాలు హేతుబద్ధంగా, దేశ ప్రయోజనాలు కాపాడేరీతిలో తగిన సాక్ష్యాధారాలు, వాస్తవాలతో ఉంటే, భాగస్వామ్యపక్షాల్ని ఒప్పించటానికి పెద్ద కష్టపడనక్కర్లేదు. వాటిని ఉమ్మడి కనీస కార్యక్రమంగా కూడా రూపొందించుకోవచ్చు. ఇలాంటి నిర్మాణాత్మక జాగ్రత్తలతో ప్రజల నుంచి కూడా ఒత్తిడి పెరిగి తమ రాజకీయ ప్రయోజనాల రీత్యా భాగస్వామ్యపక్షాలు తోసిపుచ్చే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో గత రెండు పర్యాయాల పాలనలో తనకు ప్రజల నుంచి చరిత్రాత్మక మద్దతు ఉన్నా, పట్టించుకోని పలు సంస్కరణల్ని కూడా మోదీ పరిగణలోకి తీసుకోవాలి. ఆర్థిక రంగంలో దృఢ సంకల్పంతో, సాహసోపేతంగా కృషి చేస్తున్నా, ఇంకా వేగవంతం చేసేందుకు సంస్కరణలు అవసరం. రాజకీయ రంగంలోనైతే ఇప్పటివరకూ మోదీ తెచ్చిన సంస్కరణలు లేవు. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని, 2047 దీర్ఘకాలిక లక్ష్యానికి భారత్‌కు అవసరమైన కీలక సంస్కరణల్ని రూపొందించి ఏకాభిప్రాయం సాధించి అమలుకు మోదీ కృషి ప్రారంభించాలి.

**సభలో చర్చా ప్రమాణాల్ని పెంచాలి**

అదేవిధంగా తాను ఆశిస్తున్న స్థాయిలో, వేగంతో మార్పుల్ని సాధించాలంటే మోదీకి కేవలం సంకీర్ణంలోని మిత్రపక్షాలను ఒప్పించటం మాత్రమే సరిపోదు. పెద్ద సంఖ్యలో సీట్లతో బలంగా ఉన్న ప్రతిపక్ష కూటమిని, పార్టీలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. ఇందుకోసం కొత్త పార్లమెంటు భవనానికి సార్థకత చేకూర్చి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా చర్చా ప్రమాణాల్ని పెంచాలి. చట్టసభల్లో చర్చల్ని అడ్డుకోవటం న్యాయబద్ధమైన పార్లమెంటరీ పద్ధతని, ప్రజాస్వామ్య సంప్రదాయమని బీజేపీ అగ్రనేత అరుణ్‌జైట్లీ గతంలో చేసిన వాదన ఆమోదయోగ్యం కాదు. ఏ పార్టీ వారు చేసినా అలాంటి వాదనల్ని తిరస్కరించాలి. కాబట్టి సరైన లక్ష్యాలతో, హేతుబద్ధ చర్చలతో ప్రతిపక్షాలు ఒప్పుకోకతప్పనిరీతిలో చర్చలు జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలి. 2014లో ఎన్నికైనప్పుడు పార్లమెంటు ప్రజాస్వామ్య దేవాలయం అని చెప్పిన మోదీ, ఆ విలువను ఆచరణలో చూపే శ్రద్ధ కనబరచలేదు. పార్లమెంటు నిజంగా పనిచేసేది కమిటీల్లో అని దశాబ్దాల క్రితం అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ చెప్పిన పాఠాన్ని విస్మరించి స్థాయీ సంఘాలను నీరుగార్చారు. బిల్లుల రూపకల్పనలోనే కాదు, ఆమోదంలో కూడా చర్చను పట్టించుకోలేదు. గత లోక్‌సభలోనైతే అత్యధిక శాతం బిల్లులు చర్చలేకుండానే ఆమోదం పొందాయి. దీనివల్ల చట్టసభల పట్ల ప్రజల్లో నిర్లిప్తత మరింత పెరిగింది. చివరికి మీడియా కూడా మొక్కుబడిగా స్పందించింది. ఇందులో ప్రతిపక్షం తప్పులు కూడా ఉండొచ్చు. కానీ సరిదిద్దాల్సిన, పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎక్కువగా ఉంది.

'శ్రద్ధాసక్తులతో జరిగే చర్చలను ప్రజలు కోరుకుంటున్నారు. అవాంతరాలు, నాటకీయ పరిణామాలను కాదు' అని 18వ పార్లమెంటు సమావేశాల ప్రారంభం రోజు ప్రధాని మోదీ అన్నారు. ప్రజలు బాధ్యతాయుత విపక్షాన్ని కోరుకుంటున్నారని, ఆ మేరకు మూడో విడత పదవీకాలంలో అందరినీ కలుపుకుని వెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. కానీ స్పీకర్ ఎన్నిక నుంచే ఘర్షణ వాతావరణం మొదలైంది. మోదీ తిరిగి ఎన్నికైన దగ్గర్నుంచి పరీక్షలు, ఇతరత్రా వైఫల్యాల గురించి ప్రతిపక్ష కూటమి ఉక్కిరిబిక్కిరి చేయటం, ఎమర్జెన్సీ ప్రకటించి అయిదు దశాబ్దాలవుతున్న సందర్భంగా మోదీ విమర్శలు గుప్పించటం, కాంగ్రెస్ ఘాటుగా ప్రతిస్పందించటం, ఆ తర్వాత

కూడా చర్చలో వ్యక్తిగత, అసంబద్ధ విమర్శలకు అధిక ప్రాధాన్యతనివ్వటం వంటివి వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. ప్రతిపక్షాల కూటమి బలంగా ఉన్నందున సమర్థమైన షాడో ప్రభుత్వంలా వ్యవహరించాలిగానీ, ఎన్నికల్లో తామే గెలిచామన్న రీతిలో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇది సంఘర్షణను ఇంకా పెంచవచ్చు. ఈ వేడిని తగ్గించి వెలుతురును పెంచటం ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి కూడా ప్రయోజనకరం. విపక్ష వ్యూహాలు ఎలా ఉన్నా, మోదీకి ఎంత రాజకీయ ఆత్మవిశ్వాసం ఉన్నా ప్రభుత్వం ప్రమాణాలు, విధానాలు, ఫలితాల మీద ఎక్కువ దృష్టి సారించటం అవసరం. మూడోసారి మోదీ నుంచి ప్రజలు దూకుడు కన్నా పరిపక్వతను, ఉపాధి, ఆదాయాలు పెరిగే సుస్థిరాభివృద్ధిని ఆశిస్తున్నారు. రాజీపడటం అనుకోనక్కర్లేదు. లౌక్యాన్ని ప్రదర్శిస్తే చాలా సందర్భాల్లో లక్ష్యాల్ని సాధించగలరు. కాబట్టి 'ప్రభుత్వాన్ని నడపటానికి మెజారిటీ కావాలి. కానీ దేశం మాత్రం ఏకాభిప్రాయంతో నడుస్తుంది' అని కేవలం మాటల్లో, కరచాలనాల్లో కాక చేతల్లో మోదీ చూపాలి. ప్రభుత్వ ఎజెండా, చర్చా ప్రమాణాలు క్రమశిక్షణతో ఉంటే, ప్రజలు గమనిస్తుంటారు కాబట్టి ప్రతిపక్షాలు కూడా ప్రజాప్రయోజనాలున్న బిల్లుల్ని ఆమోదించక తప్పనిపరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వాన్ని గుడ్డిగా వ్యతిరేకిస్తే వారే నష్టపోతారు.

కొన్ని సందర్భాల్లో ప్రతిష్టంభన వచ్చినప్పుడు పరస్పర గౌరవంతో సామరస్యంగా చర్చలు జరిపి ఒప్పించే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఇందుకోసం ప్రభుత్వం కొంత ఉదారంగా వ్యవహరించటంతోపాటు దేశ ప్రయోజనాలు లక్ష్యంగా ఉండే ఎజెండాతో పనిచేయాలి. మిత్రపక్షాల విషయంలో ఏ రకంగా వ్యవహరిస్తారో, కాస్త అటూఇటుగా ప్రతిపక్షాలతో కూడా అదేరీతిలో వ్యవహరించాలి. దీనివల్ల దేశ ప్రయోజనాలతోపాటు తన పార్టీ ప్రయోజనాలను కూడా మోదీ సమర్థంగా పరిరక్షించగలరు. ఉదాహరణకు, ఆర్థికాభివృద్ధినే తీసుకుంటే, ఒకప్పుడు ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణను గాలికొదిలేసింది. దేశానికి కీలకమైన ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి, పెట్టుబడులు వంటి విషయాల్లో ఏకాభిప్రాయం లేకుంటే ప్రజలు, భావితరాలు తీవ్రంగా నష్టపోతారు. అదేవిధంగా ఒక పార్టీ మాత్రమే ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ నిర్వహణకు సంబంధించిన మౌలికాంశాల కోసం పనిచేయటం, ప్రతిపక్షం వ్యతిరేక ధోరణితో ఉండటం మనలాంటి దేశంలో మరింత ప్రమాదకరం. అందువల్ల జేపీ చెప్పినట్లు, ఆయా మౌలిక విషయాల్లో ప్రతిపక్షాలతో ఏకాభిప్రాయానికి, ఒక మధ్యేమార్గానికి వచ్చేందుకు మోదీ కృషి చేయాలి. అమలులో, మిగిలిన విషయాల్లో తమ ప్రత్యేకతలకనుగుణంగా పద్ధతుల్ని, విధానాల్ని పార్టీలు ప్రతిపాదించవచ్చు. మోదీ తన లక్ష్యాల్ని వేగంగా సాధించటానికి ఈ రాజకీయ సంస్కృతి ఎంతగానో ఉపయోగ పడుతుంది.

**ఎన్నికల సంస్కరణలు**

ఈ క్రమంలో ఎన్నికల సంస్కరణల మీద కూడా బీజేపీ దృష్టి సారించాలి. దేశ ప్రయోజనాల రీత్యానే కాకుండా, తన పార్టీ అవసరం రీత్యా కూడా ఎన్నికల పద్ధతిని మార్చటం బీజేపీకి అవసరం.

మన దేశ ఎన్నికల్లో అక్రమ వ్యయం నీతిమంతుల్ని కూడా అవినీతిపరులుగా, అక్రమార్జనకు ఎప్పటికప్పుడు కొత్త మార్గాల్ని అన్వేషించేవారుగా తయారుచేస్తోంది. అదేవిధంగా ప్రభుత్వం చేయాల్సిన పనులతో సంబంధం లేకుండా, తరచూ అభివృద్ధిని కూడా పణంగా పెట్టి తాత్కాలిక పథకాలను పోటాపోటీగా ప్రకటించటానికి, బహిరంగ చర్చ దిగజారటానికి, కుల, మతాలను రెచ్చగొట్టే భాష ఉపయోగించటానికి కారణమవుతోంది. 2024 ఎన్నికల్లో ఈ జాడ్యాలన్నీ మనకు విశృంఖలంగా కనిపించాయి. లేకుంటే, ఈడీ దాడులు, పందేరాల స్కీములు, కులగణన, ముస్లింల చుట్టూ అంత పెద్దఎత్తున ఓటర్ల సమీకరణ ప్రయత్నాలు జరిగేవా? ఈసారి అవి తీవ్రస్థాయిలో పెచ్చరిల్లి, ఎన్నికల్ని నిర్ణయాత్మకం గావించాయి. మోదీ చెప్పినట్లు బీజేపీ కూటమికి 400కి పైగా సీట్లు వచ్చి ఉంటే ఈ అంశాన్ని ప్రస్తావించటం వల్ల ఒక పరిధి దాటి ప్రయోజనం ఉండేది కాదు. కానీ ఈ ఎన్నికలు ఓట్లు, సీట్ల పరంగా బీజేపీకి కూడా మేలుకొలుపు హెచ్చరిక జారీ చేశాయి. కేవలం 1 శాతం ఓట్ల తేడాతో బీజేపీ ఈ ఎన్నికల్లో 92 సీట్లు కోల్పోయింది. ఎన్డీయేకి 1-2 శాతం ఓట్లు తగ్గితే ప్రభుత్వం ఏర్పాటు చేయటం కూడా కష్టమయ్యేది. జాతీయస్థాయిలో ఎన్డీయేకి 1 శాతం ఓట్ల తగ్గుదల దేశ రాజకీయాల్లో పెద్ద తేడాకి దారితీసే పరిస్థితులు ఏర్పడేవి. పొత్తుల వల్ల మహారాష్ట్రలో మినహా మిగతా చోట్ల బీజేపీ లబ్ధి పొందింది. సొంతంగా మరో పది సీట్ల దాకా గెలుచుకోగలిగింది. ఈ పరిణామాలు బీజేపీకి ప్రమాద సంకేతాలు. తక్కువ ఓట్లతో ఎక్కువ సీట్లు గెలిచి 2014 నుంచి ఇప్పటిదాకా బీజేపీ లాభపడింది. అలా గెలవటం ఎల్లకాలం సాధ్యం కాదని, ఎంత పకడ్బందీగా ప్రణాళికలు వేసి ఎత్తుగడలు రూపొందించుకున్నా ప్రజలు ఊహించని తీర్పు ఇచ్చే అవకాశం ఉందని ఈ ఎన్నికలు బలంగా రుజువు చేశాయి. ఈ విషయాన్ని గతంలో సంకీర్ణాలు నడిపినప్పుడు కాంగ్రెస్ గుర్తించి మేలుకోకపోవటం వల్ల ఆ తర్వాత తీవ్రంగా నష్టపోయింది. 2004లో యూపీయే ప్రభుత్వం ఏర్పడినప్పుడు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా. జయప్రకాష్ నారాయణ్ ఎన్నికల వ్యవస్థను మార్చి దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావాలని, నిర్దిష్ట సంస్కరణల్ని మన దేశ పరిస్థితుల కనుగుణంగా, రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేకుండా ప్రతిపాదించినప్పుడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ సుముఖత వ్యక్తం చేసినా, భాగస్వామ్యపక్షమైన సీపీఎం అగ్రనేతొకరు ఆ అంశం ప్రాధాన్యతను గుర్తించకపోవటంతో ఆ ప్రయత్నానికి గండి పడింది. దీంతో కొందరు కాంగ్రెస్ సీనియర్

నేతలకు కూడా యథాతథస్థితిని కొనసాగించటానికి అవకాశం దొరికినట్లయింది. కానీ దానిమూలంగా ఆ తర్వాత కాంగ్రెస్ ఎంత నష్టపోయిందో, కమ్యూనిస్టు పార్టీలు ఎలా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు.

ఆ తర్వాత కూడా ఎన్నికల్లో పార్టీ వైఫల్యానికి మూలకారణాల్ని అన్వేషించకుండా కాంగ్రెస్ పార్టీ పైపై అంశాల చుట్టూ చర్చ చేస్తూ వచ్చింది. నల్లడబ్బును అరికడతామంటూ మోదీ ప్రభుత్వం 1.0లో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు, దేశంలోని చిట్టచివరి పౌరుడు కూడా దీనివల్ల ప్రభావితమైనప్పుడు, కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా ప్రతిస్పందించి రాజకీయాల్లో నల్లడబ్బు అవసరం లేకుండా ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన కోసం డిమాండ్ చేయలేదు. దేశ ప్రయోజనాల సంగతి అలా ఉంచి, తమ పార్టీ ప్రయోజనాల గురించి కూడా ఆలోచించకుండా సోమరి రాజకీయంతో పార్లమెంటుని స్తంభింపచేయటం వంటి చర్యలతో కాలక్షేపం చేశాయి. 2024 ఎన్నికల్లో కూడా తీరు మార్చుకోకుండా, ఈవీఎంల్లో అవకతవకలున్నాయంటూ, ఊహాగానాలు, అక్కడక్కడా కొందరి అధికారుల నిర్లక్ష్యాన్ని చూపుతూ ఆరోపణలు చేశాయి. మాకు సీట్లు రాకపోతే ఎన్నికల తీర్పును ఒప్పుకోం అనే స్థాయిలో అమెరికాలో ట్రంప్ తరహాలో మాట్లాడాయి. ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీస్తే దేశ రాజకీయం గందరగోళమై అంతర్యుద్ధం వచ్చే ప్రమాదముందన్న స్పృహను కూడా ప్రదర్శించకుండా కాంగ్రెస్, కొన్ని ప్రధాన ప్రతిపక్షాలు బాధ్యతారహితంగా వ్యవహరించాయి. అంతేతప్ప, మన ఎన్నికల్లో అసలైన సమస్య గురించి మాట్లాడలేదు.

ఎన్నికల సంస్కరణలను విస్మరించటం వల్ల ఉన్నకొద్దీ విషవలయంలో కూరుకుపోతున్నామన్న విషయాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు గుర్తించకున్నా నేతలు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు జేపీ కృషిని కొనసాగించారు. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆధ్వర్యంలో 2020లో జాతీయ స్థాయి సదస్సును నిర్వహించి అన్ని ప్రధాన పార్టీల అగ్రనేతలనూ ఆహ్వానించి ఏకాభిప్రాయంతో హైదరాబాద్ డిక్లరేషన్‌ని రోడ్‌మ్యాప్‌గా ప్రకటించారు. పార్టీ నాయకత్వానికి, జాతీయ స్థాయి వరకు ప్రజా ప్రతినిధులందరికీ డిక్లరేషన్‌ని అందచేశారు. అయితే పార్టీల నాయకులు ఇంకా ప్రవాహంలోనే కొట్టుకుపోతూ యథాతథస్థితిని కొనసాగిస్తున్నారు. అందులో పాల్గొన్న అధికార బీజేపీ జాతీయ అగ్రనేత ఒకరు ఎఫ్‌డీఆర్ ప్రతిపాదనల్ని పూర్తిగా సమర్థించారుగానీ, వాటి అమలుకు తమ పార్టీ నాయకత్వం సుముఖత వ్యక్తం చేయకపోవచ్చని అన్నారు. బీజేపీ స్పందన ఆరకంగా ఉండే అవకాశముందని సదస్సుకు ముందే జేపీ తెలిపారు. తక్కువ ఓట్ల శాతంతో ఎక్కువ సీట్లు పొందుతూ, జాతీయ స్థాయిలో బలంగా ఉన్న బీజేపీ ఎన్నికల వ్యవస్థను సంస్కరించి తన కాళ్లు తాను నరుక్కునే ప్రయత్నం చేయదని, అయితే రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక సంస్కరణ ద్వారా ఆ పార్టీ కూడా లబ్ధి పొందుతుందని, కాబట్టి ఇందుకు ప్రతిపక్షాలు చొరవ తీసుకోవాలని జేపీ కోరారు. కానీ ఉన్నకొద్దీ పార్టీలు ఎన్నికలను డబ్బు రాజకీయంగా మార్చేసి, ఏ పార్టీలో గెలిచినా అధికార పార్టీలో చేరటం లేదా అనధికార మద్దతి వ్వటం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. దీనివల్ల కొత్త నాయకులు, కొత్త ఆలోచనలు నేతల కుటుంబాలకు బయట నుంచి రావటం కరువై పార్టీలు ఉన్నకొద్దీ కొందరు వ్యక్తుల, కుటుంబాల ప్రయివేటు ఆస్తులుగా మారిపోతున్నాయి. కొంత సైద్ధాంతిక నిబద్ధత, దార్శనికత ఉన్న బలమైన నాయకత్వం, క్రమపద్ధతిలో సంస్థాగత నిర్మాణం, కార్యకలాపాలు, ప్రజల రోజువారీ జీవితంలో ఆర్థిక ప్రయోజనం కలిగించే విధానాలు ఉన్న పార్టీలు మినహాయించి, నిన్నటి వరకు అధికారంలో ఉన్నా సరే మూడో పార్టీగా మారిపోయాక చాలా సందర్భాల్లో ఆయా పార్టీల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. అధికారమే పరమావధిగా జరుగుతున్న ఫిరాయింపుల పట్ల బలమైన ప్రజాభిప్రాయం కొరవడటం కూడా పలువురు నేతలకు వెసులుబాటుగా కనిపిస్తోంది. ఓట్ల కొనుగోలుకు నల్లడబ్బు, మభ్యపెట్టే హామీలు, తాత్కాలిక తాయిలాలు, భావోద్వేగాల ప్రచారం అనే ఫార్ములాలో ప్రతి ఎన్నికకూ ఆరితేరటం తప్ప, ఇలా సాధించే అధికారం అసలు లక్ష్యమేమిటో ఆలోచించటం వారు మర్చిపోయారు. అయితే తాజా ఎన్నికల్లో బీజేపీ కూడా ఓట్లు, సీట్లు పరంగా స్వల్ప తేడాతో ఎక్కువ నష్టపోవటంతో ఈ అంశాన్ని అధికార పార్టీ పట్టించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొద్దిశాతం ఓట్లు తేడా వస్తే ఎన్నికల ఫలితాలు అటూఇటూ అయ్యేవి, తృటిలో ఓటమి ప్రభావం తప్పింది అని ఊపిరి పీల్చుకోవాల్సి వచ్చింది. ఎన్నికల సంస్కరణల్లో భాగంగా ఏకాభిప్రాయ సాధనకు బీజేపీ చొరవ చూపాలి. కాంగ్రెస్‌కి ఈ ఎన్నికల్లో గత రెండు ఎన్నికల్లో కంటే ఎక్కువ సీట్లు వచ్చినా, ఇండి కూటమిగా ఆ పార్టీ ఎక్కువ లబ్ధి పొందినా, ఆ ఓట్లు, సీట్లు సొంత బలం కాదని, బీజేపీ వ్యతిరేక ఓటు అందులో ఎక్కువనేది వాస్తవం. ఈ విషయాన్ని గుర్తించి బీజేపీకి బలమైన పోటీదారుగా ఎదిగేందుకు ఎజెండా పరంగా, ఇతరత్రా కాంగ్రెస్ పార్టీ ఇంకొన్ని మార్పులు తీసుకు రావాల్సి ఉన్నా, ఎన్నికల వ్యవస్థను మార్చటం ఎంతో కీలకమైనది. ఎన్నికల సంస్కరణలకు బీజేపీ ముందుకొచ్చేలా చేయటం, జాతీయ స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని, పార్టీల్ని సమీకరించే ప్రయత్నం చేయటానికి కాంగ్రెస్ కార్యాచరణ చేపట్టాలి.

2024 ఎన్నికల తీర్పుతో మోదీ నాయకత్వ అర్హతను కోల్పోయారని, నైతికంగా ఓటమి పాలయ్యారని కొందరు చేస్తున్న ఆరోపణలు వాస్తవికం కాదు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి మధ్య సమతూకంతో భారత్‌లాంటి వైవిధ్యభరితమైన, అనేక అంతరాలున్న దేశంలో మూడోసారి అధికారంలోకి రావటం ఆషామాషీ కాదు. మోదీలోని అతిని, మితిమీరిన ధోరణుల్ని దేశ ప్రజలు నిరసించారు, కొంతమేర నియంత్రించాలనుకున్నారు తప్ప, ఆయన పాలన పట్ల ప్రజల్లో ఇప్పటికీ వ్యతిరేకత కన్నా సానుకూలత ఎక్కువగా ఉందనేది వాస్తవం. ఈ నేపథ్యంలో వచ్చే పాతికేళ్లపాటు భారతదేశానికున్న అభివృద్ధి అవకాశాల్ని సద్వినియోగం చేసేందుకు ఒక రకంగా సంకీర్ణం మోదీకి సదవకాశం.

*

# ఎలాంటివారు ప్రజాజీవితానికి ఆకర్షితులవుతున్నారు?

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

సుదీర్ఘ ఎన్నికల ఉత్కంఠలో రెండు ఎంతో ముఖ్యమైన ప్రశ్నల్ని మనం తరచూ విస్మరించాం. మొదటిది, ఎన్నికల తరువాత ఏం జరుగుతుంది? నేను ఎప్పుడూ చెబుతుంటాను, ఎన్నికలు పోటీ చేసే అభ్యర్థుల గురించి కాదు; ఎన్నికలు ఓటర్లు, పన్ను చెల్లించే మన గురించి. మన ఉమ్మడి అవసరాలను తీర్చే బాధ్యతను మన ఓటు ద్వారా ఎన్నుకున్న ప్రతినిధులకు అప్పగిస్తున్నాం. మన ఉమ్మడి సేవలకు, ఉమ్మడి సౌకర్యాలకు అయ్యే ఖర్చుల కోసం పన్నులు చెల్లిస్తున్నాం. కాబట్టి, ఎన్నికలు వచ్చే అయిదేళ్లలో ఏం జరుగుతుందన్న విషయానికి సంబంధించినవి. మన ఉమ్మడి అవసరాలను సమర్థవంతంగా, విజ్ఞతతో నెర వేరుస్తారా? లేకుంటే, అధికారంలో ఉన్నవారు ఓటర్లను ఆకర్షించటానికి దీర్ఘకాలిక ప్రజాప్రయోజనాన్ని పణంగా పెట్టి తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమం మీద దృష్టి కేంద్రీకరిస్తారా? ఎన్నికైన ప్రతినిధులు ప్రజా ప్రయోజనాలను పట్టించు కుంటారా, లేక మనల్ని పణంగా పెట్టి అధికారాన్ని సొంత లాభం కోసం ఉపయోగించుకుంటారా? ప్రాతినిధ్య ప్రజా స్వామ్యానికి ఇది ప్రధాన ప్రశ్న.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా పనిచేయటానికి మరో ప్రశ్న కూడా కీలకం. ప్రజాజీవితంలో పదవులకు ఎటు వంటివారు ఆకర్షితులవుతున్నారు? ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థుల్ని ఏ రకంగా ఎంపిక చేస్తున్నారు? ప్రజాసేవ చేయాలన్న తపన కలిగిన, నైతికత, హేతుబద్ధత గల పౌరులు ప్రభుత్వంలోకి ప్రవేశిస్తున్నారా, లేకుంటే, అటువంటివారు రాకుండా అవరోధాలున్నాయా? ప్రజాసేవా భావం, సామర్థ్యం గల పౌరులు రాజకీయాల్లో తమకు గౌరవప్రదమైన పరిస్థితులు ఉన్నాయని భావించినప్పుడు, నైతిక, హేతుబద్ధ పద్ధతుల ద్వారా వాళ్లు అధికారంలోకి రాగలగినప్పుడు మనకు సరైన పాలన అందుతుంది. అనర్హులైన పౌరులు అధికారంలోకి వస్తే, లేదా అధికారంలోకి వచ్చే మార్గాలు అధికారంలో ఉన్నవారు అమలు చేయాల్సిన ఉమ్మడి ప్రజాహితాన్ని దెబ్బతీసేలా అనారోగ్య కరంగా, వికృతంగా ఉంటే, ఒక దేశంగా మన సామర్థ్యానికి తగ్గట్లు ఎదగలేం. మన రాజకీయాల్లో ప్రతినిధుల ఎన్నికను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

చట్టసభలకు ప్రత్యక్ష పోటీ నుంచి పలాయనం చిత్తగిస్తున్నారని పలువురు ప్రధాన ప్రతిపక్ష నేతలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శ చేశారు. ఒక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి,



నాయకత్వానికి చట్టబద్ధత ప్రజల తీర్పు నుంచి వస్తుంది. అధికారమంతా ఓటు నుంచే వస్తుంది. అలా ఏర్పడిన ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థలూ ఎన్నికైన చట్టసభకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జవాబుదారీ కావాలి. లేకుంటే, మనకు ఎన్నికవని నియంతృత్వం ఉంటుంది, ప్రజాస్వామ్యం నాశనమవుతుంది.

కానీ విషయం మరింత సంక్లిష్టమైనది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన రాజకీయ సంకటస్థితిని బహిరంగంగానే వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ ప్రతిపాదనను ఆమె మర్యాదగా తిరస్కరించారు. ఎన్నికల రాజకీయాల్లో తనకున్న రెండు ప్రతికూలతల్ని ఆమె వెల్లడించారు. ఎన్నికవటానికి అవసరమైన డబ్బు బలం ఆమెకు లేదు. తన సొంత రాష్ట్రం (తమిళనాడు)లో లేదా ఎంపిక చేసుకున్న రాష్ట్రం (ఏపీ/తెలంగాణ)లో ఎన్నికల్లో గెలిచే అవకాశమున్న సరైన కులంలో ఆమె పుట్టలేదు.

సీతారామన్ సమర్థవంతమైన, నిజాయతీ, ప్రజాసేవా భావం గల నేత. దేశానికి సేవ చేస్తున్నారు. ఏ పార్టీవారు అనే విషయాన్ని పక్కన పెడితే, అటువంటి నేతలు మనకు ప్రజాజీవితంలో కావాలి. అయినా, ప్రజాసేవకు అత్యుత్తమంగా పనికొచ్చే నేతలు ఎన్నికయ్యే అవకాశం మన దేశంలో చాలా అరుదు. 'ఎన్నికయ్యే అవకాశమున్నవారు' తరచూ పరిపాలనకు పనికిరావటం లేదు! డా. జైశంకర్, వెంకయ్య

నాయుడు, అరుణ్ జైట్లీ, అరుణ్ శౌరి, డా. మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ, ఇంకా చాలామంది సమర్థ నాయకులకు రాజ్యసభలో అవకాశం కల్పించాల్సి వస్తోంది. అర్హత గల వ్యక్తులకు మన ఎన్నికల ప్రక్రియ తరచూ అవకాశం కల్పించటం లేదు.

చాలా రాష్ట్రాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు చేస్తున్న లెక్కలు చూపని, చట్టవిరుద్ధ వ్యయం చుక్కలనంటుతోంది. ఇందులో రహస్యమేమీ లేదు. శాసన సభకి, లోక్‌సభకి ఒక ప్రధాన పార్టీ అభ్యర్థిగా టికెట్ సంపాదించుకోవటానికి విపరీతమైన, వేలంవెర్రి పోటీ ఉంటుంది. ఎన్నికల్లో అంతంత ఖర్చు చేసినా ఫలితం ఎలా ఉంటుందో తెలియని అనిశ్చితి ఉన్నప్పటికీ, ఎన్నికలకు ముందు 'సీట్ల' కోసం అంత వెంపర్లాట మరే దేశంలోనూ ఉండదు. 'సీటు' ఇవ్వటానికి ఆశావహుల్ని తరచూ అడిగే ప్రశ్న, ఎంత డబ్బు ఖర్చు చేయగలరు! చట్టబద్ధ, లేదా చట్ట విరుద్ధ పద్ధతుల్లో బాగా డబ్బు ఆర్జించినవారిలో పలువురు ఎన్నికైన పదవి ద్వారా ఆమోదనీయత పొందటానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది. నియోజకవర్గంలో తమ గురించి తెలియటానికి, పార్టీలోని కీలక నేతలను మెప్పించటానికి, ప్రధానంగా ప్రచారానికి చేసే చట్టబద్ధ

***శాసన సభకి, లోక్‌సభకి ఒక ప్రధాన పార్టీ అభ్యర్థిగా టికెట్ సంపాదించుకోవటానికి విపరీతమైన, వేలంవెర్రి పోటీ ఉంటుంది. ఎన్నికల్లో అంతంత ఖర్చు చేసినా ఫలితం ఎలా ఉంటుందో తెలియని అనిశ్చితి ఉన్నప్పటికీ, ఎన్నికలకు ముందు 'సీట్ల' కోసం అంత వెంపర్లాట మరే దేశంలోనూ ఉండదు. 'సీటు' ఇవ్వటానికి ఆశావహుల్ని తరచూ అడిగే ప్రశ్న, ఎంత డబ్బు ఖర్చు చేయగలరు! చట్టబద్ధ, లేదా చట్ట విరుద్ధ పద్ధతుల్లో బాగా డబ్బు ఆర్జించినవారిలో పలువురు ఎన్నికైన పదవి ద్వారా ఆమోదనీయత పొందటానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది.***

వ్యయం కాకుండా, ఓటర్లకు డబ్బు, బహుమతుల్ని పంచటానికి భారీ మొత్తాల్లో ఖర్చు చేయటానికి వారు వెనుకాడరు. చాలా రాష్ట్రాల్లో, అసెంబ్లీకి రూ.15-30 కోట్లు, లోక్‌సభకు రూ.50-75 కోట్లు సమీకరించి ఎన్నికల ఖర్చు చేయలేని వ్యక్తి పార్టీ అభ్యర్థిత్వానికి పరిగణలో కూడా ఉండరు. ఒక్కసారి డబ్బు అవరోధం తొలగాక, మీ కులం ఏమిటి? టికెట్ ఆశావహుని పుట్టుక అత్యంత కీలక నిర్ణాయకం అవుతుంది. రాజకీయ సమీకరణకు అతి కీలక సాధనంగా కులం మీద రాజకీయ పార్టీలు ఆధారపడుతున్నందున, వచ్చే అభ్యర్థి కులం అత్యంత ప్రాధాన్యాంశమవుతుంది. డబ్బు బలం, పార్టీ అధినేతల్ని సంతృప్తిపరచటం తప్పనిసరి కాబట్టి, 'తప్పు కులం' నుంచి వచ్చిన నిజమైన సమర్థ నాయకుడికి



ఎక్కువ అవకాశం ఉండకపోవచ్చు!

అధికారం విపరీతంగా కేంద్రీకృతమై, ఓటర్లకు అభ్యర్థి గత చరిత్ర తెలిసే మార్గాలులేని నేపథ్యంలో వారసత్వం మన ఎన్నికల్లో విలువైన ఆస్తిగా మారుతుంది. చాలా పార్టీలు వంశపారంపర్య రాజకీయం చేస్తున్నాయంటే యాదృచ్ఛికం కాదు. నియోజకవర్గాల్లో కూడా స్థానిక వారసులు ఆధిపత్యం చెలాయిస్తుంటారు. ఒక్కసారి తల్లిదండ్రుల్లో ఎవరోకరు పాతుకుపోయిన రాజకీయవేత్త అయివుంటే (గతంలోనైనా), కొడుకు/ కూతురుకి అనేక సానుకూలతలు అయాచితంగా వచ్చి చేరతాయి- కులం, డబ్బు, పేరు గుర్తింపు, పార్టీలో పరిచయాలు, నియోజకవర్గంలో ఏ అవసరానికైనా నెట్‌వర్క్ వగైరాలు. నిజమైన నాయకత్వాన్ని పెంచే ఏర్పాట్లు లేనందున, వారసత్వం వల్ల గొప్ప ప్రయోజనాలు సమకూరుతున్నాయి.

నేర రాజకీయాల గురించి మనం ఆందోళన చెందుతున్నాం. ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో ఆరో వంతు మందికి తీవ్ర నేర మూలాలున్నాయి. పాతుకుపోయిన నేర చక్రవర్తులకు ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువ అని పార్టీలు ఎందుకు భావిస్తున్నాయి; వాళ్లకి డబ్బుంది (నేరాల నుంచి), కులం మద్దతుంది (రాజకీయాల్లో ప్రవేశించిన ప్రతి నేరస్తుడు ఒక కులం/ కమ్యూనిటీ నాయకుడిగా ఎదిగాడు), బలమైన సంస్థాగత దన్ను, కండబలం ఉన్నాయి, ప్రజల్లో పేరు మోశారు ('సెటిల్‌మెంట్ల' ద్వారా).

మన ప్రజాస్వామ్యం నిజమైనది, పటిష్ఠమైనది; కానీ కొన్ని విషయాల్లో పేలవమైనది, లోపభూయిష్టమైనది. మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి, ఓటర్లు, పన్ను చెల్లింపుదారులమైన మన కోసం మన ప్రభుత్వాల్ని పనిచేయించటం కోసం పార్టీ రాజకీయాల్ని, అధికార పోరాటాలను దాటి మనం వ్యవహరించటం అవసరం. *

# ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు

- సంతోషిణి

ప్రజాస్వామ్యం అనేది ప్రత్యక్షంగా లేదా ప్రతినిధుల ద్వారా విభిన్న వర్గాల ప్రయోజనాలను సమన్వయం చేయటం చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రతినిధుల ద్వారా ప్రజల గొంతు వినిపిస్తుంది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. ఒక వ్యక్తి, ఒక ఓటు అనే సూత్రంలో పొందుపరచబడిన రాజకీయ సమానత్వం అటువంటి ఎన్నికల ద్వారా వ్యక్తమై, అమలవుతుంది. ఎన్నికల నిర్వహణ బ్యాలెట్ పత్రాలు, వాటిని మనుషుల ద్వారా లెక్కించటం నుండి ఓట్ల నమోదు, గణనకి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎం) ఉపయోగించటం వరకు అభివృద్ధి చెందింది. ఈ పరివర్తన ప్రపంచవ్యాప్తంగా, వివిధ దేశాలు, ప్రాంతాల్లో జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల ఫలితాల తరువాత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి పేపర్ బ్యాలెట్‌లకు తిరిగి రావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈవీఎంల వినియోగాన్ని ఎన్నికల నిర్వహణ యంత్రాంగంగానే కాకుండా, రాజకీయ సాధనం కోణంలోనూ పరిశీలించటం అవసరం.

చెల్లని ఓట్లు, బూత్ ఆక్రమణ వంటి సమస్యలను పరిష్కరించటం లక్ష్యంగా ఈవీఎంలను ప్రవేశపెట్టారు. భారతదేశంలో 1982లో కేరళలోని పరూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఈవీఎంలను మొట్టమొదట ఉపయోగించారు, వాటిని విస్తృత స్థాయిలో విస్తరించటం 2000లో ప్రారంభమైంది. 20కి పైగా దేశాలు ప్రత్యక్ష ఓటు నమోదు యంత్రాలు, పేపర్ ఆడిట్ ట్రయల్‌తో సహా వివిధ రకాల ఈవీఎంలను ఎన్నికల ప్రక్రియను మెరుగుపరచటానికి తీసుకొచ్చాయి. భారతదేశంలో, ఈవీఎంలతోపాటు ఓటరు ధృవీకరించుకునే వీలున్న పేపర్ ఆడిట్ ట్రయల్స్ (వీవీప్యాట్‌లు)ను ప్రవేశపెట్టటం పారదర్శకత, ఓటరు విశ్వాసాన్ని బాగా పెంచింది. వీవీప్యాట్‌ల ద్వారా ఓటర్లు తాము వేసిన ఓట్లను ధృవీకరించుకోవచ్చు. తద్వారా ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం పెరుగుతుంది. అయితే, ఈ సాంకేతిక పురోగతులు ఉన్నప్పటికీ, ఈవీఎంల ట్యాపరింగ్, వాటి పనితీరు గురించి ఆరోపణలు, ఆందోళనలు భారతదేశంలో, అంతర్జాతీయంగానూ కొనసాగుతున్నాయి.

**భారతదేశంలో, ఈవీఎంలతోపాటు ఓటరు ధృవీకరించుకునే వీలున్న పేపర్ ఆడిట్ ట్రయల్స్ (వీవీప్యాట్‌లు)ను ప్రవేశపెట్టటం పారదర్శకత, ఓటరు విశ్వాసాన్ని బాగా పెంచింది. వీవీప్యాట్‌ల ద్వారా ఓటర్లు తాము వేసిన ఓట్లను ధృవీకరించుకోవచ్చు. తద్వారా ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం పెరుగుతుంది. అయితే, ఈ సాంకేతిక పురోగతులు ఉన్నప్పటికీ, ఈవీఎంల ట్యాపరింగ్, వాటి పనితీరు గురించి ఆరోపణలు, ఆందోళనలు భారతదేశంలో, అంతర్జాతీయంగానూ కొనసాగుతున్నాయి.**

2009లో, అప్పటి ప్రతిపక్ష నాయకుడు ఎల్.కె అద్వాని మహారాష్ట్ర, మరో మూడు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలకు బ్యాలెట్ పత్రాలను తిరిగి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇది ఈవీఎం ఉపయోగాన్ని ఒక ప్రధాన పార్టీ సవాలు చేసిన మొదటి ఉదంతం. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంల విశ్వసనీయతపై కొందరు రాజకీయ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక హ్యాకింగ్ రిస్క్‌ల కారణంగా ఈవీఎంలను తొలగించటంపై ఎలాన్ మస్క్ చేసిన పోస్ట్‌కి స్పందనగా ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఓటింగ్ అవకతవకలపై అమెరికాలో రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ సోషల్ మీడియా ద్వారా వ్యక్తం చేసిన అభిప్రాయంపై మస్క్ ఆ కామెంట్ చేశారు. 2016 ఎన్నికల్లో అవకతవకలు ఓటు రికార్డింగ్ మిషన్ల వాడకాన్ని నిరుత్సాహపరిచే ప్రచారం పెద్దఎత్తున చేశాయి.

భారతదేశంలో, తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత వంటి రాజకీయ ప్రముఖులు ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు చేశారు. ఈవీఎంలను ప్రతిపక్ష డీఎంకే పార్టీ తారుమారు చేసిందని 2001లో ఆమె పేర్కొన్నారు. ఈ ఆరోపణలు చేసినప్పటికీ, ఆమె పార్టీ ఆ ఎన్నికల్లో గణనీయ విజయాన్ని సాధించింది. అలాగే 2011 తమిళనాడు శాసనసభ ఎన్నికలలో ఎడియంకే ఈ విజయం ఈవీఎంలపై విమర్శలు పేలవమైనవని, ఆధారాలులేవని నిరూపించాయి.

భారత్, అమెరికాలోని ఈవీఎం వ్యవస్థలను పోల్చి చూస్తే వాటి మధ్య కీలక తేడాలున్నాయని అర్థమవుతుంది. యూఎస్‌ఏలో, ఓటింగ్ మెషీన్లు తరచుగా సర్వర్‌కి కనెక్ట్ చేయబడి, ఇంటర్నెట్ ద్వారా ఆపరేట్ అవుతుంటాయి. సైబర్ అటాక్‌లకు గురయ్యే అవకాశం ఉంది. ఇందుకు విరుద్ధంగా, భారతీయ ఈవీఎంలు స్వతంత్రమైనవి, నెట్‌వర్క్‌లేని యూనిట్లు. వాటి స్వంత బ్యాటరీలతో పనిచేస్తాయి. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈవీఎంలు సురక్షిత కంట్రోలర్‌లను ఉపయోగిస్తాయి. ఇవి వన్ టైమ్ ప్రోగ్రామింగ్ (ఓటీపీ) దశ తర్వాత తదుపరి ప్రోగ్రామింగ్ నిలిపివేస్తాయి. అదనంగా, ఈసీఐ–ఈవీఎం యూనిట్లు (బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్)

డిజిటల్ సర్టిఫికెట్‌లను కలిగి ఉంటాయి. ఇవి కనెక్ట్ అయినప్పుడు పరస్పర ప్రామాణీకరణను నిర్ధారిస్తాయి. ఇది ఒకేలా కనిపించే (లుక్-అలైక్) మెషీన్‌లను ట్యాంపరింగ్ చేసే అవకాశాన్ని తగ్గిస్తుంది.



ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయటంపై ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య ప్రక్రియలకు పెద్ద ముప్పును కలిగిస్తాయి. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలను బలహీనపరుస్తాయి. నిరూపితంకాని వాదనలు కూడా ఓటర్లలో సందేహాన్ని సృష్టించగలవు. అవి ఓటింగ్ శాతాన్ని తగ్గిస్తాయి, ఎన్నికైన ప్రతినిధుల చట్టబద్ధతను ప్రశ్నిస్తాయి. అమెరికా 2020 అధ్యక్ష ఎన్నికలలో డొనాల్డ్ ట్రంప్ నుంచి జో బైడెన్‌కి ఓట్లను మార్చటానికి డొమినియన్ ఓటింగ్ సిస్టమ్స్ మెషీన్లను రిగ్గింగ్ చేశారని ట్రంప్ విస్తృతంగా నిరాధార ఆరోపణలు చేశారు. యంత్రాల ఖచ్చితత్వాన్ని నిర్ధారించే లెక్కింపు వివరాలు, పరిశోధనలు ఉన్నప్పటికీ ఆ నిరాధారమైన వాదనలు కొనసాగి, జనవరి 6, 2021న క్యాపిటల్ హింసాత్మక అరాచకానికి దారితీసింది. తప్పుడు ఆరోపణలు ప్రజాస్వామ్యాన్ని ఎలా అస్థిరపరుస్తాయో, రాజకీయ హింసను ఎలా ప్రేరేపిస్తాయో ఈ సంఘటన బలంగా తెలియచెప్పింది.

కొన్ని సందర్భాల్లో, ఈవీఎం ట్యాంపరింగ్ తప్పుడు ఆరోపణలు హింస, సామాజిక అశాంతిని ప్రేరేపిస్తాయి. అదేపనిగా ఆరోపణలు, ముఖ్యంగా ప్రభావశీల నాయకుల నుంచి వచ్చినప్పుడు, సమాజంలో రాజకీయ విభేదాలు మరింత పెచ్చరిల్లుతాయి. విభజన వాతావరణంలో హేతుబద్ధ వాదనల్ని వినిపిస్తూ ప్రసంగించటం సవాలుగా మారుతుంది. ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకం సన్నగిల్లుతుంది. ఈ విభజిత ధోరణులు ఎన్నిక తర్వాత రాజకీయంలో కొనసాగుతుంటాయి. తరచూ జీవన్మరణ సమస్యలా పోటీపడే విషవలయానికి దారితీస్తాయి. ఓడిపోయిన పార్టీలు ఫలితాలను అంగీకరించడానికి నిరాకరించే అవకాశాన్ని పెంచుతాయి. ఎన్నికల వ్యవస్థని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలహీన పరుస్తాయి.

కెన్యాలో, 2017 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలు పెద్దఎత్తున నిరసనలు, హింసకు దారితీశాయి. అధ్యక్షుడు ఉహురు కెన్యాట్టాకు అనుకూలంగా ఈవీఎంల తారుమారు జరిగిందని ప్రతిపక్ష నాయకుడు రైలా ఒడింగా ఆరోపించారు. ఈ వివాదం ఎన్నికల ఫలితాలను రద్దు చేసి, మళ్లీ ఎన్నికలకు సుప్రీంకోర్టు ఆదేశించటానికి దారితీసింది. నిరాధారమైన వాదనలు రాజకీయ ఉద్రిక్తతలను ఎలా తీవ్రతరం చేస్తాయో, న్యాయవ్యవస్థలను ఎలా దెబ్బతీస్తాయో, ప్రజాస్వామ్య పాలనను ఎలా అస్థిరపరుస్తాయో ఈ ఉదంతం వివరించింది. ఎన్నికల వివాదాలను పరిష్కరించడంలో న్యాయవ్యవస్థ పాత్ర అటువంటి ఆరోపణలకు ఆజ్యం పోసిన సామాజిక విభజనల చలనాన్ని నిర్దేశించటంలో కీలకమైనది.

అంతర్జాతీయంగా, ఈవీఎం ట్యాంపరింగ్ తప్పుడు ఆరోపణలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయి, దౌత్య సంబంధాలను ప్రభావితం చేస్తాయి. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత అంతర్జాతీయంగా జరిగిన పరిశీలన ఆ దేశ ప్రజాస్వామ్యం, ఎన్నికల సమగ్రతపై ఆందోళలను పెంచింది. ప్రజాస్వామ్య ప్రక్రియలపై ప్రపంచ విశ్వాసాన్ని కొనసాగించడానికి ప్రజాస్వామ్య నిబంధనలను సమర్థించటం, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవటం ప్రాముఖ్యతను నిపుణులు, పరిశీలకులు నొక్కి చెప్పారు. నిరంతరం నిరాధారమైన వ్యాఖ్యలు కొనసాగుతుంటే, దేశీయ స్థిరత్వం, అంతర్జాతీయ అభిప్రాయం రెండింటికీ సవాళ్లవుతాయి.

ఎన్నికల ప్రక్రియపై ధృవీకరించని ఆరోపణలు ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని పైన పేర్కొన్న వివిధ దేశాల పరిణామాలను గమనిస్తే స్పష్టమవుతుంది. ఇప్పటికే ఉన్న వైవిధ్యాలను ఓటు బ్యాంకులను సంఘటిత పరిచేందుకు ఉపయోగించుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే విధానాలకు సంబంధించి ఇటువంటి ఆరోపణలు మరిన్ని విభజనలను సృష్టించవచ్చు. మొదటి సార్వత్రిక ఎన్నికల నుండి ఎన్నికల ఫలితాలను శాంతియుతంగా ఆమోదించి, అధికార బదలాయింపులు చేసిన చరిత్ర భారతదేశానికి ఉంది. మన ఎన్నికల్లో అసలు సమస్యలు బ్యాలెట్ బాక్స్‌లో కాకుండా ఓటింగ్‌కి ముందు, తర్వాతా ఉన్నాయి. ధనబలం, రాజకీయాలను నేరపూరితం చేయటం, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవటం, వంశపారంపర్య రాజకీయాలు ఎన్నికల రాజకీయాలకు పెద్దముప్పుగా పరిణమించాయి. ఎన్నికల నిర్వహణ సాధనాల చుట్టూ స్వార్థ ప్రయోజనాల చర్చలకు అతీతంగా పెద్ద ఎన్నికల సంస్కరణలు, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం ప్రజాస్వామ్య పటిష్ఠతకు అవసరం. ❖

# ఎన్నికలు - ఇంగితజ్ఞానం

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా. జయప్రకాష్ నారాయణ్ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఒక వ్యాసం రాశారు. రాజకీయాల్లో ఇంగితజ్ఞానాన్ని పునరుద్ధరిద్దాం అనేది ఆ వ్యాసం శీర్షిక. అందులో మన ఎన్నికల తీరును ప్రస్తావిస్తూ, "మన దేశంలో ప్రజాస్వామ్యం అంటే హడావుడి, ఆర్భాటం, వేలం వెర్రి కలగలసిన కోలాహలం. ఎన్నికల్లో మనం చేసే ఖర్చు, వెచ్చించే శక్తిసామర్థ్యాలు, నైపుణ్యం, తపన ఊహకు కూడా అందవు. మన తలసరి ఆదాయంతో పోల్చి చూసుకుంటే ఎన్నికల్లో చేసే ఖర్చు అసాధారణం. అసంబద్ధమైన, లక్ష్యంలేని రాజకీయానికి మనం అలవాటు పడిపోయాం. ఎందుకో అర్థంకాని అధికారం, పదవి, గుర్తింపు పట్ల వెర్రి వ్యామోహాన్ని ప్రదర్శిస్తున్నాం. మనకు ఎన్నికలంటే సమర్థ పాలన, మన ప్రయోజనాలేంటో అర్థం చేసుకోవటం కాదు. ఎన్నికలంటే మనకు చాలామట్టుకు నాకు వ్యక్తిగతంగా గుర్తింపు ఉందా, నా కులం, నా మతం, ఆటవిక భావోద్వేగాలు, ఫ్యూడల్ పెత్తనం. మనకు రాజకీయ సంస్కరణలు అవసరమనేది నిర్వివాదాంశం. ఎన్నికల వ్యవస్థ, చట్టబద్ధపాలన, వికేంద్రీకరణ తప్పనిసరి. కానీ ఇదే సమయంలో రాజకీయాల పట్ల మోజును తగ్గించాలి. లక్ష్యాల్ని సాధించుకోవటానికి, గుర్తింపు పొందటానికి రాజ కీయాలకు బయట మార్గాల్ని అన్వేషించాలి. ఇందుకోసం మనం ఇంకా ఎంతో చేయాల్సుంది. మనం రాజకీయాలకి ఇంగిత జ్ఞానాన్ని, లక్ష్యాన్ని, సూత్రబద్ధతని పునరుద్ధరించటం ఈవేళ ఎంతో అవసరం" అని జేపీ పేర్కొన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మోదీ, ప్రతిపక్షాలు అధికారం కోసం పోటీపడిన తీరు చూస్తే ఈ మాటలు గుర్తుకురాకతప్పదు. పలు సందర్భాల్లో మోదీ ప్రచారం చూస్తే కాస్త ఇంగితజ్ఞానంతో ఆలోచించి ఉండాల్సింది అనిపించకమానదు. దిగువస్థాయి నుంచి ప్రధాని స్థాయికి




ఎదిగినా ఆ ఇంగితజ్ఞానాన్ని విస్మరించటం వల్ల, అధికారం లక్ష్యాన్ని విస్మరించటం వల్ల చేజేతులా వ్యతిరేకతను మోదీ కొనితెచ్చుకున్నారు. గెలవాల్సిన పలు సీట్లలో ఓటమి ఎదురవటానికి, ఆయనతోపాటు పలువురు అభ్యర్థులకు ఓట్లు తగ్గటానికి ముస్లింలు కాదు కారణం, ఆయన కోర్ ఓటర్లుగా చెప్పుకునే హిందువులే. ప్రతిపక్షంలోనూ ఈ వైఫల్యం ఉంది. అధికారానికి లక్ష్యమేంటో విస్మరించి దేశం ఆర్థికంగా నాశనమైనా మాకు మాత్రం ఎలాగోలా అధికారం రావాల్సిందేననే ధోరణితో వ్యవహరించాయి. అయితే ప్రభుత్వం పదేళ్లపాటు వరుసగా అధికారంలో ఉండటం వల్ల ప్రభుత్వం పట్ల ఉండే కొంత వ్యతిరేకత, పేదరికం ఎక్కువగా ఉండి, ప్రజాస్వామ్యం బలహీనంగా ఉన్న మనలాంటి దేశంలో తాత్కాలిక పథకాలకుండే ఆదరణ వల్ల ప్రతిపక్ష 'ఇండియా' కూటమి లాభపడి ఉండవచ్చుగానీ, వారూ ప్రజావ్యతిరేక రాజకీయమే చేశారు. ఎన్నికల ప్రచారంలో మీడియాను

### కొత్త హామీల్ని అభివృద్ధిలో భాగంగా చూస్తున్న సామాన్యుడు

ఎప్పుడైతే మోదీ పట్ల నమ్మకం కన్నా భయాందోళనలు పెరిగాయో, అలాంటివారికి ఈ పదేళ్లలో పరిష్కారంకాని సమస్యలకు సామాజిక న్యాయం పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన పరిష్కారాలు అందుబాటులో ఉన్న మార్గంగా కనిపించాయి. మోదీ వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లను రద్దు చేస్తారని జరిగిన ప్రచారం ప్రభావం చూపింది. దీన్ని ఎదుర్కోవటానికి మోదీ ఎంత ప్రయత్నం చేసినా, ముఖ్యంగా అణగారిన వర్గాల్లో అపనమ్మకం పోలేదు. రెక్కాడితేగానీ డొక్కాడని అసంఘటితరంగం ఎక్కువగా ఉన్న దేశంలో తాత్కాలిక పథకాలకు ఆదరణ ఉంటుంది. రాజ్యాంగం అంటే ఏమిటి, రిజర్వేషన్ల మీద పరిమితి ఎత్తివేయటం రాజ్యాంగ విరుద్ధం కాదా, రిజర్వేషన్లు పెంచినా ఎంతమందికి అవకాశాలు వస్తాయి, అనే చర్చలేకుండా ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి ఎక్కువ ఓట్లు వేశారు. సముద్ర మట్టం పెరిగితే పడవలన్నీ పైకి ఎగసినట్లు, అభివృద్ధి వల్ల అందరి జీవితాలూ మెరుగుపడతాయనే వాస్తవాన్ని ప్రజలు సంక్షేమం పేరుతో హామీ ఇస్తున్న తాత్కాలిక పథకాలకు ఎక్కువగా వర్తింప చేసుకుని, ఎన్నిక ఎన్నికకూ కొత్త హామీలిస్తుంటే తమ జీవితాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. కొంతమేర అభివృద్ధిని కోరుతున్నా, తాత్కాలిక సంక్షేమ పథకాలకు అధిక మొగ్గు చూపుతున్నారు.

అప్రజాస్వామికంగా శాసించటం వల్ల బీజేపీకి కొంత లాభం జరిగుండొచ్చుగానీ, నష్టం కూడా తక్కువేమీ కాదు. మోదీ భావాల్ని వ్యతిరేకించటానికి సంకోచించని కొందరు సీనియర్ జర్నలిస్టులు కూడా స్టూడియో చర్చల్లో తమ ఎన్నికల కవరేజీ పర్యటనల్ని వివరిస్తూ, మోదీకి అంతా అద్భుతంగా ఉందని చెప్పటం, ఆ తర్వాత ఎగ్జిట్ పోల్స్‌లోనూ అదే ధోరణిని కనబర్చటం, ఎగ్జిట్ పోల్ ఫలితాలపై ఒక ప్రధాని ట్వీట్ చేయటం మోదీ పట్ల మొగ్గు చూపేవారికి కూడా వెగటుగా అనిపించకమానదు.

**అభివృద్ధిలో పేదలనూ భాగస్వాముల్ని చేయాలి**

హిందువులలో ఒక బలమైన పునాదిని ఏర్పరచుకోవటం వరకు బీజేపీ ఇప్పటికే ఘనవిజయం సాధించింది. అందులో మోదీ పాత్ర అద్వితీయం. అయితే ఆ పునాదిని సద్వినియోగం గావించుకోవాలంటే, ఆచరణసాధ్యంగా, అవగాహనతో వ్యవహరించాలి. సమాజ కూర్పుని, సామరస్యతను దెబ్బతీసేలా ముస్లింలను ఒక పరిధి దాటి విమర్శిస్తే తన పార్టీ పరంగా కూడా దెబ్బతినాల్సి వస్తుంది. అందువల్ల హిందువుల ఆస్తుల్ని లాక్కుని ముస్లింలకు పంచుతారు వంటి వ్యాఖ్యలకు బదులు, తాత్కాలిక పథకాల కన్నా తమకు నిజమైన ప్రయోజనాన్ని చేకూర్చే కార్యక్రమాలకు ప్రజలు మొగ్గు చూపేలా మోదీ వ్యవహరించాలి. అభివృద్ధిని సమ్మిళితం చేయాలి. ఇందుకోసం అవసరమైనరీతిలో అభివృద్ధి నమూనాను మార్చాలి. తమకంటే సంపన్నులను చూసి పేద, దిగువ మధ్యతరగతివారు అసూయ పడకుండా, వారి పట్ల విద్వేషం వెదజల్లుతూ సమయం వృథా చేసుకోకుండా, తమకూ అలాంటి సంపదసృష్టిలో భాగస్వాములయ్యేందుకు కావలసిన అవకాశాలున్నాయని గుర్తించేలా, ఆ విశ్వాసం వారిలో పెంపొం

## వ్యవస్థ పనిని ఒక పరిధికి మించి వ్యక్తి చేయలేరు

ప్రజలు ఎప్పుడు ఏ నాయకుడి పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తారో తెలియని పరిస్థితి. డబ్బు ఖర్చు చేయకుండా ఎన్నికల్లో గెలవటం దాదాపు అసాధ్యం, డబ్బుతోపాటు తాత్కాలిక పథకాలు వంటి హామీలు అవసరం, ఎంతో కొంత అభివృద్ధినీ చూపాలి, అవసరమైతే భావోద్వేగాలనూ పంచాలి వంటి అంశాల్లో పార్టీలకు కొంత అంచనా ఉంది గానీ, ఇవన్నీ చేసినా గెలుస్తామా, లేదా అనే సందేహం మాత్రం పార్టీలకు ఉంది. ఈ పనులు చేస్తే ఎన్నికల్లో గెలుస్తామని బలమైన సాంప్రదాయ పార్టీలు కూడా కచ్చితంగా చెప్పలేకపోతున్నాయి. అభివృద్ధికి, సంక్షేమం పేరుతో ఇచ్చే తాత్కాలిక పథకాలకు మధ్య తేడాను, సమతూకాన్ని స్పష్టంగా అర్థం చేసుకోలేని ఓటర్లు ఎక్కువున్న సమాజంలో మోదీ ప్రచార వ్యూహాన్ని తన చుట్టూ కేంద్రీకరించటం, తిప్పుకోవటం మితిమీరిన ఆత్మవిశ్వాసమైంది. దేశానికి 2047 వరకు ఎజెండాతో ఆర్థికాభివృద్ధిని సాధించటంతోపాటు తన పార్టీకి కూడా తిరుగులేని శక్తిగా నిలపటానికి వ్యూహాత్మకంగా తన పర్సనాలిటీ ఉపయోగపడుతుందని ఆయన భావించి ఉండవచ్చు. తననో దైవదూతగా, అవతార పురుషుడిగా ప్రొజెక్ట్ చేసుకుంటూ ప్రచారం చేస్తే, భవిష్యత్తులో దేశంతోపాటు, బీజేపీకి కూడా ఐకాన్‌గా తాను మిగిలిపోతానని ఆయన అనుకుని ఉండొచ్చు. కానీ జీవితాలు, ఆదాయాల ముందు, వాటికి తాత్కాలిక తాయిలాలు ప్రత్యామ్నాయంగా ఉన్నప్పుడు దేవుడు, వ్యక్తి ఆరాధనలు ఒకస్థాయి మించి పనిచేయవు. నిజమైన ఆధ్యాత్మికత దేవుడి కంటే, చుట్టూ ఉన్న మనుషులకి, వారి సమస్యలకి ప్రాధాన్యతనిస్తుందని మనం జగద్గురువులుగా భావించే అనేకమంది ఆచరణ ద్వారా చెప్పారు. ఈ ఎన్నికల్లో ఎప్పుడైతే ప్రతికూల వాతావరణం ఏర్పడిందని గుర్తించారో అప్పుడు ప్రధాని స్థాయిని కూడా మరచి మోదీ చేసిన వ్యాఖ్యలు హైందవం పట్ల ఆయనకున్న అవగాహనను, ఆ ధర్మాన్ని అనుసరించే నాయకుడిగా ప్రదర్శించాల్సిన స్థితప్రజ్ఞత సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేశాయి. హిందూయిజాన్ని అనుసరించేవారు తమ సంస్కృతిని గౌరవించుకోవాలి, గుర్తించాలి అని కోరుకుంటారు తప్ప ముస్లింలనో, మరో మతాన్నో ద్వేషించటాన్ని ఆమోదించరు. మోదీ విద్వేషపూరిత లేదా ప్రతికూల ప్రసంగాలు చేసిన చోటల్లా బీజేపీ ఓడింది. రాముడు, సీత ముద్రలున్న స్థలాల్లో సైతం బీజేపీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. మహారాష్ట్రలోనైతే మోదీ ప్రచారం వల్ల తాము గెలిచామని ఎన్సీపీ నేత శరద్ పవార్ కృతజ్ఞతలు తెలిపారు. మోదీ వ్యక్తిగత నైతిక ఆధిక్యతను ఎక్కువ మంది కాదనలేరు. కానీ మాటలకు, చేతలకు మధ్య ఉన్న అంతరాన్ని, మార్పుకి తీసుకునే సమయాన్ని వ్యవస్థల నిర్మాణం ద్వారా కాకుండా, తన వ్యక్తిగత సామర్థ్యంతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తూ వచ్చారు. ఒక వ్యక్తి నిజాయతీపరుడైనా, ఎంత సమర్థుడైనా, ఎంత సాంకేతికత ఉన్నా, ముఖ్యంగా భారత్‌లాంటి దేశంలో వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదు. పార్టీ ఫిరాయింపులు, ప్రతిపక్షాలపై ఈడీ దాడులు, రాహుల్‌పై వేటు, ఎన్నికల సమయంలో కేజ్రీవాల్ అరెస్టు వంటివి ఆయన మాటలకు, చేతలకు మధ్య అంతరాన్ని బయట పెడుతున్నా, వాటిని మరపించే విశ్వసనీయత తనకుందని మోదీ అతి ధీమాకు పోయారు. ప్రతిపక్షాలను అంశాల వారీగా కాకుండా వ్యక్తిగతంగా, దాడులు చేసినట్లు విమర్శించే ధోరణిని ప్రజలు హర్షించలేదు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Vote Jugaad July 2024! జుగాడ్ 50:50 రాజనీతి

## నమూనా మార్పుకి సమయం ఆసన్నమైంది.

## జుగాడ్ అంటే సృజనాత్మకతతో కూడిన పారదర్శక ఆలోచనా విధానం !

## ఆలోచనాపరులందరికీ పునః సమీక్షా సమయం

**"ఏ సమాజంలో అయితే నీతి తప్పిన వారు విజయం సాధిస్తారో, ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారుతారో, ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో, ఎక్కడైతే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా తమకు కావాల్సిన వాటా కోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో, అక్కడ వ్యవస్థకు సంబంధించిన పునః సమీక్షకు సమయం ఆసన్నమైందని అర్థం. అప్పుడు తమగురించి, తమకు సంబంధించిన వారి గురించి, తమ చుట్టూరాఉన్న వారిగురించి, తమ కార్యకలాపాలకు సంబంధించి అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి" - రాబర్ట్ క్లిట్ గార్డ్ (ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త).. "సురాజ్యం నిర్మిద్దాం" అంటూ 2012లో FDR ప్రచురించిన పుస్తకం నుండి..ధన్యవాదాలతో.. సేకరణ.**

**ఆరు జాతీయపార్టీలు, 60 స్థానికపార్టీలు, 2700 రిజిస్టర్ కాబడిన పొలిటికల్ పార్టీలు ఉన్న మనదేశంలో పొలిటికల్ భావజాలాలకు లోటులేదు. ప్రతిఓటరూ తనకీ, తన కుటుంబానికీ (తన కులానికీ,మతానికీ,భాషకీ,ప్రాంతానికీ కూడా) లాభకరంగా ఒక "పార్టీని" ఏర్పాటు చేసుకుని వ్యక్తిగతంగా లబ్ధి పొందేటందుకు అవకాశం/స్వేచ్ఛ మన "ప్రస్తుత" రాజ్యాంగం "స్వతంత్ర ప్రతిపత్తికలిగిన జాతీయ ఎన్నికల కమిషన్" ద్వారా కల్పించింది. అందుకే 8300 మందికి పైగా స్వతంత్ర (ఇండిపెండెంట్లు) అభ్యర్థులు 543 MP సీట్లకోసం బరిలోకి దిగేరు. కోట్లకొద్దీ (నల్ల/తెల్ల) డబ్బున్నవాళ్ళే విచ్చలవిడిగా "పార్టీలవ్యాపారం" సాగిస్తున్నారని విజ్ఞులైన ఓటర్లు గ్రహించాలి.**

[According to the Forum for Good Governance,14 out of the 17 MPs elected to the 18th Lok Sabha from Telangana, have criminal cases registered against them. ADR analysis, June, 2024 says: 93% of Lok Sabha poll winners (in2024) are crorepatis: "Top three wealthiest candidates are (1)TDP MP (.5705 cr.) from Andhra Pradesh's Guntur, (2) BJP MP (.4568 cr.) from Telangana's Chevella & (3)BJP MP (1241cr) from Haryana]

**2024 ఎన్నికలలో ఆంధ్రప్రదేష్ లో "మూడుపార్టీల సంకీర్ణ ప్రభుత్వం" లోని ఒకపార్టీఅధినేత ఇచ్చినహామీతో, నెలకి 4000 రూపాయల చొప్పున 60 లక్షలమందికి ఐదేళ్లపాటు "పింఛన్లరూపేణా" ఇస్తోంది. అంతేకాదు, ఇప్పటిదాకా 3000 రూపాయల పింఛను ఇస్తూ, 2024 ఎన్నికల్లో గెలిపిస్తే 4000 రూపాయల పింఛను ప్రకటించి, అంచెలంచెలుగా "సంపూర్ణ మద్యపాన నిషేధం" అంటూ మద్యం-వ్యాపారం ఆదాయవనరుగా చేసుకొని బ్రతికిన వేరొక పార్టీ అధినేతతో "ఉచిత తాయిలాల వేలంపాట"లో పంతంపట్టి, అధికారం సంపాదించుకుంది. 2014 నుంచి జరిగిన 3 ఎన్నికలలో ముగ్గురు నియంతల యొక్క డబ్బుకీ మద్యంకీ, ఓటర్లు బలిపశువులయ్యారు. సుపరిపాలన కావాలంటే జుగాడ్ ఓటర్లే తమ డబ్బుతో అవినీతిలేని పార్టీ పెట్టుకోవాలి**

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి– 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ – 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Cooperation based on trust - Jugaad Voters' Government!

## (నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం)

**వ్యక్తిగతంగా ఓటరు తనయొక్క వార్షికాదాయం రూ. లక్షన్నర పైనుంటే 2 వేలు, లేదా 5 లక్షల పైనుంటే 5 వేలు, లేదా 10 లక్షల పైనుంటే 10 వేల రూపాయిలు జీవితంలో ఒకేసారి ఇచ్చే విరాళం మెరుగైన సమాజం కోసం అని మమ్మల్ని నమ్మిన వారందరూ జుగాడ్ ఓటర్లే. పార్టీ ప్రారంభదశలో తెలుగు రాష్ట్రాలలోని ప్రతీ MLA నియోజకవర్గంనుండీ కనీసం ఒక భావి భారత భాగ్య విధాత (రూ. 10వేల విరాళంతో) ముందుకు రావాలని మా విన్నపం. జుగాడ్ ఓటర్లచే నిర్వచించబడిన "75 శాతం మెజార్టీతో సుపరిపాలన" రావాలంటే, ప్రతిపాదిత ద్విపక్ష "జుగాడ్ స్వర్ణభారత్ పార్టీ" లో ప్రవేశం ఎవ్వరికీ ఉచితంగా లభించదు. . రైతన్నలూ, శ్రామికవర్గాలు, లాయర్లూ, డాక్టర్లూ, ఇంజనీర్లూ, ప్రభుత్వోద్యోగులూ, మీడియా మిత్రులతో సహా అందరూ కనీసం రూ. 2000 (జీవితంలో ఒకేసారి) విరాళమిస్తారని మా విశ్వాసం. పట్టభద్రులందరూ చట్టబద్ధులే! నేరచరితులకు BForm లభించదు. తాము స్వీకరించిన పనికి తగ్గ తాత్కాలిక నేతృత్వాధికారం మాత్రమే ఉంటుంది. నాతోసహా, ఎవ్వరికీ అధినేత హెూదా ఉండదు. సందర్భోచితంగా అనుసంధానకర్తలకు 3 ఓట్లతో వీటోహక్కు ఉంటుంది. MLA నియోజకవర్గం నుండి గ్రామ సర్పంచి వరకూ నిధులు, బాధ్యతలు, జవాబుదారీ ప్రాతిపదికగా జుగాడ్ ఓటర్ల పర్యవేక్షణలో స్వయంపాలనాధికారం! ప్రజలే ప్రభువులనే నినాదానికి తగిన నమూనా మార్పు.**

**25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ "ప్రతిపాదిత జుగాడ్ పార్టీ ఓటరు" గా ఇదే నా వ్యక్తిగతమైన ఆహ్వానం! (నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం) అనే ధ్యేయంతో సంఘటితంగా ఒక ప్రయత్నం చేద్దాం రండి. త్వరపడండి. మేమంతా జుగాడ్ ద్విపక్షపార్టీని ప్రతిపాదిస్తున్నాం!సమిష్టి నిర్ణయాలతో పార్టీ నిర్మిద్దాం.**

**జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు :** (Rs/-10,000 donors)
Sarvasri : (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)

**జుగాడ్ ఓటర్లు :** Sarvasri (11) JVL. NARAYANA (Nellore AP) (12) S.D.BABU (Tamilnadu) (13) T.SURYANARAYANA (Vizag AP) (14)Smt.D. SUBHADRA (15) M.RANGA RAO (16) M.SAI SUBBARAO (17) Smt.D.JANAKI (18) J.VENKATA RAO (Vijayawada AP) (19) P.NARASIMHA RAO (20) SAI SURYANARAYANA (Karnataka) (21) MSS KUMAR (22) Dr.U.V.KRISHNA MURTHY (23) M.RAMA RAO (24) NANDAN SRIDHAR (25) Smt.K.RAJESWARI (26) Smt.K.LAKSHMI (27) Justice CHANDRAKUMAR (28) K. VASUDEVA RAO (29) NARAGONI (30) D.KONDALA RAO (31) M.S. Narayana Rao (32) Sriram (Amalapuram AP) (33) P.Sunil (Bhimavaram AP) (34) Amaranath (35) B.Poorna Kumar Das

**Contact: Jugaad Parthasarathy (9866416798) With (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

**advt**

## పౌర సమాజంతో సంభాషణ అవసరం

బీజేపీ తప్ప మరో పార్టీ దేశంలో ఉండకూడదని ప్రజలు కోరుకోవటం లేదు. సమర్థుడైన, వినమ్రుడైన ప్రధాని, అందరినీ ప్రజాస్వామ్యయుతంగా కలుపుకుని వెళ్లే ప్రధాని కావాలని ప్రజలు కోరుకున్నారు. అదేవిధంగా మోదీ గ్యారంటీని మాత్రమే ప్రజలు కోరుకోలేదు, స్థానికంగా తమకు అందుబాటులో ఉండే నాయకులను కూడా కోరుకున్నారు. ఇద్దరి మధ్యా తేల్చుకోవాల్సి వచ్చినప్పుడు, స్థానిక ప్రాధాన్యతను స్పష్టంగా తెలియచెప్పారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ఈ అంశాన్ని చాలా ప్రస్ఫుటంగా మోదీకి తెలియచెప్పింది. బీజేపీ అభ్యర్థులలో 100 మందికిపైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. వారికి టికెట్టివ్వటం కోసం స్థానిక పార్టీ నాయకులు మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ఇలాంటి ప్రయోగాలు కొన్నిసార్లు సత్ఫలితాలనిచ్చి ఉండవచ్చు. కానీ దీన్నే ఫార్ములాగా కాకుండా, ప్రజాస్వామ్యయుతంగా నిర్ణయాలు తీసుకుని ఉంటే మోదీ తన ఆదరణను నిలబెట్టుకుని ఉండేవారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో, న్యాయ్ యాత్రలకు ప్రజల్లో ఆదరణ లభించటానికి పౌర సమాజాన్ని సద్వినియోగం గావించుకోవటం కూడా ఒక పెద్ద కారణం. వారి ద్వారా ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ఒక సీరియస్‌నెస్ తెచ్చే ప్రయత్నం చేశారు. రాహుల్‌కి మద్దతిచ్చిన పౌర సమాజంలో పలువురు అతివాద వామపక్ష ధోరణులున్నవారున్నా, వారి భాగస్వామ్యంతో సమాజంలో ఒక చర్చను, ప్రజల సమస్యలపై ఒక సంభాషణను రాహుల్ తేగలిగారు. కానీ పౌర సమాజం బదులు మోదీ అధికారాన్ని, రాజకీయ పలుకుబడిని, వ్యక్తిగత ఆధిపత్యాన్ని నమ్ముకుని ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. పార్టీ రాజకీయంతో సంబంధం లేకుండా ప్రజలను ప్రభావితం చేసేవారు, ప్రజాసేవ నేపథ్యం ఉన్నవారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునే ధోరణి, ప్రజాస్వామికంగా చర్చించి మెరుగైన అభిప్రాయాలను స్వీకరించే ధోరణి ఉన్నట్లయితే మోదీ మరింతగా ప్రజలను మెప్పించగలిగి ఉండేవారు. మోదీ 200 సభలు, కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్త ప్రచారం చేశారు. పలు ప్రముఖ టీవీ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. సోషల్ మీడియా బృందాల ద్వారా భారీ ప్రచారం చేశారు. కానీ అవన్నీ ఒకరకంగా ఆధిపత్యపు హూంకరింపులుగా కూడా ప్రజల్లోకి వెళ్లాయి. చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదనే భావం, తమ రోజువారీ జీవితానికి సంబంధంలేదనే భావం సామాన్య ప్రజల్లో కలిగింది. ఈసారి ఎన్నికల్లో ఒక భావోద్వేగ అంశం అందుబాటులో లేదని అర్థమయ్యాక, అయోధ్య రామాలయ ప్రభావం కూడా ఒక పరిధి దాటి ఉండదని ముందుగానే గుర్తించగలిగాక మోదీ పార్టీలో, పౌర సమాజ అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చి ఉంటే ఆ లోపాలు తలెత్తకుండా ఎక్కువ ఆచరణాత్మకంగా వ్యవహరించగలిగేవారు, మెరుగైన ఫలితాలు సాధించగలిగేవారు.

దించేలా చర్యలు తీసుకోవాలి. పాలనా పరంగా కూడా ఇందు కోసం కార్యాచరణ అవసరం.

ఆర్థికాభివృద్ధి విషయంలో మోదీకి ఉన్న దీర్ఘకాలిక దృష్టి సమ్మిళిత అభివృద్ధిగా మారాలంటే, ప్రజలకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన ఆరోగ్యం, విద్య అందరికీ అందుబాటులో ఉండాలి. అదేవిధంగా ఈ ఎన్నికల్లో పేదరికం ఎక్కువగా, ఆదాయాలు తక్కువగా ఉన్నచోట్ల బీజేపీ, మిత్రపక్షాలు కూడా దెబ్బతిన్నాయి. ఇవి ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రతిపక్షాలేమీ వినూత్నంగా, కొత్త ఆలోచనలతో పోరాటాలు చేయకపోయినా, బీజేపీ గత ఎన్నికల్లో అనుసరించిన కుల సమీకరణల్నే అమలు చేసినా ఎక్కువ సీట్లు గెలుచుకున్నాయి. ఉత్తరప్రదేశ్ ఇందుకు గొప్ప ఉదాహరణ. కాబట్టి మోదీ ఆర్థికాభివృద్ధి ఫలాలు పట్టణ ప్రాంతాలను దాటి గ్రామీణానికి విస్తరించే చర్యలు తీసుకు రావాలి. అభివృద్ధి అంటే పట్టణీకరణ. అంటే, గ్రామాలకు పట్టణ సదుపాయాలు అందుబాటులోకి తేవటం. ఇందుకోసం గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. అక్కడ మౌలిక వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ప్రయివేటు రంగం మిగిలిన పట్టణ వసతుల్ని సమకూరుస్తుంది. అదేవిధంగా ఈడీ దాడులపై ఆరోపణలకు మోదీ వ్యవస్థీకృత సమాధానం ఇవ్వాలి. దేశంలో సంక్లిష్ట సమస్యలు తలెత్తినప్పుడు వాటిపై మౌనం వహించకుండా మోదీ మాట్లాడటం అవసరం. మణిపూర్ వంటి సంఘటనలపై మోదీ మౌనం వహించటాన్ని దేశంలోని ఏ రాష్ట్ర ప్రజలూ ఆమోదించలేరు. కీలక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించటం, దేశ ప్రయోజనాల విషయంలో అందరినీ ఒప్పించే ప్రయత్నం చేయటం, మౌలికాంశాలపై ఏకాభిప్రాయం, మధ్యే మార్గం వంటి పద్ధతులు, అందరినీ భాగస్వాముల్ని చేస్తూ సమ్మిళిత అభివృద్ధికి చర్యలు, సహకార ఫెడరలిజాన్ని స్థానిక స్థాయికి విస్తరించటం మొదలైన చర్యలతో సంకీర్ణం ద్వారా కూడా చరిత్రాత్మక విజయం సాధించే అవకాశం ఉంది.

2014 నాటి మూలాల్ని, దార్శనికతని నిజాయతీగా సమీక్షించుకుంటే చాలు, 2024 కార్యాచరణలో మెజారిటీ ఉన్నప్పటి కంటే ఎక్కువ స్థాయి విజయం సాధించే అవకాశముంది.

గెలిచినవారు ఓడినట్లు, ఓడినవారు గెలిచినట్లు న్యూనతలు, అతిశయాలు లేకుండా ఎన్డీయే, ఇండియ కూటములు ఇంగిత జ్ఞానాన్ని ప్రదర్శించి అంతర్మథనం గావించుకోవాలి. తమకున్న అవగాహన, అవకాశం పరిధిలోనే అయినా ప్రజలు ఇంగితజ్ఞానంతో ఓటు వేసిన తీరు నుంచి నేర్చుకోవాలి. తమ మనుగడ కోసమైనా రాజకీయాలకు లక్ష్యాన్ని పునరుద్ధరించి, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి కోసం భారత్‌కున్న అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేయటం, ప్రజాస్వామ్య పటిష్ఠత కోసం పోటీపడి కృషి చేయాలి.

*

# ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి ఎలా? సంక్షేమం ఎలా?

శ్రీరామ్

***ఈసారి ఎన్నికల ఫలితం వల్ల, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో తేటతెల్లమైన విషయం ఏమంటే, సంక్షేమం మాత్రమే పాలన అంటే, ఆ సంక్షేమం ఎంత బాగా చేసినా సరిపోదు. అభివృద్ధి కూడా కచ్చితంగా కావాలి.***

ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ నిధులను ఏమాత్రం అవినీతి లేకుండా, ఎమ్మెల్యేల మీద ఆధారపడకుండా, ప్రభుత్వ అధికారులతో సంబంధం లేకుండా, లంచాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందచేసి పథకాలను చాలా బాగా అమలు చేసింది. దీనికి వాలంటీర్ల వ్యవస్థను ఉపయోగించుకుంది. సంక్షేమం మాత్రమే సరిపోయేట్లయితే వైసీపీ ప్రభుత్వం గత ఎన్నికల్లో గెలిచి ఉండాల్సింది. అయితే అలా జరగలేదు.

సంక్షేమం వల్ల ఈరోజు కడుపు నిండవచ్చు, కానీ రేపటి



ఆకలి ఆగదు, తీరదు. అందరికీ అందే అభివృద్ధి వల్ల మాత్రమే ప్రజలు పేదరికం నుండి బయటకు వస్తారు. అలా అని సంక్షేమం ఆపలేము. ఈరోజు ఆకలితో ఉన్నవారికి రేపు ఏదో అద్భుతం జరుగుతుందంటే ఆకలి తీరదు.

**మరి సంక్షేమం, అభివృద్ధి రెండూ ఒకేసారి ఎలా చేయాలి?**

సంక్షేమం: తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటానికి చాలా హామీలు ఇచ్చింది. ఆ హామీల్లో ఎక్కువ శాతం సంక్షేమానికి సంబంధించినవే. ఈ సంక్షేమ పథకాలలో లబ్ధిదారులు అర్హులేనా కాదా అని సరిగ్గా నిర్ధారించాలి. చాలామంది లబ్ధిదారులకు ఈ డబ్బు వల్ల కొత్తగా ఒరిగేదేమీ లేదు. ఉదాహరణకు రైతు భరోసాలో ఎంతోమంది వ్యవసాయం చేయనివారికి, చాలా ఎక్కువ భూమి ఉన్నవారికి కూడా ఈ డబ్బులు వెళుతున్నాయి. అది ప్రభుత్వానికి, అంటే ప్రజలుగా మన డబ్బుకి ఎంతో నష్టం. ఇంకా కొన్ని పథకాలలో నేరుగా డబ్బులు కాకుండా వోచర్లు ఏర్పాటు చేస్తే నియంత్రణ చాలా సులభంగా ఉంటుంది. అదేవిధంగా, అమ్మ ఒడిలో నేరుగా డబ్బులు ఇవ్వటం పందేరంలా తయారైంది తప్ప పిల్లలకు సరైన చదువు రావటం లేదు. ఆ డబ్బును విద్యా ప్రమాణాలతో సంధానం చేస్తే ఖర్చు కలిసి రావటంతోపాటు పథకం వల్ల నిజంగా ప్రయోజనం లభిస్తుంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు నిధుల కోసం పోటీ పడేలా మరికొన్ని మార్పులతో రీడిజైన్ చేయవచ్చు. ఆరోగ్యశ్రీ పరిమిత పథకమే, కానీ ఆసుపత్రుల మధ్య ఎంపిక అవకాశమిస్తూ పోటీపడేలా చేయటం వల్ల ప్రజాదరణ పొందింది. అలాగే ఇన్ని సంక్షేమ పథకాలలో లబ్ధిదారులకు నేరుగా డబ్బులు ఇవ్వటం కంటే వారికి లబ్ధి వేరేగా ఎలా చేకూర్చగలమో చూసుకోవాలి.

అభివృద్ధి: ఆర్థిక అభివృద్ధి సాధించటానికి ముఖ్యంగా చేయాల్సిన పనులు మూడు.

1. **మౌలిక సదుపాయాలు:** ముఖ్యంగా రహదారులు, పోర్టులు, రైల్వే లైన్లు వేయటం, ఉన్నవాటిని మెరుగుపరచటం. ఈ మౌలిక సదుపాయాలు సరిగా అందచేయటం వల్ల రవాణా మెరుగుపడుతుంది. ఇంకా ఆర్థిక అభివృద్ధి విస్తరించి ఫలాలు మారుమూలలకు అందుతాయి.

2. **వృత్తి నైపుణ్యం:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం చేసిన మొదటి సంతకాలలో ఇది ఒకటి. నైపుణ్యం యువతలో పెంపొందిస్తే వారి కాళ్ళ మీద వారు నిలబడతారు. అతి చిన్న పరిశ్రమల నుండి భారీ పరిశ్రమల వరకు దేనిలోనైనా వీరు పనిచేయగలుగుతారు.

3. **పెట్టుబడులు:** పెట్టుబడులు, పరిశ్రమలు ఎక్కడ మౌలిక సదుపాయాలు ఉంటే, ఎక్కడ లాభం ఉంటే, ఎక్కడ సౌకర్యాలు ఉంటే, ఎక్కడ నైపుణ్యత ఉంటే అక్కడికి తరలిపోతాయి. ఈ వసతులు ఏర్పాటు చేయటం ప్రభుత్వం పని. టీడీపీ ప్రభుత్వం ఇంతకుముందు పెట్టుబడులు తీసుకొచ్చే పని బాగా చేసింది. ఇప్పుడు కూడా సమర్థంగా వ్యవహరిస్తారని ఆశిద్దాం.

సంక్షేమాన్ని, అభివృద్ధిని జాగ్రత్తగా సమతౌల్యంతో కొన్ని సంవత్సరాల పాటు కొనసాగించగలిగితే, రాష్ట్ర జీడీపీని ఏడాదికి 7 నుంచి పది శాతం పెంచగలిగితే, సంక్షోభం వల్ల రాష్ట్ర ఆదాయం మీద ఉన్న భారం తగ్గుతుంది. సంక్షేమం అవసరమైన వారి సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. ఈ కొత్త ప్రభుత్వం ఆర్థిక అభివృద్ధి, సంక్షేమ పాలనను పేదరికాన్ని నిర్మూలించేలా, దీర్ఘకాలంలో ప్రజలు తమ కాళ్ళ మీద తాము నిలబడేలా సమర్థంగా నిర్వహించాలని ఆశిస్తున్నాను. ⁕

# ఏపీలో చట్టబద్ధపాలన ప్రక్షాళన

మన దేశంలో చట్టబద్ధపాలన ఎంత అధ్వాన్నంగా ఉందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. చట్టాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన ప్రభుత్వాలే చట్టబద్ధపాలనను దుర్వినియోగం చేయటం, ప్రత్యర్థుల మీద దాడులకు కీలక రాజకీయ వ్యూహంగా అమలు చేయటం మన దేశంలో ఆనవాయితీగా వస్తోంది. మెరుగైన ప్రజాస్వామ్య దేశాలను చూస్తే, మన చట్టబద్ధపాలన స్థాయి దిగ్భ్రాంతి కలిగిస్తుంది. 2014లో చరిత్రాత్మక తీర్పుతో ఎన్నికైన మోదీ కూడా ఈ పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం ఇప్పటిదాకా చేయలేదు. సరిదిద్దకపోగా, తాను కూడా దుర్వినియోగంలో భాగమయ్యారు. ఉదాహరణకు దర్యాప్తు సంస్థ ఈడీ దాడుల విషయంలో మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందనేది బహిరంగ రహస్యం. తన పక్షమైతే తీవ్ర నేరాలకు పాల్పడినవారిని కూడా ఉపేక్షించారు. కొన్నిచోట్ల హింస జరుగుతున్నా మౌనం పాటించారు. చట్టబద్ధపాలనను ప్రధానంగా అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తక్కువేం తినలేదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇదేరీతిలో వ్యవహరిస్తున్నాయి. రాజ్యాంగ ప్రజాస్వామ్యం ఏర్పడి డెబ్భై అయిదేళ్లవుతున్నా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు ఇవ్వటానికి కోట్ల మంది ప్రజలు భయపడే అనాగరిక పరిస్థితి ఇంకా కొనసాగుతోంది. చట్టబద్ధపాలన ఇంత అధ్వాన్నంగా ఉంటే మనలాంటి ఎంతో వైవిధ్యమున్న దేశంలో కనీసస్థాయి శాంతిభద్రతలుండటం కూడా అసాధ్యం. కానీ మన సంస్కృతి సంప్రదాయాల్లోని బలం సమాజాన్ని కాపాడు తోంది. అభివృద్ధి, అందుకోసం పట్టణీకరణ, సాంకేతికత పెరుగుతున్నకొద్దీ సంప్రదాయం బలహీన పడుతూ నేరాలు పెరుగుతున్నాయి.

చట్టబద్ధపాలనను బలోపేతం చేయకుంటే, సురక్షితంగా బతకటం, ఎవరైనా చొరవ చేసి పెట్టుబడులకు ముందుకు రావటం ఉన్నకొద్దీ కష్టమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నమేర కూడా పరిరక్షించకుండా ఆంధ్రప్రదేశ్‌లో గత వైకాపా ప్రభుత్వం చట్టబద్ధపాలనను మరీ దిగజార్చింది. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో చట్టాన్ని పెద్దఎత్తున దుర్వినియోగం చేశారనటానికి అనేక సాక్ష్యాధారాలు కనిపిస్తాయి. పోలీస్ స్టేషన్‌లో సాధారణ ఫిర్యాదు చేయాలన్నా వైకాపా నేతల, ముఖ్యంగా ఎమ్మెల్యే అనుమతి కావాలి. వైకాపా వాళ్లు మాఫియాలా దోపిడీలు చేస్తున్నా పట్టించుకోకపోవటం, ప్రత్యర్థి పార్టీలు, విమర్శకులపై ఏదోక సాకుతో కేసులు బనాయించటం మామూలై పోయింది. పెట్టుబడులు పెడతామని వచ్చినవారికి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోగా, అప్పటికే వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి అవకాశాలు, సంపదను పెంచుతున్నవారిని వేధించటం నిత్యకృత్యంగా మారింది. ఆ దెబ్బకు తట్టుకోలేక పలువురు రాష్ట్రం వదిలిపోయారు. చివరికి ఎటువంటి కేసుకు ఆస్కారం లేని ఆరోపణతో ప్రతిపక్ష నేతను అరెస్టు చేసి జైల్లో



పెట్టారు. ఊళ్లలో ద్వేషభావాన్ని రగులుస్తూ ఫ్యాక్షన్ వాతావరణాన్ని కల్పిం చారు. ఎన్నడూలేని రీతిలో ఏపీలో అసలు ఎన్నికలు సక్ర మంగా జరుగుతాయా అనే భయాందోళనల్ని కల్పించారు. పలువురు పోలీసు అధికారులు, ఐఏఎస్‌లూ రాజును మిం చిన రాజభక్తితో వ్యవహరిస్తూ తమ స్థాయిని దిగజార్చుకున్నారు. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా. జయప్రకాష్ నారాయణ్ ఏపీలో ఎన్డీయే కూటమికి అనుకూలంగా ఓటు వేయండని ప్రజలకు విజ్ఞప్తి చేయటానికి చట్టబద్ధపాలన మరీ అధ్వాన్నమవటం కూడా ఒక ప్రధాన కారణం. చట్టబద్ధపాలనను పూర్తిస్థాయిలో బాగు చేయటం వెంటనే సాధ్యంకాకున్నా కనీస స్థాయి ప్రమాణాల్లోకైనా తీసుకురావాలని జేపీ స్పష్టం చేశారు. పలు పౌర సమాజ సంస్థలు కూడా ఈ అంశంపై సమావేశాలు నిర్వహించాయి.

తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఎన్డీయే కూటమి విజయం సాధించాక, తక్షణ కార్యాచరణలో భాగంగా చట్టబద్ధపాలన బాగుచేయాలన్న చర్చ జరుగుతోంది. ఉన్నతాధికారుల నుంచి దిగువ స్థాయి వరకు నిజాయతీపరుల్ని, ఒత్తిడికి తలొగ్గనివారిని, సమర్థులను ఎంపిక చేసుకుని నియమించాలని, వైకాపా తొత్తులుగా వ్యవహరించినవారిని పక్కన పెట్టాలని సూచనలు వస్తున్నాయి. ఇది అవసరం. పోలీసు విభాగంలో నాయకత్వ స్థానాల్లో సమర్థులు, నిజాయతీపరుల్ని నియమించాలనటంలో మరోమాట లేదు. వైకాపా హయాంలో కూడా అధికారులుగా నిజాయతీగా వ్యవహరించినవారు పలువురున్నారు. కానీ వ్యక్తులుగా కన్నా ఇది వ్యవస్థీకృతమైన సమస్య. అప్పటిదాకా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన సిబ్బందిలో పలువురు ఎన్నికల సమయం వచ్చేసరికి ఎన్డీయే కూటమికి మొగ్గు చూపారని మరువకూడదు. ఎంతో నిజాయతీపరులైన అధికారులు కూడా కాలక్రమంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి అనుకూలంగా ఎందుకు మారిపోతున్నారో, చట్టాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను పట్టించుకోకుండా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో, సెటిల్‌మెంట్లలో ఎందుకు భాగమవుతున్నారో మనం స్పష్టంగా గుర్తించాలి.

ఈ నేపథ్యంలో సమర్థులైన అధికారుల ఎంపికలో వైకాపా కోణాన్ని పక్కన పెట్టి వ్యవస్థీకృత కోణంలో ఆలోచించాలి.

1994లో ఎన్నికలకు ముందు తెలుగుదేశానికి నేతృత్వం వహిస్తున్న ఎన్.టి రామారావుకి అవరోధాలు కల్పిస్తూ కొందరు పోలీసు ఉన్నతాధికారులు వేధించారు. ఆ ఎన్నికల్లో ఎన్టీఆర్ భారీ మెజారిటీతో గెలిచాక, వారి మీద కఠిన చర్యలు తీసుకుంటారని, మారుమూల ప్రాంతాలకు విసిరేస్తారని చాలా మంది అనుకున్నారు. కానీ జేపీ సూచన మేరకు ఆయన ఎటువంటి ప్రతీకార ధోరణులు లేకుండా సమర్థులను కీలక పదవుల్లో కొనసాగించారు. వారి ద్వారానే సానుకూల ఫలితాలు సాధించారు. అధికారులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తే సమర్థులను కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్ల కొత్త ప్రభుత్వం వ్యక్తిగత కోణంలో ఆలోచించకుండా వ్యవస్థీకృతంగా, హుందాగా వ్యవహరించాలి.

అయిదేళ్లలో వైకాపా అండతో అరాచకాలకు పాల్పడినవారిపై ప్రతీకారాలకు పాల్పడేందుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయటం కూడా నష్టదాయకం. వైకాపా వారిపై కక్షసాధింపు ధోరణులుండవని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. సంయమనం కోల్పోవద్దని శ్రేణులకూ విజ్ఞప్తి చేశారు. కానీ ఆచరణలో కొన్ని ఒత్తిడులు ఎదురయ్యే అవకాశ ముంది. తన అనుభవాన్ని ఉపయోగించి చంద్రబాబు వాస్తవిక దృష్టితో వ్యవహరించి, వాటిని చల్లార్చాలి. నేరాలకు పాల్పడ్డవారిపై చట్టప్రకారం మాత్రమే చర్యలుంటాయన్న సందేశమివ్వాలి. అధికారులుగా సమర్థులను, నిజాయతీ పరులను ఎంపిక చేయటంతోపాటు, తాము ప్రజా సేవకులం తప్ప అధికార పార్టీకి గులాములం కాదన్న భావం పోలీసుల్లో అంతర్లీనమయ్యేలా కమ్యూనిటీ పోలీసింగ్‌ను ఏర్పాటు చేయాలి. జవాబుదారీతనం పెంచాలి. నేరాలు జరిగాక చర్యలకన్నా నేర నియంత్రణ మీద ఎక్కువ దృష్టి పెట్టాలి. ఇందుకోసం అవ సరమైన శిక్షణను పోలీసులకు అదనంగా ఇప్పించాలి.

పోలీసుల రోజువారీ విధుల్లో, ముఖ్యంగా నేర పరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా చంద్రబాబు ప్రభుత్వం నియంత్రణ పాటించాలి. తమ నియోజకవర్గంలో పోలీసు అధికారుల పోస్టింగులపై ఒకస్థాయి దాటి పైరవీల వల్ల పెద్ద ప్రయోజనం ఉండదు, చట్టబద్ధపాలన కొరవడితే ఓట్లు కూడా పడవు అనే విషయం ఎమ్మెల్యేలకు అర్థమయ్యేలా తెలియచెప్పాలి.

మహిళల భద్రతకు గత వైసీపీ ప్రభుత్వం దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు, గ్రామ సచివాలయాల్లో మహిళా పోలీస్ పేరుతో హడావుడి చేసింది తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు మెరుగుపడలేదు. అసలు దిశ చట్టమే అమల్లోకి రాలేదు. మహిళలపై నేరాలు పెరిగాయి. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం మహిళల అదృశ్యం, నేరాలు, వారిపై వేధింపులు విషయంలో ఏపీ మూడు, నాలుగు స్థానాల్లో ఉంది. సంక్షేమమే పరిపాలన, అభివృద్ధి కోరేవారు వర్గ శత్రువులు అంటూ ప్రజల్ని రెచ్చగొడుతూ పాలన సాగించిన జగన్ నిధుల సమీకరణ కోసం ప్రపంచంలో ఏ రాజ్యాంగబద్ధ దేశంలో లేనిరీతిలో అడ్డదారులు తొక్కారు. ఏకంగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని కూడా తాకట్టుపెట్టారు. అమ్మాయిల భద్రతలో భాగంగా కొత్త ప్రభుత్వం గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయాలి. లోక్‌సత్తా చొరవతో వచ్చిన ఈ చట్టాన్ని అమల్లోకి తేవటం వల్ల వేధింపుల స్థాయిలోనే మహిళలపై నేరాలు అదుపులోకి వస్తాయి. అదే విధంగా మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోవటంపై కూడా ఏపీలో చర్చ జరుగుతోంది. గంజాయి కట్టడికి పెద్దఎత్తున పోలీసు యంత్రాంగాన్ని వినియోగిస్తామని హోంమంత్రి ప్రకటించారు. కానీ రాష్ట్రంలో విచ్చలవిడిగా సరఫరా అవుతున్న మద్యం కంటే గంజాయి తక్కువ ప్రమాదకరం. గంజాయి తాగటం మంచిది కాదు కానీ, గంజాయి కన్నా సారాయి ఇంకా ప్రమాదం. అందువల్ల మాదక ద్రవ్యాలకు సంబంధించి చట్టపరంగా చర్యలపై ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేసి గంజాయిని, ఇతర మాదక ద్రవ్యాలను వేరు చేసి ఆచరణాత్మక విధానాన్ని రూపొందించి జాడ్యాన్ని కట్టడి చేయాలి.

ఈ రకంగా కొన్ని ప్రమాణాలమేరయినా చట్టబద్ధపాలనను నెలకొల్పటానికి, సంస్కరణలతో క్రమంగా మెరుగుపరచటానికి ఏపీ కొత్త ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలి. ❖

## యువతకి ఉపాధి అవకాశాలు అత్యవసరం

ఉత్తరాంధ్రలో, ముఖ్యంగా విజయనగరం జిల్లాలో ఉపాధిలేక యువత ఇతర రాష్ట్రాలకు వలస పోవాల్సిన పరిస్థితి నెలకొందని, రాష్ట్రంలో ఉపాధి పెంచేందుకు చర్యలు వెంటనే చేపట్టాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజ్ఞప్తి చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో జిల్లాలో ఉన్న జ్యూట్, చక్కెర, ఫెర్రో పరిశ్రమలు, చిన్న, సూక్ష్మ పరిశ్రమలు మూతపడి చాలామంది ఉపాధి కోల్పోయారన్నారు. సమస్యను వివరించటంతోపాటు నైపుణ్యాల శిక్షణ సహా పరిష్కారాలను కూడా మంత్రికి తెలియచేశామన్నారు. భీమసింగి చక్కెర కర్మాగారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లాలో రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో కుమరాం మాజీ సర్పంచ్ సబ్బవరపు సత్యనారాయణ, ప్రముఖ జానపద గాయకుడు జానకిరాం, జామి మండల యువజన సంఘాల నాయకులు వర్రి బాబ్జీ, సుంకర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, అనుమతిలేకుండా వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో నిర్మించిన ప్యాలెస్‌లను ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భీశెట్టి డిమాండ్ చేశారు.


# పట్టణీకరణకు ఘనవ్యర్థాల నిర్వహణ సవాల్

- నమ్రత

**అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ఆదిలాబాద్ జిల్లా ముఖరా గ్రామం. పచ్చదనం, పరిశుభ్రతలో ఈ గ్రామానికి జాతీయ అవార్డు కూడా వచ్చింది. చెత్త సేకరణకు ప్రభుత్వం ట్రాక్టర్ ఇచ్చి, డంపింగ్ యార్డ్ నిర్మించింది. దాంతో తడి, పొడి చెత్తను వేరే చేసి, సేంద్రియ ఎరువుని తయారుచేస్తూ ఏటా రూ.3-4 లక్షలు సంపాదిస్తున్నారు. ఈ మొత్తంతో గ్రామ ప్రధాన వీధుల్లో సౌర విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసుకున్నారు. స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తూ, తమ గ్రామ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నారు.**

దేశంలో జనాభా పెరుగుతున్న తరుణంలో ఘనవ్యర్థాల నిర్వహణ ప్రభుత్వాలకు పెనుసవాలుగా మారుతుంది.

భారతదేశంలో ప్రతిరోజు సుమారు 1,48,000 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం అత్యధికంగా ఘనవ్యర్థ పదార్థాలను ఉత్పత్తి చేసేది ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్. గణాంకాల ప్రకారం ప్రతి ఒక్కరూ సగటున రోజుకు 0.5 కిలో చెత్తను పడేస్తున్నారు. మరి ఈ చెత్త అంతా ఏమవుతుంది? ఇంటింటి వ్యర్థాలు సేకరించబడి ఆ ప్రాంతపు చెత్తడబ్బాలో పడుతుంది. స్థానిక పరిపాలనా విభాగంలోని వ్యర్థాల నిర్వహణ విభాగం వీటిని తీసుకుపోయి దూరంగా ఉండే డంపింగ్ యార్డ్‌లో పారేస్తుంది. అలా అన్ని ప్రాంతాల చెత్త అంతా ఆయా ప్రాంతాల డంపింగ్ యార్డులలో జమ అవుతుంది. చెత్తను జమ చేసి వదిలేయరు. వీలయినంత వరకు దాన్ని వేస్ట్ ట్రీట్‌మెంట్ చేస్తారు.




వ్యర్థము అంటే - మన నిత్య జీవితంలో మనం ఉపయోగించేటువంటి లేదా మనకు అవసరము లేనటువంటి, పర్యావరణానికి హానిచేసే పదార్థాన్ని వ్యర్థము/ చెత్త అని పిలుస్తారు. ఈ వ్యర్థము గనక ఘనరూపంలో ఉంటే ఘన వ్యర్థాలు/ సాలిడ్ వేస్ట్ అంటారు. ఘన వ్యర్థాల నిర్వహణ విధానం-2000 ప్రకారం 'సహజంగా కానీ, మానవుని ప్రమేయం వల్ల కానీ పర్యావరణంలోకి విడుదలయ్యే ఘన లేదా పాక్షిక ఘన వ్యర్థమే సాలిడ్ వేస్ట్.

ఘన వ్యర్థాల ఉత్పత్తికి ప్రధాన కారణాలు - మానవుని విలాసవంతమైన జీవన విధానం, మతపరమైన కార్యక్రమాల నిర్వహణ, జనాభా పెరుగుదల, జనసాంద్రత, వరదలు, సునామీ, భూకంపాలు వంటి సహజ విపత్తులు. కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల వరదలు సంభవిస్తాయి.

**ఘన వ్యర్థాలు - రకాలు, వాటి ప్రభావాలు**

ఇంట్లో, మార్కెట్‌లో ఉత్పత్తి చేయబడిన చెత్త, కూరగాయలు, ప్లాస్టిక్, మురుగు వంటి పదార్థాలు మునిసిపల్ ఘనవ్యర్థాల కిందకి వస్తాయి. వ్యవసాయ కార్యకలాపాల ద్వారా ఏర్పడేవి వ్యవసాయ వ్యర్థాలు (గడ్డి, కొమ్మలు, పేడ). ఇవి మిగతా వ్యర్థాలతో పోల్చితే అధిక తేమను కలిగి ఉంటాయి.

పరిశ్రమలలో ఉత్పత్తి అయ్యే భారలోహాలు, ఇనుము, సిమెంట్ వ్యర్థాలు పారిశ్రామిక హానికర వ్యర్థాల కిందకి వస్తాయి. నేలలోకి విడుదలైన భారలోహాలు (అర్సెనిక్, పాదరసం) లీచింగ్ ప్రక్రియకు గురై నీరు కలుషితమవుతుంది. అనగా భారలోహాలు గల మునిసిపల్ మురుగు వ్యర్థాలను (స్లడ్జ్) ఎరువుగా వాడరాదు. కేవలం నైట్రేట్‌లు, ఫాస్ఫేట్లు, అమ్మోనియా ఉన్న వ్యర్థాలను ఎరువుగా వాడవచ్చు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అనగా పాడయిన ఎలక్ట్రానిక్ వస్తువులు, ఈ-వేస్ట్‌లో బెరీలియం, కాడ్మియం, క్రోమియం, మెర్క్యురీ, లెడ్ వంటి మూలకాలు ఉంటాయి. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఈ-వేస్ట్ ఉత్పత్తిదారు భారత్. భారతదేశంలో సంవత్సరానికి సుమారు 4 మిలియన్ మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాల ఉత్పత్తి జరుగుతుంది. సెల్‌ఫోన్లు రీత్యా భారత్ రెండవ స్థానంలో ఉంది. లెడ్ వల్ల మానవుని యొక్క నాడీవ్యవస్థపై ప్రభావం, రక్తప్రసరణ వ్యవస్థ మరియు కిడ్నీపై ప్రభావం, మెదడు పెరుగుదలలో ఆటంకం కలుగుతాయి. బెరీలియం వల్ల ప్రభావాలు - ఊపిరితిత్తుల క్యాన్సర్, చర్మవ్యాధులు, తొందరగా గాయాలు నయంకాకపోవటం, బొబ్బలు రావటం. క్రోమియం అయితే డీఎన్ఏని నాశనం చేస్తుంది. మెర్క్యురీ మెదడు మరియు కిడ్నీలపై ప్రభావం, గర్భస్థ పిండ పెరుగుదలపై ప్రభావం చూపిస్తుంది.

హాస్పిటల్ వ్యర్థాలు అయిన బ్యాండేజి, బ్లేడ్లు, సిరంజులు, రక్తవ్యర్థాలు బయో మెడికల్ వ్యర్థాల కిందకి వస్తాయి. అన్ని రకాల వ్యర్థాలలో ఈ బయోమెడికల్ వ్యర్థాలు హానికరమైనవి. వీటి వల్ల వివిధ సూక్ష్మజీవులు చుట్టూ వ్యాప్తి చెంది వ్యాధులను కలిగిస్తాయి.

నగరాలు ఘనపదార్థాల సేకరణ, రవాణాకు మాత్రమే




పరిమితమయ్యాయి. ప్రాసెసింగ్, సురక్షితంగా పారవేతకు కొన్ని సందర్భాల్లో మాత్రమే ప్రయత్నిస్తున్నారు. ఉత్పత్తయిన మొత్తం వ్యర్థాలలో 20% మాత్రమే ప్రస్తుతం శుద్ధి చేయబడుతోంది. మిగతా 80% చెత్త డంపింగ్ గ్రౌండ్‌లోనే ఉంటుంది. భారతదేశంలోని అతిపెద్ద డంపింగ్ యార్డ్ ముంబైలోని దేవనర్ డంపింగ్ యార్డ్. ఇది సుమారు 330 ఎకరాలలో ఉంది. ఈ వ్యర్థాల గుట్టలు కొన్నిచోట్ల 120 అంతస్తుల భవనం అంత ఎత్తు ఉంటాయి. ఇలాంటి స్థితి ఢిల్లీలో కూడా కొనసాగుతోంది.

**ఘన వ్యర్థ పదార్థాలు – నిర్వహణ పద్ధతులు**

ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఒక ప్రాంత సమస్య కాదు. ప్రస్తుతం ఇది జాతీయ, అంతర్జాతీయ సమస్యగా పరిణమించింది. వేస్ట్ ట్రీట్మెంట్ అనగా ఏంటో తెలుసుకుందాం. ప్రస్తుతం దీని నిర్వహణలో ఈ కింది పద్ధతులు కనిపిస్తున్నాయి.

**లాండ్ ఫిల్లింగ్:** పట్టణానికి దూరంగా భూమిలో గోతులు తవ్వి ఘనవ్యర్థాలను నింపే పద్ధతి. ఇది సులభమైన పద్ధతి. కానీ ప్రస్తుతం భూకొరత ప్రధాన సమస్యగా ఉంది. అంతేకాకుండా ఈ విధంగా పూడ్చిన ఘనవ్యర్థాలు లీచింగ్ వల్ల భూగర్భ జలవనరులు కలుషితం చేస్తాయి. గ్లోబల్ వార్మింగ్‌కు కారణమయ్యే రెండవ ప్రధాన వాయువైన మీథేన్ మన దేశంలో 20 శాతం ల్యాండ్ ఫిల్లింగ్ నుంచే ఉద్గారించబడుతుంది.

**భస్మీకరణం:** ఇందులో అధిక ఉష్ణోగ్రత వద్ద వివిధ ఘన వ్యర్థాలను ముఖ్యంగా బయోమెడికల్ ఘన వ్యర్థాలను ఆక్సిజన్ సమక్షంలో మండించడమే భస్మీకరణం. కానీ దీనిలో ప్లాస్టిక్, ఇతర భారలోహ పదార్థాలను భస్మం చేస్తే వాయుకాలుష్యం కలుగుతుంది.

**పునఃచక్రీయం/ రీసైక్లింగ్:** అప్పటికే వాడి పారవేసే పదార్థాలను ఇతర పదార్థాల తయారీకి వాడినట్లయితే ఆ

## ఘన వ్యర్థాల నివారణ చర్యలు

**తగ్గించటం, పునరుపయోగం, పునఃచక్రీయం చేపట్టాలి; పరిశ్రమల నుండి విడుదలయ్యే వ్యర్థాలను సాధ్యమైనంతమేర విషరహితాలుగా మార్చాలి; వ్యవసాయంలో కృత్రిమ ఎరువులు, క్రిమి సంహారకాల స్థానంలో జీవ ఎరువులు, జీవ క్రిమి సంహారకాలను వినియోగించాలి, అనగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి; గృహ, వాణిజ్య, వ్యవసాయ వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చి విద్యుత్‌ను, ఇంధనాలను ఉత్పత్తి చేయాలిబయోరెమీడియేషన్ చేపట్టి వ్యర్థాలలోని హానికర పదార్థాలను విచ్ఛిన్నం చేసి హానిరహితంగా మార్చాలి; 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ సంచులను నిషేధించాలి; ఇతర దేశాల దుస్తులు, వస్తువులకు మన దేశాన్ని 'డంపింగ్ ప్రదేశం'గా వినియోగించరాదు; ఘనవ్యర్థాలపై గల చట్టాలను సమర్థవంతంగా అమలుచేయటం; ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం;'వెల్త్ ఫ్రమ్ వేస్ట్', 'ట్రాష్ ఈజ్ క్యాష్' వంటి భావనలు ప్రజలలో చేరే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టటం; పరిశ్రమలు నెలకొల్పే ముందు 'ఎన్విరాన్ మెంట్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్' తర్వాతే పర్మిషన్ ఇవ్వటం**

## చెత్తవేసేవారికి, ప్రజలకి ఈ క్రిందివాటిపై అవగాహన కల్పించాలి

- ఉమ్మి వేయకుండా ఉండటం
- చెత్తను వీలైనంత తక్కువ వేయటం
- వ్యర్థాల్ని వీలైనంత వరకూ తిరిగి వినియోగించటం
- కూరగాయలు, ఇతర వస్తువులు విక్రయించేటప్పుడు మన సంచులని ఉపయోగించటం
- హెూమ్ కంపోస్టింగ్, వర్మికంపోస్టింగ్, బయోగ్యాస్ ఉత్పాదన, లేదా కమ్యూనిటీ స్థాయి కంపోస్టింగ్ చేయటం;
- శానిటరీ వ్యర్థాల్ని వాటి బ్రాండెడ్ ఉత్పత్తిదారులు ఇచ్చే కవర్లలోనే జాగ్రత్తగా చుట్టి లేదా స్థానిక సంస్థలు సూచించిన విధంగా చుట్టి దాన్ని బయోడీగ్రేడబుల్‌కాని వ్యర్థాలు వేసే డబ్బాల్లోనే వేయాలి
- వేరు చేసిన వ్యర్థాల్ని చెత్త ఏరుకునేవారికి, చెత్త సేకరించేవారికి, రీసైకిల్ చేసేవారికి లేదా చెత్త సేకరించే ఏజెన్సీకి అందచేయాలి
- చెత్త ఏరేవారికి, సేకరించేవారికి, స్థానిక సంస్థలకు లేదా భారీ వ్యర్థాల యాజమాన్యం చేపడుతున్న స్థానిక సంస్థలు గుర్తించిన వ్యక్తికి భారీ వ్యర్థాల యాజమాన్యం ప్రతి నెలా యూజర్ ఫీజు చెల్లించాలి

ప్రక్రియనే పునఃచక్రీయం అంటారు. దీనికి మూలమైన భావన 'ట్రాష్ ఈజ్ క్యాష్' ఇది ఘనవ్యర్థాల నిర్వహణలో అత్యంత ముఖ్య పద్ధతి. ఈ పద్ధతి ద్వారా విద్యుత్తును కూడా ఉత్పత్తి చేయవచ్చు. ఉదాహరణకు అల్యుమినియం క్యాన్స్‌ను పునఃచక్రీయం చేసి కొత్త డబ్బాలు తయారుచేయవచ్చు. కనుక చెత్తను డంప్ చేయకుండా ప్రత్యామ్నాయంగా విద్యుత్, ఇతర ఇంధన తయారీకి వినియోగించవచ్చు.

కంపోస్టింగ్ మరియు బయో గ్యాస్ తయారీ – వివిధ రకాల జీవ విచ్ఛిన్నం చెందే వ్యర్థాలను (కంపోస్ట్ ఎరువు, వ్యవసాయ వ్యర్థాలు, జంతువుల పేడ) వాడి సేంద్రియ ఎరువును తయారుచేసే ప్రక్రియనే కంపోస్టింగ్ అంటారు. దీనివల్ల ఎటువంటి కాలుష్యం ఉత్పత్తి కాదు. ఈ పదార్థాలను ఉపయోగించి బయోగ్యాస్ ప్లాంట్ (బయో గ్యాస్ డైజెస్టర్) ద్వారా బయో గ్యాస్‌ని కూడా ఉత్పత్తి చేయవచ్చు.

వానపాము వివిధ కార్బన్ పదార్థాలను విచ్ఛిన్నపరిచే జీవి. ఇది యూరియాను విసర్జించి రైతుకి మేలు చేయటం వల్ల రైతు నేస్తం అంటారు. వీటి ద్వారా తయారయ్యే ఎరువుని వర్మి కంపోస్ట్ అంటారు. అలానే సూక్ష్మజీవులు కూడా కార్బన్ పదార్థాలను విచ్ఛిన్నం చేస్తాయి. కూరగాయలు 5 రోజుల నుండి నెలరోజుల వరకు విచ్ఛిన్నం అవుతాయి. పేపర్ 2-5 నెలలు, ప్లాస్టిక్ 500 సంవత్సరాల దాకా, ఇంకా ఎక్కువ కాలం కూడా విచ్ఛిన్న సమయం పడుతుంది.

**సమస్త జీవజాలానికి సమస్యలు సృష్టిస్తున్న ఈ ఘనవ్యర్థాలు ఇందుకోసం వాటి మూలాలు, రకాలను తెలుసుకోవాలి. వాటి నిర్వహణ, దుష్ప్రభావాలను తగ్గించగలిగే శాస్త్రీయ విధానాల గురించి అవగాహన పెంచుకోవాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, ఆధునిక జీవనశైలి అలవరచుకుంటున్నారు. దాంతో వస్తు వినియోగం అధికమైంది. 'ఉపయోగించు–పారవేయు' పద్ధతిలోనే వస్తువులను తయారుచేస్తుండటంతో వాటి ఉత్పత్తి పెరుగుతోంది.**

పర్యావరణ వ్యవస్థకు, మనిషి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారిన వాటిలో ఘనవ్యర్థ కాలుష్యం ఒకటి. అభివృద్ధి పోకడలు, వస్తు వినియోగం, ఆహార వృధాతో వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. గాలి, నీరు, నేలను కలుషితం చేస్తున్నాయి. పరిసరాలు దెబ్బతినటానికి, అంటువ్యాధులు ప్రబలటానికి ఈ పరిణామమే ప్రధాన కారణం. ప్లాస్టిక్, విద్యుత్తు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల వంటివి మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థలకు సవాలు విసురుతున్నాయి. సమస్త జీవజాలానికి సమస్యలు సృష్టిస్తున్న ఈ ఘనవ్యర్థాలు ఇందుకోసం వాటి మూలాలు, రకాలను తెలుసుకోవాలి. వాటి నిర్వహణ, దుష్ప్రభావాలను తగ్గించగలిగే శాస్త్రీయ విధానాల గురించి అవగాహన పెంచుకోవాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, ఆధునిక జీవనశైలి అలవరచుకుంటున్నారు. దాంతో వస్తు వినియోగం అధికమైంది. 'ఉపయోగించు–పారవేయు' పద్ధతి లోనే వస్తువులను తయారు చేస్తుండటంతో వాటి ఉత్పత్తి పెరుగుతోంది. అభివృద్ధికి కీలకమైన పట్టణీకరణ వేగంగా పెరుగుతున్నకొద్దీ, ఘనవ్యర్థాల సమస్య అంతకంతకూ ఎక్కువవుతోంది. మనం చిత్తశుద్ధిని ప్రదర్శిస్తే, పట్టణ జీవన నాణ్యతను దెబ్బతీస్తున్న ఈ సమస్యను తగ్గించుకోవటంతోపాటు చెత్త నుండి సంపదను కూడా సృష్టించుకుని పర్యావరణహిత అభివృద్ధిని సాధించవచ్చు. ❖

# కొత్త నేర న్యాయ చట్టాలు, జారవిడుచుకున్న అరుదైన అవకాశం

**సుమేధా కూరపర్తి**

కొత్త నేర న్యాయ చట్టాలు ఆమోదం పొందినప్పుడు పార్లమెంటులో అర్థవంతమైన చర్చ జరగలేదు. కానీ ఇప్పుడు జులై నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ చట్టాలపై పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చలు జరుగుతున్నాయి. కొత్త చట్టాల వల్ల ఏ విధానాలు మారబోతున్నాయి, ఏవి ముందులాగే కొనసాగబోతున్నాయి, పౌరుల జీవితాల్లో ఎలాంటి మార్పులు ఉండవచ్చు అంశాలపై వివిధ అభిప్రాయాలు వెలుబవడుతున్నాయి.

మన దేశంలో పలుకుబడి, డబ్బు బలం న్యాయాన్ని నిర్ణయించే పరిస్థితి ఏర్పడిందన్నది వాస్తవం. సమస్య ఎక్కడ ఉన్నది, వాటికి మూల కారణాలు ఏమిటి అని తెలియకపోయినా, మార్పు కావాలని, పరిస్థితులు మెరుగుపడాలని అందరూ అంగీకరిస్తారు. మానవజాతిలో ఆరవ వంతైన 140 కోట్ల ప్రజల వ్యవహారాలను సమర్థవంతంగా నియంత్రించేలా, పరిధి దాటి వ్యవహరించినప్పుడు సక్రమంగా, వేగంగా న్యాయం అందించేలా నేర న్యాయ వ్యవస్థను సంస్కరించుకోవటం అంతిమలక్ష్యం. చట్టబద్ధపాలనలో విఫలమైతే ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోతుంది. కానీ స్వతంత్ర భారతదేశంలో రూపొందించిన కొత్త నేర చట్టాల కారణంగా ఎటువంటి మౌలికమైన మార్పులు జరగవని ఇప్పటికే స్పష్టత వచ్చేసింది.




ఇంతకు ముందున్న వలస కాలంనాటి చట్టాలకు కొన్ని చేర్పులు, తొలగింపులు, సవరణలు చేసి వాటికి కొత్త, భారతీయ పేర్లు పెట్టడం జరిగింది. అనేకమంది నిపుణులు కొత్త చట్టాలు గందరగోళం సృష్టించబోతున్నాయని అభిప్రాయపడ్డారేగానీ, నేర న్యాయ వ్యవస్థ ఎంతో మెరుగుపడుతుందనలేదు.

ఎందుకని? వ్యవస్థ మెరుగుపడాలి అంటే ఎటువంటి సంస్కరణలు తీసుకురావలసింది?

**చట్టబద్ధపాలన, నేర న్యాయ వ్యవస్థ**

చట్టబద్ధపాలన అంటే ఏమిటి? సమాజంలో మన ప్రవర్తనకు కొన్ని పరిమితులు ఉంటాయి, ఆ పరిమితులను అమలు చేసే నియమాల్ని కులం, మతం, లింగం లేదా ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అందరికీ సమానంగా, విధిగా వర్తింప చేయటం. చట్టబద్ధపాలనకు మూడు కోణాలు ఉంటాయి – నేర చట్టాలను ఏకరీతిగా అమలు చేసి శాంతిభద్రతలను కాపాడటం, సివిల్ వివాదాలను వేగంగా, న్యాయంగా పరిష్కరించడం, ఇంకా రాజ్యాంగ స్వేచ్ఛలను నియంత్రించటంలో న్యాయబద్ధమైన ప్రక్రియను పాటించటం.

వికృత ప్రవర్తనను సమర్థవంతంగా శిక్షించే నేర న్యాయ వ్యవస్థ ఏ సమాజానికైనా కీలకం. నేర న్యాయ వ్యవస్థల పాత్రధారులు ఎవరు? ప్రధానంగా నాలుగు వ్యవస్థలు ఉంటాయి – పోలీసు, ప్రాసిక్యూషన్, విధానాలు (ప్రొసీజర్), న్యాయ వ్యవస్థ (జ్యుడీషియరీ). ప్రొసీజరల్ లా (విధాన ప్రక్రియ చట్టం) చాలా వరకు ఇతర మూడు వ్యవస్థల పనితీరుని నిర్దేశిస్తుంది. నేర విచారణ ప్రక్రియను సవరించాలన్న డిమాండ్ కొత్తది కాదు. నేర న్యాయ వ్యవస్థలు, చాలా పురాతనమైనవని, వాటిని ఆధునికపరచాలని ఎంతోకాలంగా చర్చ జరుగుతోంది. దేశంలో న్యాయ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందనటానికి ట్రయల్ కోర్టులలో కొట్టుమిట్టాడుతున్న 3.4 కోట్ల క్రిమినల్ కేసులే పెద్ద సాక్ష్యం. అంతేకాకుండా, ఈ వ్యవస్థలో నేర నిర్ధారణ 40% కంటే తక్కువ. ప్రధాన దేశాలతో పోల్చుకుంటే అతి తక్కువ. అంటే, దేశంలోని నేర న్యాయ యంత్రాంగం అసమర్థత కారణంగా 34 కోట్ల కేసుల్లో 2 కోట్ల కంటే ఎక్కువ కేసుల్లో నిందితులకు శిక్ష పడదు. పోలీసు దర్యాప్తులో లోపాలు ఉండటం, లేదా ప్రాసిక్యూషన్ కేసు బలంగా లేకపోవటం, లేదా కోర్టు విచారణలో ఆ లోపాలను అధిగమించి నిజాన్ని నిర్ధారించడానికి విధానాలు అనుమతించకపోవడం ఈ పరిస్థితికి కొన్ని కారణాలు.

**కొత్త చట్టాలు యధాతథస్థితిని ఎందుకు మార్చలేవు?**

ప్రాసిక్యూషన్ విషయంలో కొత్త వ్యవస్థకి అనుకూలంగా మార్పులు చేయటం తప్ప, ఈ కొత్త చట్టాలు నేర న్యాయ వ్యవస్థను ఏ రకంగానూ మౌలికంగా మార్చలేదు. పూర్వపు చట్టాలతో పోల్చుకుంటే మార్పులు చాలా తక్కువగా ఉన్నప్పటికీ, కొన్ని గమనించదగ్గవి ఉన్నాయి. బాధితుల హక్కులకు కొంతమేర గుర్తింపు, కొన్ని నేరాలకు సులభ విచారణ (సమ్మరీ ట్రయల్) తప్పనిసరి చేయటం, అటువంటి విచారణల అధికార పరిధి పెంచటం, పరారైన నిందితుడు లేకుండా విచారణ జరపటం, చిన్న నేరాలకు సమాజ సేవను శిక్షగా ప్రవేశపెట్టటం, 7 సంవత్సరాల కంటే ఎక్కువ జైలు శిక్ష విధించబడే నేరాలకు ఫోరెన్సిక్ విశ్లేషణ తప్పనిసరి చేయటం. ఇటువంటి మార్పులు మంచివేగానీ నేర న్యాయ వ్యవస్థలోని సంక్షోభంతో పోలిస్తే, పనితీరును మెరుగుపరచటానికి ఏ మాత్రం సరిపోవు. నిజమైన మార్పు సాధించాలి అంటే మరింత లోతైన ఆలోచనతో రూపొందించిన మౌలికమైన సంస్కరణలు అవసరం.

ఉదాహరణకు, అవసరమైన వనరులను అందించకుండా, ఇతర మౌలికమైన విధానాలను సరిదిద్దకుండా, కేసు కాలవ్యవధిలో వివిధ ప్రక్రియలకు సమయ పరిమితి విధించడంతో ఎటువంటి ఫలితాలు రావని అనుభవం మనకు నేర్పుతుంది. ఆ పరిమితులు తప్పనిసరిగా ఉల్లంఘనకు గురవుతాయి. విపరీత జాప్యం ఒక సవాలు అయితే, అత్యధిక కేసుల్లో నిందితులను శిక్షించడంలో మన నేర న్యాయవ్యవస్థ విఫలమవ్వటం సమస్య విస్తృతమైనదనటానికి సూచిక. నేర న్యాయ వ్యవస్థను పీడిస్తున్న అన్ని సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన మార్పులపై లోతైన అధ్యయనం చేసి, మాలిమత్ కమిటీ 2003లో ఎన్నో సిఫార్సులు చేసింది. రెండు దశాబ్దాల కిందటి సిఫార్సులన్నీ నేటికీ వర్తించే పరిస్థితి బాధాకరం. కొన్ని సూచనలు కొత్త చట్టాలలో చేర్చినప్పటికీ, కీలకమైన కొన్ని సిఫార్సులను పక్కనపెట్టేశారు. అయితే, కొత్త చట్టాలలో చేర్చబడిన ఒక ముఖ్యమైన మార్పు ప్రాసిక్యూషన్‌కు సంబంధించినది. మాలిమత్ కమిటీతో సహా గతంలో అనేక కమిటీలు ఒక జిల్లాలో అన్ని ప్రాసిక్యూషన్‌లను పర్యవేక్షించడానికి భారతదేశంలో డిస్ట్రిక్ట్ అటార్నీ లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేశాయి. ఇప్పుడు భారతీయ నాగరిక సురక్ష సంహిత అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసే అధికారం రాష్ట్రాలకు ఇచ్చింది. ఇంకా, న్యాయమూర్తులను జిల్లాల్లో ప్రాసిక్యూషన్ అధిపతులుగా నియమించటానికి అవకాశాన్నిస్తుంది. దీనివల్ల ఎంపికలో యోగ్యతతోపాటు, ప్రాసిక్యూషన్ స్థాయి పెరుగుతుంది.

**సమస్య ఎక్కడుంది? ఎలా పరిష్కరించుకోవాలి?**

మన నేర న్యాయ వ్యవస్థని అడ్వెర్సరియల్ వ్యవస్థ అంటారు. అంటే, ఒక కేసులో రెండు పక్షాలు, ఒకరికొకరు విరుద్ధంగా చేసే వాదనలు, సమర్పించే ఆధారాలను పరిశీలించి న్యాయమూర్తి ఒక నిర్ధారణకు రావాలి. విచారణ నిర్వహణలో, ప్రక్రియను నడిపించటంలో న్యాయమూర్తి పాత్ర అంతంత మాత్రమే. అందువల్ల, నిజాన్ని నిర్ధారించటం కంటే రుజువుకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మన దేశంలో దర్యాప్తు విధానాలు, ప్రాసిక్యూషనల్ ఉన్న ఎన్నో లోపాల కారణంగా, వాటిని అధిగమించటానికి న్యాయమూర్తి ప్రయత్నం చేయలేని పరిస్థితుల్లో నేర నిర్ధారణ రేటు తక్కువగా ఉండి, నిందితులు శిక్ష పడకుండా నిర్దోషుల్లా విడుదలవుతున్నారు. కొన్ని దేశాల్లోలా విచారణలో న్యాయమూర్తులు ప్రశ్నలు అడిగే ఇంక్విసిటోరియల్ వ్యవస్థ నుండి కొన్ని అంశాలు తీసుకోవాలి. కోర్టు విచారణ లక్ష్యం నిజాన్ని నిర్ధారించటం అని, ఆ లక్ష్యాన్ని చేరుకోవటంలో అవసరమైతే న్యాయమూర్తి క్రియాశీలక పాత్ర పోషిస్తారని నేర విచారణ ప్రక్రియలో నిర్దేశించాలి. రెండు వ్యవస్థలకూ బలాలు, బలహీనతలు ఉన్నాయి. కాబట్టి చాలా దేశాలు రెంటి నుంచి ఉపయోగపడే అంశాలను అమలు చేస్తున్నాయని మాలిమత్ కమిటీ పేర్కొంది. నేర విచాణ ప్రక్రియ చట్టంలో వీటిని చేర్చటం ద్వారా మాత్రమే ఇటువంటి ప్రాథమిక మార్పు సాధ్యం.

దర్యాప్తు యంత్రాంగం సాధికారతను పెంచి, సమర్థవంతంగా చేయగలిగే మరో మార్పు – విచారణ సమయంలో ఒక పోలీసు అధికారి వద్ద చేసే స్టేట్‌మెంట్ లేదా నేరాంగీకారం కోర్టులో ఆధారంలా అనుమతించటం. ఒక పోలీసు అధికారికి ఇచ్చిన వాంగ్మూలాలకు సాక్ష్యం విలువ ఇవ్వకపోవటం దర్యాప్తు అధికారులను, ప్రాసిక్యూషన్‌ను తీవ్రంగా దెబ్బతీస్తుది. ఇతర ప్రజాస్వామ్య దేశాల్లోలా, పోలీసుల అధికార దుర్వినియోగాన్ని నివారించటానికి సరైన రక్షణలను రూపొందించవచ్చు, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయవచ్చు.

పెర్జురి, అంటే కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పటం సర్వసాధారణమైపోయింది. అందువల్ల విచారణ ప్రక్రియ అర్థరహితమైపోయింది. పెర్జురిపై విచారణ ప్రక్రియ క్లిష్టమైనది. అందువల్ల చాలా అరుదుగా ఉపయోగిస్తారు. దానర్థం, అబద్ధం చెబితే శిక్ష పడుతుందన్న భయం లేదు. ఒక సాక్షి ఉద్దేశపూర్వకంగా తప్పుడు సాక్ష్యాలను ఇచ్చాడని అనిపించినప్పుడు, చర్యలు తీసుకోవాలా, వద్దా అని అనుమతి కోసం పైకోర్టుకి పంపాల్సిన అవసరం లేకుండా, ప్రతి న్యాయస్థానం కేసును సమ్మరీ ట్రయల్ ప్రక్రియతో నిర్ధారించి శిక్ష విధించే అధికారం కలిగి ఉండాలి.

మాలిమత్ కమిటీ చేసిన అనేక సిఫార్సులలో ఇవి కొన్ని కీలకమైనవి. మెరుగైన విధాన చట్టం మాత్రమే నేర న్యాయ వ్యవస్థను మరింత సమర్థవంతం గావించలేదు. ఇతర సంస్థల పనితీరులోనూ మౌలికమైన మార్పు జరగాలి. అంటే, విధానపరమైన మార్పులు మొదలవ్వాలి. ఉదాహరణకు, పోలీసు శాఖలో కొన్ని నిర్మాణాత్మక మార్పులు అవసరం. శాంతి భద్రతల విభాగాన్ని నేర పరిశోధన శాఖ నుండి వేరు చేయటం ఎంతో ముఖ్యం. ఇప్పుడు ప్రాసిక్యూషన్‌తో ప్రయత్నించిన విధంగా, విధాన చట్టంలో అటువంటి మార్పులు తీసుకురావచ్చు.

ఇటువంటి సంస్కరణలతోపాటు, చట్టబద్ధపాలన వ్యవస్థలపై వ్యయం గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉంది. పోలీసులు, న్యాయమూర్తులు, ప్రాసిక్యూటర్ల సంఖ్య పెంచాలి, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి. మన దేశంలో ప్రతి 10 లక్షల జనాభాకు 1560 మంది పోలీసులు, 14 మంది న్యాయమూర్తులు, 7 గురు ప్రాసిక్యూటర్లు ఉన్నారు. అదే జనాభాకు అమెరికాలో 2380 మంది పోలీసులు, 99 మంది న్యాయమూర్తులు, 176 మంది ప్రాసిక్యూటర్లు ఉన్నారు. మన వ్యవస్థల పనితీరులో ఎన్నో లోపాలు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. అది మెరుగుపరచుకోవాలి అంటే, చాలా కృషి, రాజకీయ ఏకాభిప్రాయ నిర్మాణం అవసరం.

ఇలాంటి సంస్కరణలను తీసుకురావటం ఎంతో కష్టం. అలాంటి అరుదైన అవకాశాన్ని ఇప్పుడు ప్రభుత్వం పైపై ప్రయత్నంతో వృధా చేసింది. కష్టతరమైన చట్టాలను రూపొందించటానికి ప్రభుత్వ సంకల్పం, చట్టసభలో బలం కలిసివచ్చినప్పుడు ఆ అవకాశాన్ని బాధ్యతతో ఉపయోగించుకోవాలి. సరైనరీతిలో రూపొందించి ఉంటే ఈ సంస్కరణలు దేశ నేర న్యాయ వ్యవస్థలో కొత్త అధ్యాయానికి తెర తీసి అనేక రెట్లు ఎక్కువ ఫలితాల్ని సాధించేవి. ❖

# పథకాల పేరు మారితే చాలదు, తీరు మారాలి

- అర్జున్

**రోజువారీ రాజకీయాలు కొనసాగుతుంటాయి, పాత ప్రభుత్వాలు పోతాయి, కొత్త ప్రభుత్వాలు వస్తుంటాయి, కొత్త పార్టీలు ఏర్పడతాయి, కనమరుగవుతాయి, కానీ దేశం నిరంతరం కొనసాగాలి, సుభిక్షంగా ఉండాలి**

**– అటల్ బిహారీ వాజపేయి, 1996**

ఆర్థికంగా భారతదేశం ఎదుగుతున్నప్పటికీ, అందరి జీవన ప్రమాణాల్లో ఆ స్థాయి మార్పు కనిపించటం లేదు. ఉద్యోగావకాశాల కొరత, ఉన్న ఉద్యోగులలో అధికశాతం అసంఘటితరంగంలో ఉండటం, నాణ్యతలేని విద్య, వైద్యం, జీడీపీలో వ్యవసాయ రంగం వాటా తక్కువ ఉన్నప్పటికీ జనాభాలో అధికశాతం ఇప్పటికీ ఉపాధి కోసం ఈ రంగంమీదే ఆధారపడటం వంటి వాటి వల్ల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో, తాత్కాలిక సాయంగా సంక్షేమ పథకాలు అవసరం.

కానీ సంక్షేమ పథకాల వల్ల జీవన ప్రమాణాలు దీర్ఘకాలంలోనైనా పెరుగుతాయా? ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో, ఇరు ప్రధాన రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో విస్తృతమైన సంక్షేమ పథకాలను వాగ్దానం చేశాయి. ఆ హామీలను యధాతథంగా అమలుపరిస్తే సమాజానికి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకి, చివరికి రాజకీయ పార్టీలకు కూడా నష్టం జరిగే అవకాశాలు ఎక్కువ.




**ఆర్థిక స్థిరత్వానికి ముప్పు: శృతిమించిన సంక్షేమ పథకాల వల్ల అలవిమాలినరీతిలో రాష్ట్ర ఖర్చుల పెరుగుదల**

2015-16లో రాష్ట్ర ఆదాయంలో తప్పనిసరి ఖర్చుల (కమిటెడ్ ఎక్స్‌పెండిచర్) శాతం, అంటే ప్రభుత్వోద్యోగుల జీతాలు, పెన్షన్లు, బకాయిల పైన చెల్లించాల్సిన వడ్డీలు 54% ఉండగా, 2023-24 వచ్చేసరికి అది 64.6% కి పెరిగింది. దీనర్థం, రాష్ట్రానికి వచ్చే ప్రతి రూ.100 ఆదాయంలో రూ.64 తప్పనసరి ఖర్చులకే అవుతోంది. కేవలం రూ.35 మాత్రమే ఇతర పరిపాలన, సంక్షేమ, అభివృద్ధి ఖర్చుల కోసం మిగులుతాయి. 2015-16లో, ఈ అదనపు బాధ్యతలు తీర్చటానికి రూ.7,301 కోట్ల అప్పు చేయవలసి వచ్చింది (రెవెన్యూ లోటు). 2022-23 నాటికి ఆ అప్పు చేసే మొత్తం రూ.43,487 కోట్లకు పెరిగింది. పాత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మరింత విస్తరించటం లేదా కొత్త వాటిని ప్రవేశపెట్టటం రెవెన్యూ లోటును మరింత పెంచటమే కాకుండా వడ్డీ చెల్లింపు ఖర్చులను కూడా పెంచుతోంది. ఎందుకంటే ఈ లోటును అప్పుల ద్వారా భర్తీ చేయాల్సి వస్తోంది.

ఉదాహరణకు, "తల్లికి వందనం" అనే కొత్త పథకం కింద, పిల్లలను బడికి పంపే తల్లులకు సంవత్సరానికి రూ.15,000 అందచేస్తారు. దీనికోసం అంచనా వేసిన వార్షిక వ్యయం రూ.11,870 కోట్లు. అంటే, రెవెన్యూ లోటులో 27%.

**సంక్షేమ పథకాలు – సామాజిక ప్రయోజనాలు**

దీర్ఘకాలిక జీవన ప్రమాణాలు పెంచలేని సంక్షేమ పథకాల వల్ల ప్రజల పన్నుల డబ్బు ఖర్చవ్వడమే కానీ సమాజానికి ఎటువంటి లాభం చేకూరదు. ఉదాహరణకు, గతంలో అమ్మఒడి, ఇప్పుడు తల్లికి వందనం పథకం, పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) పెంచటం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాథమిక స్థాయిలో 101.66%, ప్రాథమికోన్నత స్థాయిలో 97.62%, సెకండరీ స్థాయిలో 85.38% విద్యార్థుల నమోదు గణాంకాలు నమోదయ్యాయి. అసర్, జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వే నివేదికల ప్రకారం ప్రస్తుత విద్యావ్యవస్థలో పిల్లలు కూడికలు, తీసివేతలు చేయటం, అక్షరాలు గుర్తించటం లేదా చదవటం, నేర్చుకున్నది రోజువారీ జీవితంలో ఉపయోగించటం చేయలేకపోతున్నారు. ప్రస్తుతం అమలు చేయబోయే సంక్షేమ పథకం తీరుచూస్తే, ఎప్పుడో గతంలోని ఓ సమస్య ఇంకా కొనసాగుతుందన్నట్లు డబ్బు ఖర్చు చేయటం తప్ప, అసలైన సమస్యను గుర్తించి దానికి అనుగుణమైన పరిష్కారాన్ని అందించటం లేదు.

**సమగ్ర అభివృద్ధి కొరవడి: సంక్షేమ పథకాలు, తాత్కాలిక విజయాలు**

విద్య, వైద్యం, ఆర్థిక అవకాశాలను విస్తరించటానికి తగినంత ప్రాధాన్యత లేకుండా, కేవలం తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాలపై ఖర్చు వల్ల పాలనలో రాజకీయ పార్టీలు తాత్కాలికంగా విజయాలు సాధించినా దీర్ఘకాలంలో ప్రతికూల ఫలితాలొస్తాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో, గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధిని పణంగా పెట్టి సంక్షేమంపై ఎక్కువ దృష్టి సారించినా, ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది.

ప్రభుత్వాలు అభివృద్ధిపైన దృష్టి సారించినా, ఆ అభివృద్ధి ఫలితాలు అందరికీ చేరకపోతే, దీర్ఘకాలంలో పార్టీలకు నష్టం చేకూరుతుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ, అభివృద్ధి ప్రయత్నాలు కేంద్రీకృతమై ఉన్న హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో అన్ని సీట్లను గెలుచుకున్నప్పటికీ మిగిలిన తెలంగాణలో ఓటమిని చవిచూసింది. అభివృద్ధి పైన దృష్టి మరల్చటం కూడా సరిపోదని ఆ ఓటమి రుజువు చేస్తుంది. దీర్ఘకాలిక సామాజిక, రాజకీయ ప్రయోజనం చేకూరాలంటే పార్టీలు సమ్మిళిత అభివృద్ధి (ఇంక్లూజివ్ గ్రోత్)పై దృష్టి సారించాలి. ❖

# కొత్త భావాలతో అసంపూర్ణ ఎజెండా

- సునీతా నారాయణ్,
'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు

కొత్త ప్రభుత్వానికి సూచిస్తున్న ఎజెండా పాత ఎజెండానే, అయితే ఒక ప్రాథమిక తేడాతో. వాస్తవమేమిటంటే కార్యాచరణకు ప్రాధాన్యత నివ్వాల్సిన అంశాల జాబితా మునుపటిదే. అందులో మార్పులు ఏమీ లేవు. ఉండబోవు. ఇంధనం నుంచి నీటి సరఫరా వరకు, పారిశుద్ధ్యం నుంచి ఆహారం, పోషకాహారం దాకా మన కర్తవ్యాల నిర్వహణ, మనం చేయాల్సిన కృషి అసంపూర్ణంగా ఉన్నాయి. సరే, ఆరోగ్యం, విద్య గురించి చెప్పనే అవసరం లేదు. ప్రభుత్వం కొన్ని పథకాలను రూపొందించి అమలుపరుస్తుందని మనకు తెలుసు. ప్రస్తావిత రంగాలకు బడ్జెట్ కేటాయింపులు కూడా చేసింది. ప్రజలకు సంక్షేమం, శ్రేయస్సు సమకూర్చే కృషి



కొనసాగుతోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో పాత్రికేయులు దేశంలో నలుమూలలా పర్యటించారు. వివిధ సమస్యలపై ప్రజల అభిప్రాయాలను విన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కదా ప్రజల అభిప్రాయాలు పరిగణన పొందేది! పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగమే అసంఖ్యాక ప్రజలకు అమిత ఆందోళనకరంగా ఉన్నది. స్వచ్ఛమైన తాగునీటి కొరత, పారిశుద్ధ్యంలోటు ప్రజలను బాగా కలతపెడుతున్న సమస్యలలో ప్రముఖంగా ఉన్నాయి. ఇంధన సంక్షోభం ఇప్పటికీ తీవ్రంగా ఉన్నది. ఎల్‌పిజి సిలెండర్ ధర భరించలేనిదిగా ఉన్నది. విద్యుత్ సరఫరాపై నిశ్చింతకు ఆస్కారం లేదు. రైతులు ఇప్పటికీ నానా దురవస్థల్లో కునారిల్లుతున్నారు. వ్యవసాయ రంగంలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఇంకా ఎంతో పనిచేయాల్సి ఉన్నది.

అభివృద్ధికై సంకల్పించిన అనేకానేక పనులు అసంపూర్ణంగా ఉండిపోవడంపై ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఇండియా ఒక సువిశాల దేశం. పాలనలో ఎన్నో లొసుగులు, లోపాలు ఉన్నాయి. ఏ ప్రభుత్వ పథకమైనా సమాజంలో అట్టడుగు స్థానంలో ఉన్న సామాజిక వర్గం వారికి చేరాలి – ఏదో ఒకసారి కాదు, ప్రతిసారీ అనునిత్యమూ సుమా! ఇదే సమయంలో వాతావరణ మార్పు విషమ ప్రభావం మనకు స్పష్టంగా కనపడుతోంది. ప్రతి రోజూ దేశంలో ఏదో ఒక ప్రాంతం కనీసం ఒక వాతావరణ వైపరీత్య ఘటనతో అల్లాడిపోతోంది. ఇది అభివృద్ధి కార్యక్రమాల పురోగతికి అవరోధమవుతోంది. అకాల వర్షాలు, తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులు మరిన్ని కరువుకాటకాలు, వరదలు, దుర్భిక్షాలకు దారి తీస్తున్నాయి. జీవనాధారాలను తీవ్రంగా దెబ్బకొడుతున్నాయి. ప్రభుత్వ వనరులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఈ పరిస్థితి సూచిస్తున్నదేమిటి? అభివృద్ధి సాధన మరింత సమర్థంగా జరగాలి. వృద్ధి ఫలాలు సత్వరమే మరింత అధికస్థాయిలో ప్రజలకు చేరేలా చూడటమూ చాలా ముఖ్యం. ఈ దుర్భర పరిస్థితులు మారిపోయేందుకు, మరింత శుభస్కర పరిస్థితులు నెలకొనేందుకు తదుపరి ప్రభుత్వ కొత్త ఎజెండా – కొత్త ప్రభుత్వం వాస్తవానికి పాత సర్కారే అయినప్పటికీ – ఈ కింద సూచించిన విధంగా భిన్నంగా ఉండితీరాలి.

తొట్టతొలుత మరింత జవాబుదారీతనంతో వ్యవహరించేలా సంస్థలను పునర్నిర్మించడంపై కొత్త సర్కార్ ప్రథమ ప్రాధాన్యమివ్వాలి. భిన్న దృక్పథంతో ఆలోచించేవారిని, భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసినవారిని ప్రభుత్వ శత్రువుగా భావించకూడదు. ప్రత్యామ్నాయ సమాచారం అసమ్మతి

కాదు, ప్రభుత్వంపై గురిపెట్టిన విమర్శా కాదు. ప్రత్యామ్నాయ వార్తలు, విశ్లేషణలను అభివృద్ధి సాధనకు జరిగే దోహదంలో భాగంగా చూడాలి. ఏది ప్రయోజనకరంగా పనిచేస్తుంది, ఏది లక్ష్య పరిపూర్తికి తోడ్పడటం లేదు అన్న విషయమై మనం ఎంత ఎక్కువగా తెలుసుకుంటామో పాలన అంతగా మెరుగుపడుతుంది. ప్రస్తుతం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నవారిని బలవంతంగా మౌనం వహించేలా చేస్తున్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరగకపోవచ్చు కానీ పాలకులకు ఇష్టమైనవే ఆమోదయోగ్యమయ్యేట్టు చేస్తుంది. ప్రభుత్వ వందిమాగధులకే ప్రాధాన్యం లభించేట్టు చేస్తుంది. ఇదెంతమాత్రం క్షేమకరం, శ్రేయస్కరం కాదు. ఇటువంటి పాలనా ధోరణులు ఒక ప్రభుత్వాన్ని ప్రజల నిరాదరణకు గురిచేస్తాయి. ప్రజావాణిని వినని, గౌరవించని పాలకులు ఆదరణ ఎలా పొందగలుగుతారు? కనుక నిష్పాక్షికంగా ఉండటమనేది ప్రభుత్వ ఎజెండా కావాలి. విశాల దృక్పథంతో ఉండాలి. ఎటువంటి దాపరికం లేనిదిగా, అందరూ పాల్గొనదగినదిగా ఉండాలి. దీనర్థం ప్రభుత్వ కమిటీలలో అందరికీ చోటు కల్పించడం కాదు. సమాచారాన్ని గుర్తించడం, భావాలు, అభిప్రాయాలను గౌరవించడం, నమ్మకాన్ని పునరుద్ధరించుకోవడం చాలా కీలకం. పథకాలు సఫలమయ్యేందుకు మాత్రమే కాదు, సమాజాలు శీఘ్రగతిన పురోగమించేందుకు కూడా.

నవ భారతదేశ నిర్మాణానికి కొత్త ఆలోచనలు, కార్యాచరణలకు దోహదం చేసే సంస్థలు అవసరం. కాలుష్య నియంత్రణకు ఏర్పాటు చేసిన ఏజెన్సీలనే తీసుకోండి, అవి అర్థరహితంగా పరిణమించాయి. వాటిలో కొన్ని కాలుష్యంపై పోరుకు సంబంధించిన వాణిజ్యం నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నించాయి. యదార్థమేమిటంటే కాలుష్యాన్ని నియంత్రించేందుకు జవాబుదారీతనంతో నిరోధాలను పటిష్ఠంగా అనువర్తింప చేసే సంస్థలు అవసరం. ఇబ్బందికరమైన, కఠోర నిర్ణయాలు తీసుకుని వాటిని కచ్చితంగా అమలుపరిచే సామర్థ్యమూ వాటికి ఉండాలి. మరి ఈ సామర్థ్యమే ఇప్పుడు పూర్తిగా కొరవడింది. కాలుష్యం పెరిగిపోతోందంటే ఆశ్చర్యమెందుకు? కాలుష్యం తగ్గిపోదు. మన నదులలోను, వాయుతలంలోను అది సర్వత్రా ఆవరించి ఉన్నది, ఉంటుంది.

ఈ పరిస్థితి లేకుండా పోవాలంటే మనకు రెండు కొత్తతరం సంస్కరణలు అవసరం. ఒకటి– స్థానిక ప్రజలు పాల్గొనే కిందిస్థాయి సంస్థలను పటిష్ఠ పరచాలి. అభివృద్ధి కార్యక్రమాలు ప్రయోజనకరంగా అమలయ్యేందుకు ప్రజలు క్రియాశీలంగా పాల్గొనే ప్రజాస్వామ్యం మనకు ఎంతైనా

**నవ భారతదేశ నిర్మాణానికి కొత్త ఆలోచనలు, కార్యాచరణలకు దోహదం చేసే సంస్థలు అవసరం. కాలుష్య నియంత్రణకు ఏర్పాటు చేసిన ఏజెన్సీలనే తీసుకోండి, అవి అర్థరహితంగా పరిణమించాయి. వాటిలో కొన్ని కాలుష్యంపై పోరుకు సంబంధించిన వాణిజ్యం నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నించాయి. యదార్థమేమిటంటే కాలుష్యాన్ని నియంత్రించేందుకు జవాబుదారీతనంతో నిరోధాలను పటిష్ఠంగా అనువర్తింప చేసే సంస్థలు అవసరం.**

అవసరం. స్థానిక స్వపరిపాలన సంస్థల సాధికారతకు ఉద్దేశించిన 73, 74 రాజ్యాంగ సంస్కరణలను ఆమోదించి 30 సంవత్సరాలు గడిచిపోయాయి. మరి గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, పట్టణ ప్రాంతాలలో మునిసిపల్ వ్యవస్థ మెరుగుపడ్డాయా? గ్రామసభలను పటిష్ఠపరచడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత ప్రగాఢం చేసే ప్రయోగాలు చేశాము. అయితే ఈ కృషి అంతా అసంపూర్ణంగా మిగిలిపోయింది. సహజ వనరులపై గ్రామీణ, పట్టణ ప్రభుత్వాలకు మరింత నియంత్రణాధికారాలను కల్పించేందుకు చేయవలసింది ఎంతో ఉన్నది. నిధులు సమకూర్చుకునేందుకు, పథకాల నిర్వహణకు సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త ఉద్యోగాలను సృష్టించేందుకు, జీవనాధారాలను పెంపొందించుకునేందుకు సహజ వనరుల అభివృద్ధికి మరింతగా మదుపులు చేయవలసి ఉన్నది.

చివరిగా మన అభివృద్ధి పథకాలను కొత్త భావాలతో రూపొందించవలసిన అవసరమున్నది. చాలాకాలంగా ప్రభుత్వాలు సంక్షేమ దృక్పథం– దీన్ని తరచు బిచ్చం వేయడంగా కొట్టివేస్తున్నారు. నా అభిప్రాయంలో వాతావరణ మార్పుతో కొట్టుమిట్టాడుతున్న ఈ కాలానికి ఒక కొత్త దృక్పథం అవసరం. ఆలోచనలు మారాలి. ఆచరణలు విధిగా ప్రయోజనకరం కావాలి. మనం ప్రతి రంగంలోనూ వినూత్న భావాలతో, నవ్య కార్యాచరణ ప్రణాళికలతో పనిచేయవలసి ఉంది. అభివృద్ధి సమ్మిళితంగాను, సాధించదగినదిగాను, నిలకడగా ఉండి తీరాలి. ఇందుకు పథకాల రూపకల్పనలోనే కాదు వాటి అమలు తీరుతెన్నులలో కూడా మార్పులు అవసరం. ధరిత్రిని కాపాడే కొత్త అభివృద్ధి నమూనా అవసరం ఎంతైనా ఉన్నది. ఆ నమూనా చిట్టచివరి వ్యక్తికి సైతం భరోసా సమకూర్చేదిగా ఉండాలి. అవును, ఈ అంశంపైనే కొత్త – పాత ప్రభుత్వం తన దృష్టిని కేంద్రీకరించాలి. ❖

**(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

# స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికలే జరపాలి!

-బండారు రామ్మోహనరావు

తెలంగాణ రాష్ట్రంలో 2024 జనవరి 31 నాటికి గ్రామపంచాయతీల సర్పంచులు వార్డు మెంబర్ల పదవీకాలం ముగిసింది. గత ఆరు నెలల నుండి గ్రామపంచాయతీలలో అధికారుల ఆధ్వర్యంలో పర్సన్ ఇన్చార్జిల పాలన కొనసాగుతుంది. ఇక ఈ జూన్ చివరికి ఎంపీటీసీలు ,జెడ్ పి టి సి లు, మండల అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ల పదవీ కాలం కూడా పూర్తయింది. మరి కొద్ది రోజుల్లోనే 2025 జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 169 మున్సిపాలిటీలలో సింహభాగం పదవీకాలం పూర్తవుతుంది. అలాగే నగరపాలక సంస్థల పదవీకాలం కూడా 2025 మార్చిలోగా పూర్తవుతాయి.



పంచాయతీ ఎన్నికలకు కుల గణన సాకుగా చూపిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సమాయుత్తం కావడం లేదు. పదవీకాలం పూర్తయిన పంచాయతీలకు ఎన్నికలు జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక షరతు పెట్టింది. అదేమిటంటే రాష్ట్రంలో కుల గణన జరిగిన తర్వాత మాత్రమే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెబుతుంది. ఇప్పటికైతే కుల గణన కోసం కమిషన్ ఏర్పాటు చేయలేదు. కనుక కమిషన్ ఏర్పాటు చేసి ఆ తర్వాత జనాభా లెక్కలు తీసి కులాల ప్రకారం లెక్కించి ఎన్నికలు జరపడానికి మరో సంవత్సరం పట్టే అవకాశం ఉంది. 2025 మార్చి లోపు తెలంగాణ రాష్ట్రంలోని మండలాలు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పదవీకాలం కూడా పూర్తి అయిపోతుంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకోవాలి. 73,74 వ రాజ్యాంగ సవరణల ప్రకారం ఆయా రాష్ట్రాలకు స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు జరపడానికి ఎన్నికల కమిషన్లు ఏర్పాటు అయి ఉన్నాయి. ఏ స్థానిక ప్రభుత్వ పదవీకాలం పూర్తి కాక ముందే మూడు నెలల ముందుగా ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ చట్టబద్ధంగా ప్రారంభించవచ్చు. కానీ ఇందులో ఒక చిక్కు సమస్య ఉంది. స్థానిక ప్రభుత్వాల నియోజకవర్గాల పునర్విభజన డిలిమిటేషన్ తోపాటు ఆయా కులాలకు వర్గాలకు రిజర్వేషన్ల ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. ఆ ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల కమిషన్ కి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపితే వారు అప్పుడు ఎన్నికలు పెట్టవచ్చు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రంలో ఒక వెసులుబాటు కూడా ఉంది. ఇప్పటికే అనేక కొత్త జిల్లాలు రెవిన్యూ డివిజన్లు మండలాలు ఏర్పడి ఉన్నాయి. అలాగే స్థానిక ప్రభుత్వాల రిజర్వేషన్లను రెండవసారి అవే రిజర్వేషన్లు కొనసాగుతాయని అప్పటి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా రాజకీయ నిర్ణయం తీసు కొని చట్టం చేసి ఒక జీవో జారీ చేసింది. కనుక ప్రస్తుతం రెండవసారి ఈ ఆయా స్థానిక ప్రభుత్వాలు నియోజ కవర్గాలకు రిజర్వేషన్లు అవే కొనసాగుతాయి. కనుక ఈ రెండు ఇబ్బందులు ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు లేవు. కనక ఈ సంవత్సరం చివరికల్లా అక్టోబర్ నవంబర్ డిసెంబర్ నెలలో పంచాయతీ స్థాయి నుంచి జిల్లా పరిషత్ వరకు మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్ల వరకు ఈ ఎన్నికలు జరపడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి వెసులుబాటు ఏర్పడింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిపై ఎన్నికలు జరిగే వీలు ఉంది. ఒకరకంగా చెప్పాలంటే దేశంలో జమిలి ఎన్నికల చర్చ కొనసాగుతున్న క్రమంలో రాష్ట్రంలో మరొక నాలుగు సంవత్సరాల వరకు ఏ ఎన్నికలు లేకుండా స్థానిక ప్రభుత్వాలు ఎన్నికలు పూర్తి చేసుకుంటే ఎన్నికల కోడ్ పేరు మీద ప్రతిసారి ఆంక్షలు విధించే సందర్భం ఉండదు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కుంటు పడకుండా ఉంటుంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు జరిపే చిత్తశుద్ధిని ప్రకటించుకోవలసి ఉంది.

**ప్రత్యక్ష ఎన్నికలే పరిష్కారం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదలైన ప్రత్యక్ష ఎన్నికల చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. స్థానిక ప్రభుత్వాలు ఎన్నికలు గతంలో ఉమ్మడి రాష్ట్రంలో టంగుటూరి అంజయ్య ముఖ్యమంత్రిగా ఉండగా అప్పటిదాకా ఆనాటి పంచాయతీ

సమితి అధ్యక్ష ఎన్నికలు పరోక్షంగా జరిగేవి. ఆయా పంచాయతీ సమితిలో ఉన్న ఆయా గ్రామాల సర్పంచులందరూ సమితి అధ్యక్షుడికి ఓటు వేసేవారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రమేయం ఉండకపోయేది. కానీ ఆనాడు అంజయ్య 1981 లోనే పంచాయితీ సమితి స్థాయిలో ప్రత్యక్ష ఎన్నికలు ప్రవేశపెట్టి ఒక విప్లవానికి దారి చూపించారు. జిల్లా పరిషత్తుల అధ్యక్షులకు మాత్రం పరోక్ష ఎన్నికలే జరిగాయి. ఆయా జిల్లాలోని సమితి అధ్యక్షులు అందరూ కలిసి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ను ఎన్నుకునేవారు. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికైన నందమూరి తారక రామారావు 1987 లో ఆనాటి పంచాయతీ సమితిల స్థానంలో వికేంద్రీకరణ చేసి నూతన మండల వ్యవస్థ తీసుకువచ్చి గొప్ప విప్లవానికి దారి తీశారు. 150,160 గ్రామాలు ఉన్న పంచాయతీ సమితిల నుండి 15 నుండి 30 గ్రామాల గ్రామాల పరిధిలో 35 వేల నుండి 50 వేల జనాభా లోపు జనాభాకు పరిమితం చేస్తూ ఒక మండలాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులకు జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులను నేరుగా ప్రజలే ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానాన్ని మొదలుపెట్టి మరొక విప్లవాన్ని ఆయన ఈ ఎన్నికలలో ప్రవేశపెట్టారు. స్థానిక ప్రభుత్వాలలో ఉన్న మూడంచెల స్థాయిలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా సర్పంచ్‌లే కాకుండా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు ప్రత్యక్షంగా ఎన్నిక కావడం వల్ల అవిశ్వాస తీర్మానాల ఉనికి ప్రశ్నార్థకం అయింది. అవిశ్వాస తీర్మానాలు అవసరమే లేకుండా పోయింది. అలాగే అవిశ్వాస తీర్మానాల వల్ల తమ పదవి పోతుందని ఎవరికీ భయపడకుండా ప్రత్యక్షంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు నిర్భీతిగా తాము అనుకున్న అభివృద్ధిని సాధించడానికి మండల జిల్లా స్థాయిలో ఆనాటి ప్రజా ప్రతినిధులకు ఒక విశ్వాసం కలిగింది. భరోసా ఏర్పడింది. కానీ ఆ తర్వాత వచ్చిన 73 ,74 వ రాజ్యాంగ సవరణ ద్వారా కొత్తగా మండల పరిషత్ టెరిటోరియస్ కాన్స్టెన్సీ (ఎంపీటీసీలు) జిల్లా పరిషత్ టెరిటోరియల్ కాన్స్టెన్సీ (జెడ్పిటిసిలు) అనే కొత్త పదవులు వచ్చి చేరాయి. దాంతో ఆనాడు ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికల స్థానంలో మళ్లీ పరోక్ష ఎన్నికలు ప్రవేశపెట్టింది. దీని ద్వారా పరోక్ష ఎన్నికల ద్వారా ఎన్నికైన మండల అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లపై అవిశ్వాస తీర్మానాల పరంపర మళ్లీ మొదలైంది. ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి మొదట్లో ఎన్నికైన రెండు సంవత్సరాల వరకు అవకాశం లేదు. కానీ ఆ తర్వాత అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి నాలుగు సంవత్సరాలు కాల పరిమితికి పెంచడం వల్ల అసలు అవిశ్వాస తీర్మానాల ఉనికే ప్రశ్నార్థకం అయింది. ఈ దశలో ఆనాడు ఎన్.టి.రామారావు చేసిన ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావాల్సిన చారిత్రక అవసరం ఈనాడు ఏర్పడింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే గ్రామపంచాయతీ సర్పంచులతో పాటే మండల పరిషత్ అధ్యక్షులకి జిల్లా పరిషత్ అధ్యక్షులకు కూడా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తే అప్పుడు ఈ అవిశ్వాస తీర్మానాల గొడవసద్దుమణుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఈ ఆయారాం గయారాం వ్యవస్థ ఉండదు. స్థానిక ప్రభుత్వాలు మరింత పటిష్టం కావడానికి ప్రత్యక్ష ఎన్నికలే ప్రామాణికం అవుతాయి. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేయాలని స్థానిక ప్రభుత్వాల సాధికారత సమాఖ్య వేదిక కోరుతుంది.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికైన నంద మూరి తారక రామారావు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులకు జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులను నేరుగా ప్రజలే ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానాన్ని మొదలుపెట్టి మరొక విప్లవాన్ని ఆయన ఈ ఎన్నికలలో ప్రవేశపెట్టారు. స్థానిక ప్రభుత్వాలలో ఉన్న మూడంచెల స్థాయిలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా సర్పంచ్‌లే కాకుండా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జిల్లా పరిషత్ అధ్యక్షులు ప్రత్యక్షంగా ఎన్నిక కావడం వల్ల అవిశ్వాస తీర్మానాల ఉనికి ప్రశ్నార్థకం అయింది. అవిశ్వాస తీర్మానాలు అవసరమే లేకుండా పోయింది.**

**ఇంటి ముందు ప్రభుత్వం- కంటి ముందు పాలన**

వంటిపని కైనా ఇంటివాడు ఉండాలని సామెత. అలాగే స్థానిక ప్రభుత్వాలు పటిష్టంగా ఉంటే గ్రామాలు పట్టణాలు మరింత అభివృద్ధి చెందుతాయి. తుమ్మితే ఊడిపోయే ముక్కు లాగా స్థానిక ప్రభుత్వాలు ఉన్నంతకాలం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వాటి మీద పెత్తనం చలాయిస్తాయి. ప్రతిరోజు పరగడుపులాగా స్థానిక ప్రభుత్వాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లమీద, భిక్ష మీద ఆధారపడి నడిస్తే స్థానిక ప్రభుత్వాలకు స్థానికంగా ఆర్థిక సాధికారత లభించదు. ప్రతిరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎంగిలి మెతుకుల విదిలింపు పై స్థానిక ప్రభుత్వాలు ఆధారపడితే వాటికి స్వాతంత్రం ఉండదు. ప్రస్తుతం దేశంలో కానీ రాష్ట్రంలో కానీ కొన్ని రాష్ట్రాలను మినహాయిస్తే ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎమ్మెల్యేల రాజ్యం, ఎంపీల రాజ్యమే నడుస్తుంది. గ్రామాలలో లబ్ధిదారులు ఎంపిక నుంచి మొదలుకొని అంగన్వాడి ఆయా, టీచర్ల నియామకం, ఆశా వర్కర్ల నియామకం రేషన్ షాపు డీలర్ల నియామకం వరకు అన్ని స్థాయిలలో ఎమ్మెల్యేల పెత్తనం కొనసాగుతుంది. ఇది మారాలంటే స్థానిక ప్రభుత్వాలకు చట్టబద్ధ అధికారాలు ముఖ్యంగా 73,74 వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు బదలాయించవలసిన 29 అధికారాలు మున్సిపాలిటీలకు కేటాయించవలసిన 18 అంశాలు పూర్తిగా బదలాయించినప్పుడే స్థానిక ప్రభుత్వాలకు నిజమైన అధికారాలు ఇచ్చినట్టు లెక్క.

**స్థానిక ప్రభుత్వాల సాధికారత సమాఖ్య వేదిక**

స్థానిక ప్రభుత్వాల నాయకుల మీద అవినీతి ముద్ర వేసి వారికి

అధికారం ఇస్తే పూర్తిగా అవినీతి పరుల చేతిలో స్థానిక ప్రభుత్వాలు పెట్టినట్లు ఉంటుంది అనే విమర్శ కూడా ఉన్నది, అది కొంతవరకు నిజమే అయినా ఎమ్మెల్యేలు ఎంపీలు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల్లో ఉన్న మంత్రులు అవినీతి చేయడం లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దూరంగా ఉన్న మంచి వాడికంటే దగ్గరగా ఉన్న చెడ్డవాడే మిన్న అనే సూత్రాన్ని మనం ఆచరిస్తే మన చుట్టుపక్కల సమాజంలో ఉన్న స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులను చొక్కా పట్టుకుని అడిగే ధైర్యం ప్రజలకు ఉంటుంది. అదే దూరంగా ఉండే ఎమ్మెల్యేలు, ఎంపీలు గన్మెన్ల రక్షణలో ఉంటారు కనుక వారిని సామాన్య ప్రజలు కలవడం కూడా కష్టం అవుతుంది. అందుకే “ఇంటి ముందు పాలన కంటి ముందు ప్రభుత్వం” అనే నినాదంతో ఈ సాధికారత సమాఖ్య పనిచేస్తుంది. అధికార వికేంద్రీకరణ అవసరం కానీ అది అవినీతి వికేంద్రీకరణ గా మారకూడదు అన్నది కూడా సమాఖ్య ఉద్దేశం. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న పంచాయితీ, మండల, జిల్లా పరిషత్ అంచెలలోని మూడు స్థాయిలోని స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికల నిర్వహించాలి అని డిమాండ్ చేస్తుంది. అలాగే వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తిచేసుకుని తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనించాలని స్థానిక ప్రభుత్వాలకు పూర్తి అధికారాలు బదలాయించాలని ఈ సమాఖ్య కోరుతుంది. ఈ డిమాండ్లతో ఇటీవలనే హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో స్థానిక ప్రభుత్వాల సాధికారత వేదిక తెలంగాణ రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడిగా నేను ఎన్నికయ్యాను. ఇది పార్టీలకు కులాలకు ప్రాంతాలకు పదవులకు అతీతంగా పనిచేస్తుంది. ఇప్పటికే పార్టీల వారీగా ఉన్న సంఘాల అలాగే పదవుల వారి ఉన్న సంఘాలకు అతీతంగా స్వతంత్ర సంఘంగా ఇది అందరినీ కలుపుకొని పోతుంది. ఈ వేదిక తరపున రాష్ట్ర తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి వెంటనే పంచాయతీలకు ఇతర స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు జరిపించాలని, అది ప్రత్యక్ష ఎన్నికలు మాత్రమే జరిపించాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించి పంపించడం జరిగింది. ఈ తీర్మానం పట్ల సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

❖

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యం తగదు




**ఎన్నికల్లో వేలం అనేది పోవాలని, అప్పుడే సర్పంచి పదవులను వేలంలో కొనే విధానానికి అడ్డుకట్ట వేయొచ్చని ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికలకు రాజకీయ రంగుపూసి గ్రామస్థాయిలో నాయకత్వాన్ని ఎదగనివ్వడం లేదని, ఎమ్మెల్యేలు తమ ఉనికికి దెబ్బతగులుతుందని భావించి ఇలా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'స్థానిక ప్రభుత్వాత సాధికరత వేదిక' ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చా వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి వేదిక అధ్యక్షులు, లోక్‌సత్తా ఉద్యమసంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వకర్త బండారు రామ్మోహనరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తిచేసుకుని తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనించాలని స్థానిక ప్రభుత్వాలకు పూర్తి అధికారాలు బదలాయించాలని బండారు రామ్మోహనరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వాల సాధికారతకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి వేదిక తరపున ఓ లేఖను పంపారు. ఈ చర్చా వేదికలో రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాదయ్య గౌడ్, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్ , వేదిక కోఆర్డినేటర్ వీవీ రావు. సీజీజీ కార్యదర్శి శ్రీనివాస మాధవ్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.**









# ఆర్వెల్ '1984'పై ఆలోచనాత్మక చర్చ




జార్జి ఆర్వెల్ '1984' నవల, కాలం కంటే 75 ఏళ్లు ముందుగా వచ్చింది" అనే అభిప్రాయంపై కోల్‌కతాలోని టోలీగంజ్ క్లబ్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. ఆలోచన రేకెత్తించే అంశాలపై క్లబ్ ఏటా చర్చ నిర్వహిస్తుంటుంది. జేపీతోపాటు పవన్ వర్మ, డా. షమా మహమ్మద్, ఆర్. బల్కి, రవీష్ కుమార్, దేశ్‌రతన్ నిగమ్, స్వపన్ దాస్ గుప్తా, డా॥ రిమి బర్నాలి ఛటర్జీ వక్తలుగా అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కునాల్ సర్కార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th July, 2024 Posting Date 15 &16th of every month

# క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
# జనబలం చందాదారులుగా చేరండి

DIGIधन

SBI

**Merchant Name : FOUNDATION FOR DEMOCRATIC**

**UPI ID : 52086568057@sbi**

BHIM UPI

G20 भारत 2023 INDIA

वसुधैव कुटुम्बकम्

ONE EARTH • ONE FAMILY • ONE FUTURE

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**